

ఎర్రగొండపాలెంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎరిక్షన్‌బాబు, టీడీపీ నేతలు



దర్శిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి లక్ష్మి, కూటమి పార్టీల నాయకులు

జిల్లా పునర్విభజన విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న తాజా నిర్ణయంపై ఉమ్మడి జిల్లా వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చడంతో వారు సంబరాల్లో మునిగిపోయారు. సీఎం చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తున్నారు. తమకు అనుకూలంగా ఉండే ప్రకాశం జిల్లాలోకి తిరిగి చేర్చడం కందుకూరు, అద్దంకి నియోజకవర్గాల ప్రజల్లో జోష్ నింపింది. తమ ప్రాంతాన్ని ప్రకాశంలోనే కొనసాగించడం పట్ల దర్శి నియోజకవర్గ ప్రజలు ఆనందంగా ఉన్నారు. అదే సమయంలో మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటుపై సంతోషంగా ఉన్నప్పటికీ రెవెన్యూ డివిజన్ విషయంలో తమకు అన్యాయం జరిగిందని గిద్దలూరు ప్రాంత ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.



చంద్రన్న మార్కాపురం జిల్లా పేరుతో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే కందుల, కూటమి పార్టీల నాయకులు

జిల్లా సంబరం

పునర్విభజనపై హర్షాతిరేకాలు

పండుగ చేసుకుంటున్న పశ్చిమప్రాంత ప్రజానీకం

- పలుచోట్ల సీఎం చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం
- దర్శి నియోజకవర్గ ప్రజల్లో ఆనందం
- తిరిగి ప్రకాశంలో చేరికపై అద్దంకి, కందుకూరు ప్రాంత ప్రజల హర్షం
- రెవెన్యూ డివిజన్ విషయంలో గిద్దలూరు వాసుల్లో అసంతృప్తి



బాణ సంచా కాలుస్తున్న మార్కాపురం జిల్లా సాధన సమితి ప్రతినిధులు

ఒంగోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా ప్రజల్లో నూతనోత్సాహం నెలకొంది. ముఖ్యంగా పశ్చిమప్రాంత వాసులు సంబరాలు చేసుకుంటున్నారు. సీఎం చిత్రపటాలకు పాలాభిషేకాలతో కృతజ్ఞతలు తెలుపుతున్నారు. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులను సుదీర్ఘంగా సమీక్షించి తుది నిర్ణయాన్ని సీఎం చంద్రబాబునాయుడు తీసుకున్న విషయం విదితమే. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 26 జిల్లాలకు అదనంగా మరో మూడు జిల్లాలు, అలాగే కొత్తగా నాలుగు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. 17 జిల్లాల్లో వివిధ ప్రాంతాల సర్దుబాట్లకు అనుమతించారు. అలాంటి సర్దుబాట్లు, కొత్తవాటి ఏర్పాటులో ప్రధాన భాగస్వామ్యం ప్రకాశం జిల్లాకు అధికంగా ఉంది. ప్రస్తుతం ఒంగోలు కేంద్రంగా ఎనిమిది నియోజకవర్గాలతో ఉన్న మన జిల్లాలో పశ్చిమప్రాంతంలోని మార్కాపురం, గిద్దలూరు, ఎర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాలతో మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ప్రకటించారు. మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లో మార్కాపురం, వైపాలెం నియోజకవర్గంలోని మండలాలు, కనిగిరి డివిజన్‌లోకి కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గంలోని మండలాలు కేటాయించారు. అలా నాలుగు నియోజకవర్గాలు, రెండు రెవెన్యూ డివిజన్లు, 21 మండలాలతో కొత్తగా మార్కాపురం జిల్లా ఏర్పాటు కానుంది.

ప్రకాశంలో మూడు రెవెన్యూ డివిజన్లు

ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి, దర్శితో పాటు గతంలో నెల్లూరు జిల్లాలోకి వెళ్లిన కందుకూరు, బాపట్ల జిల్లాలోకి వెళ్లిన అద్దంకి అసెంబ్లీ నియోజకవర్గాలు కలిపి ప్రకాశం జిల్లాగా ఉండనుంది. ఈ పరిధిలో ఇప్పటికే ఉన్న ఒంగోలు, కందుకూరుతోపాటు కొత్తగా అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తున్నారు. అద్దంకి, దర్శి నియోజకవర్గాల్లోని పది మండలాలను అందులో ఉంచుతున్నారు. కొండపి నియోజకవర్గంలోని

మిగతా 6వ పేజీలో

చంద్రన్న రుణం తీర్చుకుంటాం

- ఇక ఏటా పండుగలా సీఎం పుట్టినరోజు
- మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైన పశ్చిమ ప్రకాశం ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు రుణం తీర్చుకోవాలంటే చంద్రన్న మార్కాపురం జిల్లా పేరుతోనే సాధ్యమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మంత్రివర్గ ఉపసంఘం నివేదిక ఆధారంగా మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి అంగీకారం తెలపడంతో ఆ ప్రాంతంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కూటమిలోని పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే నారాయణరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలకులు ఓట్లు దండుకుని ఈ ప్రాంతానికి పలు విధాలుగా అన్యాయం చేశారని విమర్శించారు. ఆనాడు జిల్లాల పునర్విభజనలో మార్కాపురం కేంద్రంగా జిల్లా చేసేందుకు అవకాశం ఉనప్పటికీ పట్టించుకోకుండా నయవంచనకు గురిచేశారన్నారు. కలసివచ్చిన రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌరులతో పోరాటం చేస్తే నాటి వైసీపీ

మిగతా 6వ పేజీలో



అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో మాట్లాడుతున్న రమ్యశ్రీ

మాక్ అసెంబ్లీలో అదరగొట్టిన రమ్యశ్రీ

- హోంమంత్రిగా తనదైన పాత్ర పోషించిన గిద్దలూరు విద్యార్థిని
- దీటైన సమాధానాలతో అందరి నుంచి ప్రశంసలు

గిద్దలూరు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో జరిగిన రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీలో గిద్దలూరుకు చెందిన ఎస్.రమ్యశ్రీ హోంమంత్రి పాత్ర పోషించింది. తనదైన శైలిలో అదరగొట్టింది. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రమ్యశ్రీ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో పాల్గొంది. ఆ విద్యార్థినికి హోంమంత్రిగా బాధ్యతలు ఇచ్చారు. ప్రతిపక్ష సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు రమ్యశ్రీ తనదైన శైలిలో సమాధానాలు ఇచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర మంత్రులను అబ్బురపరిచింది. గంజాయి, వివిధ రకాల డ్రగ్స్ కారణంగా కళాశాలల్లోని విద్యార్థులు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, దీనిపై ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటున్నదని ప్రతిపక్ష సభ్యులు నిలదీయగా హోంమంత్రిగా రమ్యశ్రీ దీటైన సమాధానాలను చెప్పింది. గంజాయి, డ్రగ్స్‌ను ఎంత స్థాయిలో పట్టుకున్నదని, ఎంత మందిని అరెస్టు చేసింది వివరించింది. రాబోయే పదేళ్లలో రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దుతామని బదులిచ్చింది. మరో ప్రశ్నకు సమాధానంగా ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి గంజాయి, డ్రగ్స్ తీసుకుంటే కలిగే నష్టాలపై విద్యా సంస్థలు, ప్రజల్లో అవగాహన కల్పిస్తామని సభకు హామీ ఇచ్చింది. మాక్ అసెంబ్లీలో హోంమంత్రిగా అదరగొట్టిన రమ్యను పాఠశాల హెచ్‌ఎం, ఎంఈవో పి.నాగభూషన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మెప్మా చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

- అవినీతి, అక్రమాలపై విచారణకు జేసీ చైర్మన్‌గా కమిటీ నియామకం
- సభ్యులుగా జడ్పీ సీఈవో, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్
- రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం
- రాష్ట్ర కార్యాలయం నుంచి ఐదుగురితో మరో కమిటీని నియమించిన మిషన్ డైరెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో అవినీతికి పాల్పడిన వారి చుట్టూ ఉచ్చుబిగుస్తోంది. ఇప్పటికే పీడీ శ్రీహరి ఆధ్వర్యంలో ఏడుగురు సభ్యులతో విచారణ ప్రారంభమైంది. 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన వరుస కథనాలకు కలెక్టర్ కూడా స్పందించారు. విచారణకు కమిటీని ఏర్పాటు చేశారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ చైర్మన్‌గా, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవిని సభ్యులుగా నియమించారు. రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మెప్మాలో కొందరు ఆర్పీలు బోగస్ గ్రూపులు సృష్టించి కోట్లు దండుకున్నారు. దీంతో బాధిత మహిళలు రోడ్డెక్కారు. ఈ బాగోతంలో ఆర్పీలతో కార్యాలయంలోని సీవోలు, సీఎంఎంలు, బ్యాంకు లింకేజీ అధికారి, బ్యాంకర్లు కుమ్మక్కైన విషయం ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో

మిగతా 6వ పేజీలో

రాష్ట్ర కార్యాలయ అధికారులతో మరో కమిటీ

మెప్మా మిషన్ డైరెక్టర్ బి.సునీల్‌కుమార్‌రెడ్డి ఒంగోలు కార్యాలయంలో చోటుచేసుకున్న బాగోతంపై రాష్ట్ర కార్యాలయంలో పనిచేస్తున్న ఐదుగురు అధికారులతో మరో కమిటీని నియమించారు. వీరు గురువారం నుంచి విచారణ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఆర్పీలతోపాటు బాధిత పొదుపు సభ్యులు ఉదయం 10.30 గంటలకు మెప్మా కార్యాలయానికి హాజరు కావాలని అధికారులు సమాచారం ఇచ్చారు. దీంతో బోగస్ గ్రూపులతో పెద్దఎత్తున గోల్‌మాల్ చేసిన ఆర్పీలతోపాటు వారికి సహకరించిన మెప్మా సిబ్బందిలో వణుకు మొదలైంది.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

- పలు ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులు.. ప్రతిజ్ఞలు
- ఒంగోలులో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే జనార్దన్
- మార్కాపురంలో హాజరైన ఎమ్మెల్యే నారాయణరెడ్డి



ఒంగోలులో అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే జనార్దన్, జేసీ గోపాలకృష్ణ, ఒడా చైర్మన్ రియాజ్, నగర మేయర్ సుజాత తదితరులు

ఒంగోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా బుధవారం వివిధ వర్గాల వారు ఘనంగా నిర్వహించారు. ఒకవైపు ప్రభుత్వపరంగా యంత్రాంగం, మరోవైపు దళిత, ప్రజాసంఘాలు, ఇతర సంస్థల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటూ ప్రతిజ్ఞలు, ర్యాలీలు నిర్వహించారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యున్నతమైనదని కొనియాడారు. ఒంగోలులో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక హెచ్‌సీఎం కాలేజీ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తోపాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ప్రతిజ్ఞ చేశారు. మార్కాపురం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో అక్కడ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, అంబేడ్కర్ విగ్రహాల వద్ద రాజ్యాంగ దినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. వివిధ వర్గాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



లేబర్ కోడ్స్, నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై మండిపడిన నేతలు
- ఒంగోలులో మోటార్ సైకిల్ ర్యాలీ

7

ఉసురు తీసిన అప్పులు

- గొల్లపల్లిలో రైతు ఆత్మహత్య

త్రిపురాంతకం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో పొలంలోనే పురుగు మందు తాగి రైతు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన త్రిపురాంతకం మండలం గొల్లపల్లిలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన ఓబుల రెడ్డి రమణయ్య (50) తనకున్న నాలుగెకరాల పొలంలో కొన్నేళ్లుగా మిర్చి సాగు చేస్తున్నారు. కొంత పొలం కౌలుకు తీసుకుని వరి కూడా వేస్తున్నారు. పంటలు సక్రమంగా పండకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. రూ.20లక్షల వరకూ అప్పులు ఉన్నట్లు బంధువులు తెలిపారు. ఈ విషయమై మంగళవారం భార్యతో గొడవ జరిగింది. దీంతో ఆయన మనస్తాపానికి గురయ్యారు. అప్పులు తీర్చే మార్గం కన్పించక పొలంలోనే పురుగు ముందు తాగారు. రాత్రికి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్నారు. రమణయ్య అల్లుడు వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివబసవరాజు తెలిపారు.



రమణయ్య (ఫైల్)

కీచక టీచర్‌కు బుద్ధిచెప్పారు!

- విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఆయన్ను చితకబాదిన తల్లిదండ్రులు
- ఇక నుంచి కాలేజీకి రావద్దని హెచ్చరిక
- బి.నిడమానూరులో ఘటన

నాగులుప్పలపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడికి తల్లిదండ్రులు తగిన బుద్ధిచెప్పిన ఘటన మండలంలోని బి.నిడమానూరు గ్రామంలో చోటుచేసుకుంది. తల్లిదండ్రులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న హైస్కూల్ ప్లస్ మహిళా కళాశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇంటర్ మొదటి ఏడాది విద్యార్థినులు ఐదుగురు, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు 13మంది

మిగతా 6వ పేజీలో



కాంతి తగ్గిన బంతి

- రోజురోజుకూ పడిపోతున్న పూల ధర
- కిలో రూ.60 నుంచి రూ.20కి తగ్గుదల

7

సోలార్ విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

- కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఎదురుచూపులు

రామాపురం వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణంపై రైతుల ఆశలు

7

జిల్లా సంబరం

(5వ పేజీ తరువాయి)

పొన్నలూరు, మర్రిపూడి మండలాలను తిరిగి కందుకూరు రెవెన్యూ డివిజన్‌లోకి చేర్చారు. అలా ఒంగోలు కేంద్రంగా జిల్లా విషయం అన్ని ప్రాంతాల ప్రజలకు సంతృప్తికరంగానే ఉంది. స్థానిక ప్రజల ఆకాంక్షలకు సీఎం ఓకే చెప్పారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటు విషయమై పూర్తి సంతృప్తిని పశ్చిమ ప్రాంత ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కాలంగా తాము ఎదురు చూస్తున్న మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తున్నారు. మంగళవారం రాత్రి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీతో పాటు భారీగా సంబరాలు చేశారు. బుధవారం ఎర్రగొండపాలెంలో టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు నేతృత్వంలో వేడుకలు నిర్వహించారు. మార్కాపురంలో బీజేపీ శ్రేణులు, కంభంలో వివిధ వర్గాల వారు సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

గిద్దలూరుకు డివిజన్ సమస్య

గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు మార్కాపురం జిల్లా ఏర్పాటుపై సంతృప్తితో ఉన్నప్పటికీ తమ ఎమ్మెల్యే కోరిన ప్రకారం గిద్దలూరు రెవెన్యూ డివిజన్ ఇవ్వకపోవడమే దూరంగా ఉండే కనిగిరి డివిజన్‌లో కలపడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. నిజానికి ఈ విషయంలో ఆ ప్రాంత ప్రజల ఆలోచన సరైనదిగానే భావించాల్సిన ఉంది. కనిగిరిలో ఇప్పటికే రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఉండటంతో గిద్దలూరు ప్రాంతాన్ని అందులో చేర్చినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలు మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. ఆయా మండల కేంద్రాలు మార్కాపురానికి 25 నుంచి 65 కి.మీ దూరం లోపు ఉన్నాయి. రెండు ప్రధాన జాతీయ రహదారులు, నిత్యం బస్సు సర్వీసులు, ఇతర రవాణా సౌకర్యాలతో రాకపోకలు సులువుగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఆరు మండలాలను కనిగిరి డివిజన్‌లో కలపడంతో వారు రవాణా విషయంలో తీవ్ర సమస్యగా భావిస్తున్నారు. గిద్దలూరు నియోజకవర్గం నుంచి నేరుగా కనిగిరికి రోడ్డు సౌకర్యం లేదు. గిద్దలూరు నుంచి కనిగిరి వెళ్లాలంటే నంద్యాల-ఒంగోలు రహదారిలో చిన్నారికట్ల జంక్షన్ వరకు వచ్చి తిరిగి మరో 30కి.మీ లోపలికి వెళ్లాలి. దాదాపు 100 కిలోమీటర్లకుపైగా దూరం ఉంటుంది. ఇతర మండలాల నుంచి అదే రహదారిలో ప్రయాణం చేయాలి. నేరుగా వెళ్లేందుకు ఒక్క బస్సు సౌకర్యం కూడా లేని పరిస్థితి. భూ సమస్యలు అధికంగా ఉండే గిద్దలూరు ప్రాంత వాసులకు రెవెన్యూ డివిజన్ దూరం కావడం, రవాణా సౌకర్యం సరిగా లేకపోవడం తీవ్ర ప్రతికూల పరిస్థితి.

డివిజన్ కావాలి లేదా మార్కాపురంలోనే ఉంచాలి..

ప్రస్తుతం మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పడుతుండగా గిద్దలూరు వాసులు ఎక్కడి నుంచైనా జిల్లా కేంద్రానికి ఏ సమయంలోనైనా గంట వ్యవధిలో చేరుకునే అవకాశం ఉంది. అదే కనిగిరికి వెళ్లి రావాలంటే ఒక రోజు పట్టే పరిస్థితి. దీనిపై ఆ ప్రాంత ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే మార్కాపురం జిల్లా ఏర్పాటు వల్ల కలిగిన ఉత్సాహం కన్నా కనిగిరి డివిజన్‌లో చేర్చడంపై అసంతృప్తే అధికంగా కనిపిస్తోంది. ఈ ప్రతికూల పరిస్థితిని గుర్తించిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గిద్దలూరు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ కోసం శాయశక్తులా ప్రయత్నం చేశారు. మంత్రివర్గ ఉపసంఘంతో చర్చించగా తొలుత సానుకూలత వ్యక్తం చేసినప్పటికీ చివరకు సాకారం కాలేదు. కాగా తమ ఎమ్మెల్యే కోరిన విధంగా గిద్దలూరు డివిజన్ ఏర్పాటు చేయాలని, అలా సాధ్యంకాని పక్షంలో ఇప్పటివరకు ఉన్న విధంగా మార్కాపురం డివిజన్‌లోనే తమ ప్రాంతాన్ని కొనసాగించాలన్న బలమైన ఆకాంక్ష ఆ ప్రాంత ప్రజల్లో కనిపిస్తోంది.

మా బాధలు తొలిగిపోతాయి

పొన్నలూరు మండలాన్ని తిరిగి కందుకూరు రెవెన్యూ డివిజన్‌లో కలపడం శుభపరిణామం. భూసమస్యలకు సంబంధించి పనుల కోసం ఇప్పటి వరకూ కనిగిరికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటోంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా అసంబద్ధ నిర్ణయాలు తీసుకుంది. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ఆ తప్పులను సరిచేయడంతో రైతుల బాధలు తొలిగినట్లయింది.

- గుమ్మళ్ల వెంకట్రావు, నాగిరెడ్డిపాలెం

అందరూ సంతోషిస్తున్నారు

మా గ్రామం నుంచి కందుకూరు 15 కిలోమీటర్లు. కనిగిరి వెళ్లాలంటే సుమారు 45 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వచ్చేది. అర్జీ ఇవ్వాలంటే రోజంతా పనులు మానుకుని వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. పొలాలకు సంబంధించిన పనులకు నెలలో రెండు మూడు సార్లు తిరగాల్సి రావడంతో ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయంతో మా పొన్నలూరు మండల రైతులందరికి సంతోషంగా ఉంది.

- తానికొండ వెంకటేశ్వర్లు, రావులకొల్లు

చంద్రన్న రుణం తీర్చుకుంటాం

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం అణగదొక్కిందన్నారు. 60రోజులపాటు రిలే నిరాహార దీక్షలు, ఆమరణ దీక్షకు కూర్చుంటే బలవంతంగా దీక్షలను నిలిపివేయించిందని మండిపడ్డారు.

చంద్రన్న రాకతో మారిన తలరాత

అప్పట్లో ప్రతిపక్ష నాయకుడిగా మార్కాపురం పట్టణంలో మూడు రోజుల పాటు ఉండి ఇక్కడే జన్మదిన వేడుకలు జరుపుకున్న చంద్రబాబు పశ్చిమ ప్రజల అవసరాన్ని అర్థం చేసుకున్నారని నారాయణరెడ్డి అన్నారు. ఇక్కడి ప్రజలు చేసిన ఉద్యమాన్ని తెలుసుకున్నారన్నారు. అప్పట్లో ఆయన ప్రధానంగా రెండు హామీలు ఇచ్చారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే తప్పకుండా మార్కాపురం ఇస్తానని, వెలిగొండను పూర్తిచేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడిన ఆయన జిల్లాను ప్రకటించి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చారన్నారు. ఇకపై చంద్రబాబు పుట్టినరోజును ఏప్రిల్ 20వ తేదీని ఈ ప్రాంత ప్రజలు పండుగలా జరుపుకుంటామన్నారు. నూతన జిల్లాలోని యువత భవిష్యత్ మారబోతోందన్నారు. అన్ని రకాల మౌలిక వసతులు కల్పన జరుగుతుందన్నారు. ప్రస్తుతం వెలిగొండ ప్రాజెక్టు పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే జలవనరులశాఖ మంత్రి రామానాయుడు మూడు పర్యాయాలు ప్రాజెక్టును పరిశీలించారన్నారు. 2026 చివరినాటికల్లా పూర్తి చేసి సీఎం చంద్రబాబు చేతులమీదుగా ప్రాజెక్టు ప్రారంభవంతుందన్నారు. ఈ ప్రాంత ప్రజలు చంద్రన్నను గుండెల్లో పెట్టుకుని పూజిస్తారన్నారు.

ప్రతిపక్ష నాయకులు విమర్శలు మానుకోవాలి

ప్రతిపక్ష నాయకులు నేటికీ విమర్శలు చేయడం మానుకోలేదని కందుల అన్నారు. వారు ఇవ్వకపోయినా ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం జిల్లా ప్రకటించేసరికి దాని వలన ఉపయోగం ఏంటని సిగ్గులేకుండా మాట్లాడుతున్నారన్నారు. జిల్లా ఏర్పడి అభివృద్ధి జరగడం ప్రతిపక్ష పార్టీకి ఇష్టం లేదేమో అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రితోపాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్, మంత్రులు సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, స్వామి, బీసీ జనార్దన్ రెడ్డి తదితరులకు నారాయణరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పలు ప్రజా సంఘాలు, మార్కాపురం సాధన సమితి నాయకులు, ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కూటమి నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, బెల్లంకొండ విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీంఖాన్ పాల్గొన్నారు.

కీచక టీచర్‌కు బుద్ధిచెప్పారు

(5వ పేజీ తరువాయి)

చదువుతున్నారు. సదరు కళాశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు కొద్దిరోజుల నుంచి తన పట్ల అసభ్యంగా ప్రవరిస్తున్నాడని ఓ విద్యార్థిని తల్లికి ఫిర్యాదు చేసింది. ఈక్రమంలో సదరు ఉపాధ్యాయుడిని నిలదీసేందుకు మంగళవారం విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు కళాశాలకు వెళ్లగా అతను విధులకు రాలేదు. దీంతో పెద్దమనుషులు, తల్లిదండ్రులు పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు సమక్షంలో బుధవారం కళాశాల వద్దకు అతనిని పిలిపించారు. అందరి సమక్షంలో నిలదీయడంతో ఫిర్యాదు చేసిన బాలికతోపాటు మరికొందరు విద్యార్థినులు సైతం తమతో కూడా ఆయన అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తెలిపారు. దీంతో కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు, స్థానికులు ఆ ఉపాధ్యాయుడిని చితకబాదినట్లు సమాచారం. ఆతర్వాత బాధిత విద్యార్థినులకు ఆ ఉపాధ్యాయుడితో క్షమాపణలు చెప్పించడంతోపాటు ఇకపై కళాశాలకు రావద్దని హెచ్చరించి పంపించినట్లు తెలిసింది. జరిగిన ఘటనపై విచారణ చేపట్టినట్లు ఎస్ఐ రజియాసుల్తానా తెలిపారు.

వైద్య సేవలు అధ్వానం

మార్కాపురం పెద్దాసుపత్రిలో వేధిస్తోన్న డాక్టర్ల కొరత ● 73 మందికిగాను.. ఉన్నది 13 మందే



మార్కాపురం సర్వజన వైద్యశాల

మార్కాపురం రూరల్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి) : పేరుకు పెద్దాసుపత్రి కానీ అక్కడ వైద్య సేవలు అధ్వానంగా ఉన్నాయి. పశ్చిమ ప్రకాశంలో నలుమూలల నుంచి వందల సంఖ్యలో ప్రజలు ఆరోగ్య సమస్యలతో రోజూ మార్కాపురం సర్వజన వైద్యశాలకు వస్తుంటారు. కానీ ఆసుపత్రిలో సరైన వైద్య సేవలు అందక ఉసూరుమంటూ ఒంగోలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.


73 మంది ఉండాల్సిన చోట 13 మందే

సర్వజన ఆసుపత్రిలో 73 మంది డాక్టర్లు వివిధ విభాగాలలో ఉండాల్సి ఉండగా, కేవలం 13 మంది డాకర్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. రేడియాలజీ విభాగంలో ఏడాదిగా వైద్యుడు లేక ఖాళీగా ఉంది. అత్యవసర విభాగంలో ఆరుగురు వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉన్నారు. కీలక మైన ఐసీయూ విభాగంలో 12 మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఎవరూ లేరు. కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాజీ విభాగాలకు డాక్టర్లే లేరు. ప్రస్తుతం గైనకాలజీ విభాగంలో ఒక్కరు మాత్రమే ఉన్నారు. ముఖ్యమైన విభాగాలలో డాక్టర్ల కొరత కారణంతో రోగులకు వైద్య సేవలందడం లేదు.

ఇక్కడి పెద్దాసుపత్రికి చుట్టుపక్కల గ్రామాలతోపాటు సుదూర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు వస్తుంటారు. సరైన వైద్యం అందడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వచ్చిన వారికి సేవలందించక ఒంగోలుకు రిఫర్ చేస్తున్నారు. మార్కాపురం జిల్లా అవుతున్న నేపథ్యంలో ఆసుపత్రిలో అన్ని విభాగాలకు డాక్టర్లతోపాటు అన్ని రకాల వైద్య సేవలందేలా అధికారులు, ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భగత్‌సింగ్ కాలనీకి పొంచివున్న ముప్పు

● చెరువు సప్లైచానల్ నుంచి పొంగిపొర్లుతున్న నీళ్లు



పూర్తిగా నీటమునిగిన భగత్‌సింగ్ కాలనీ ఎస్సీ, ఎస్టీల శ్మశానవాటిక

మార్కాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత పాలకుల నిర్లక్ష్యం నేడు భగత్‌సింగ్ కాలనీ వాసులకు శాపంగా మారింది. మార్కాపురం చెరువుకు నీటిని అందించే సప్లైచానల్ నుంచి నీరు భగత్‌సింగ్ కాలనీ సమీపంలోని ఖబరస్థాన్ వద్ద పొర్లుతోంది. దీంతో ప్రస్తుతం ఇళ్ల పరిసరాల్లోకి నీరు చేరింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇళ్లలోకి కూడా నీరు వెళ్లే ప్రమాదం పొంచివుంది. గత ప్రభుత్వ హయాంలో సప్లైచానల్‌కు ఆనుకుని వున్న మట్టిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు అక్రమంగా తరలించారు. దీంతో ఇళ్లవైపు ఉండే సప్లైఛానల్ కట్ట బలహీనపడింది. సుమారు పదేళ్లుగా ఎప్పుడూ ఇంత ఉధృతంగా సప్లైఛానల్ ప్రవహించలేదు. ప్రస్తుతం గుండ్లకమ్మలో సమృద్ధిగా నీరుండటంతో నిరంతరాయంగా సప్లైఛానల్ పారుతోంది. దీంతో మార్కాపురం చెరువు కూడా నిండి అలుగు పారుతోంది. అలుగు నుంచి నీటిని ఇరిగేషన్ అధికారులు మండలంలోని బోడపాడు చెరువుకు తరలిస్తున్నారు. అది నిండితే చుట్టూ ఉండే వందలాది ఎకరాల పొలాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. ఈ నేపథ్యంలోనే గుండ్లకమ్మ నుంచి నిరంతరాయంగా సప్లై ఛానల్ ద్వారా నీటిని తరలిస్తున్నారు. ఇప్పుడు అదే భగత్‌సింగ్ కాలనీ వాసులకు శాపంగా మారింది. మట్టి తరలింపుతో సప్లైఛానల్‌కు తూర్పు వైపున ఉండే అంచు బలహీనమవడంతో నీరు బయటకు వెళ్లిపోతోంది. ప్రస్తుతం ముస్లింల ఖబరస్థాన్‌ను ఆనుకుని ఉన్న ఎస్సీ, ఎస్టీల శ్మశానవాటిక పూర్తిగా నీట మునిగింది. అక్కడ నుంచి నీరు కాలనీలోని ఇళ్లవైపు వెళ్తోంది. వెంటనే ఇరిగేషన్ అధికారులు సప్లైఛానల్ నీటి మట్టాన్ని తగ్గించాలి. నీటి ప్రవాహం తగ్గిన వెంటనే సప్లైఛానల్‌కు మరమ్మతుల పనులు చేపట్టాల్సివుంది. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు దృష్టికి తీసుకెళ్లగా తాము ఆ ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. ప్రసుత్తం ఇళ్ల సమీపాల్లోకి నీరు వచ్చిందన్నారు. ఇరిగేషన్ అధికారులను నీటి ప్రవాహం తగ్గేలా చర్యలు తీసుకోవాలని చెప్పామన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ సిబ్బందిని సప్లైఛానల్‌కు మరమ్మతుల పనులు చేపట్టాలని ఆదేశించానన్నారు.

ఒక్క అభ్యర్థి పోటీలో ఉన్నా ఏకగ్రీవం కాదు



రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ఓబులేసు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల్లో ఒక్క అభ్యర్థి పోటీలో ఉన్నా ఏకగ్రీవం కాదని జిల్లా రెవెన్యూ అధికారి బీసీహెచ్ చిన ఓబులేసు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త నిబంధనల ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థి ఓటరుకు నచ్చకపోతే తన ఓటును నోటాకు వేసుకొనే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు అన్ని నియోజకవర్గాల్లో బూత్ లెవల్ ఏజెంట్ల(బీఎల్ఏ)లను ప్ర తిపోలింగ్ కేంద్రానికి నియమించుకోవాలన్నారు. రెండేసి ఓట్లు కలిగిన వారు వెంటనే ఒక ఓటును రద్దుచేసుకొని వారు నివాసం ఉన్నచోట మాత్రమే ఓటు హక్కును కలిగి ఉండాలన్నారు. అందుకు రాజకీయపార్టీలు కూడా సహకరించాలన్నారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోవడంతో పాటు 18 ఏళ్ళు నిండినయువతీ, యువకులందరూ ఓటుహక్కు కోసం దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ప్రస్తావించిన పలు అంశాలపై డీఆర్వో స్పందిస్తూ ఆయా అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, కుమారి, మాధురి, ఎన్నికల సెల్ అధికారులు శ్రీనివాసరావు, నారాయణరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంకట్రావు, డిఎస్ క్రాంతికుమార్, రఘురాం, గుర్రం సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలి

● కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు నగరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి ఇంటికీ ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయటమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ పి.రాజబాబు అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జరిగిన జిల్లాస్థాయి ఇండస్ట్రీస్, ఎక్స్‌పోర్ట్సు ప్రమోషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు పెద్దఎత్తున ప్రోత్సహించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అనుమతులను మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ప్రధాన మంత్రి విశ్వకర్మయోజన పథకం కింద 1489 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేశామన్నారు. జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం వైజాగ్‌లో నిర్వహించిన పారిశ్రామికవేత్తల సదస్సుల్లో రూ.1200 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు స్థాపించేందుకు ఐదు కంపెనీలు ఒప్పందాలు చేసుకున్నాయని ఆయన తెలిపారు. వాటిని స్థాపించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పరిశ్రమలశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాలు చేస్తున్న వ్యాపారాలు మరింత బలోపేతం చేసే దిశగా వారికి తగిన ఆర్థిక సహాయం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖకు సంబంధించి యూనిట్ల స్థాపనకు నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వాలని కోరారు. సమావేశంలో పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీహరి, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ, ట్రాన్స్‌కో ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, జిల్లా రవాణాశాఖాధికారి సుశీల, లీడ్ బ్యాంక్ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు ఎంపిక

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు ఎంపికరాయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఒంగోలులో జరిగిన 69వ సూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో విద్యార్థులు షేక్ రహమాన్, షేక్ నజీర్, షేక్ ఆరీఫ్, జి.గణేష్ అండర్ 14 జిల్లా జట్టుకు, ఎం.బాలకాశయ్య, పి.ప్రియాంత్, జి.కృష్ణవంశీ, షేక్ ముస్తాద్ వలీ అండర్ 17 విభాగంలో ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 28న కాకినాడలో జరగబోయే రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ బాలుర విభాగంలో ప్రకాశం జిల్లా తరుపున ప్రతినిధ్యం వహిస్తారని తెలిపారు.

మెప్మా చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

(5వ పేజీ తరువాయి)

స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కూడా స్పందించారు. ఒంగోలు మెప్మాలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ చేయించాలని ఆయన పురపాలక శాఖ మంత్రి నారాయణను కలిసి కోరారు. ఈనేపథ్యంలో కలెక్టర్ పి.రాజాబాబు మెప్మాలో అవినీతిపై దృష్టి సారించారు. విచారణకు కమిటీని నియమించారు.



కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులు

కరాటేలో మార్కాపురం విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే విద్యార్థులు రాజమహేంద్రవరంలో 69వ స్కూల్ గేమ్స్ కరాటే చాంపియన్ షిప్ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారని శిక్షకులు మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. షేక్ జోయాసిద్ధిఖ్ అండర్ 14లో గోల్డ్ మెడల్, షేక్ ఉస్సేన్‌బాషా అండర్ 17లో గోల్డ్ మెడల్ సాయి భార్గవ్, షాకీర్ బాషా అండర్ 17లో సిల్వర్ మెడల్‌లు, రిజ్వానా అండర్ 14లో సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు. గోల్డ్ మెడల్ సాధించిన ఇద్దరు విద్యార్థులు జనవరిలో ఇన్‌డోర్, పూణేలో జరిగే జాయతీ స్థాయి స్కూల్ గేమ్స్ కరాటే పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరుపున అర్హత సాధించారని తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ నదీ తీరాన వెలసిన లక్ష్మీ పదావ్మవతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామి మాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం, శ్రవణా నక్షత్రం సందర్భంగా అర్చకులు స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చన అలంకరణ నిర్వహించారు. లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరుని ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చక్కమాలకొండ నరసింహారావు, కార్యదర్శి ఉటూకూరి రామకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

కన్నులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కంభం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. ఈ వేడుకల్లో పలువురు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయ శర్మ స్వామి అమ్మవార్లకు కౌశిక ధారణ, యజ్ఞోపవితం, జీలకర్ర బెల్లం ధారణ గావించారు. కళ్యాణమనంతరం ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానంతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అభయాంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ

పెద్దదోర్నాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యడవల్లి గ్రామ సమీపంలో కాశినాయన ఆశ్రమంలో బుధవారం శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సునీల్ శర్మ పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోయుక్తంగా ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించారు. ఈ వేడుకలకు పరిసర గ్రామాలు కొత్తూరు, యడవల్లి, గంటవానిపల్లె నుంచి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని సేవించారు.

అట్టహాసంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

రాచర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీచెరువు గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ పత్తి ఓబులయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామివారికి పూజలు, అహోషేకాలు చేశారు. అతిథులకు పత్తి కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య రచించిన పుస్తకాలను ఇరువురు నేతలు ఆవిష్కరించారు. సెయింట్ మేరీస్ కళాశాల కర్నూలులో ప్రిన్సిపాల్‌గా రిటైర్ అయిన ఓబులయ్య టీవీజీ కళాక్షేత్రం అధ్యక్షుడిగా, సంగీత సాహిత్య సాంస్కృతిక రంగాలలో విశిష్ట సేవలందిస్తున్నారని, కవిగా, రచయితగా, నటుడిగా, దర్శకుడిగా పరిపాలన అధ్యక్షుడిగా ఓబులయ్య పేరు ఎన్నికైందని అతిథులు తెలిపారు. కర్నూలు జిల్లా రంగస్థల కళా రంగంలో ఎన్నో సత్కారాలు పొందారని ఆయన దర్శకత్వం వహించిన నాటకాలకు అనేక నంది అవార్డుల తోపాటు కళారత్న అవార్డు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులు అందుకున్నారని ముఖ్యమంత్రితో సహా విశిష్ట వ్యక్తులతో సన్మానాలు పొందిన వ్యక్తి ఓబులయ్య అన్నారు. పేద కళాకారులకు పెన్షన్లు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇప్పించడంలో ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ ప్రాంతానికి తాగు, సాగునీరు కావాలని ఓబులయ్య కోరారని త్వరలో నీటి సమస్య తీరుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కే యోగానంద్, జీ జీవనేశ్వర్‌రెడ్డి, పి సుధీర్ కుమార్‌రెడ్డి, నంది శ్రీను, ఎం రజనీకాంత్‌రెడ్డి, కె గోపాల్‌రావు, ఎస్ పెద్ద నరసింహులు, ఎం.తిరుపాల్, పి బాలకృష్ణ, బి గాలయ్య, జె వెంకటేశ్వర్లు, బి ఆదినారాయణ, పి రవి, ఎస్ కళ్యాణ్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రమైన ఒంగోలులో బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక హెచ్‌సీఎం కళాశాల వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి కలెక్టర్ రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ భారతీయులందరూ గర్వపడే రోజు అని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాయకత్వంలో ప్రపంచంలోని అన్నిరాజ్యాంగాలను పరిశీలించి దేశంలోని సాంస్కృతిక, భాష తదితర వైవిధ్యాలను దృష్టిలో పెట్టుకొని అత్యుత్తమమైన రాజ్యాంగాన్ని తయారు చేసుకున్నామన్నరు. ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్యంలో పాల్గొనడానికి రాజ్యాంగం తప్పనిసరిగా చదవాలని కలెక్టర్ సూచించారు. ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ 1949 నవంబరు 26న రాజ్యాంగసభ భారత రాజ్యాంగానికి ఆమోదం తెలిపిందన్నారు. అందుకే నవంబరు 26న ప్రతి ఏటా రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఎన్నో కులాలు, మతాలు కలిగిన భారతదేశంలో అందరికి సమాన హక్కులు కల్పిస్తూ భారత రాజ్యాంగాన్ని రూపొందించి అందరికి ప్రేరణగా నిలిచిందని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, దళిత సంఘాల నాయకులు నీలం నాగేంద్రరావు, బిల్లా వసంతరావు, పెద్దిపోగు కోటేశ్వరరావు ఉన్నారు.

- రామాపురం వద్ద లిఫ్టు ఇరిగేషన్ నిర్మాణంపై రైతుల ఆశలు
- నిర్మాణం చేపడితే 1,067 ఎకరాలకు సాగునీరు
- నాలుగు మండలాల్లోని భూగర్భజలాల పెంపునకు అవకాశం
- టెండర్లు పిలవకుండా ఐదేళ్లు వదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- ప్రస్తుత ప్రజా ప్రభుత్వంపై అన్నదాతల ఆశలు
- సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ


రామాపురం చెక్‌డ్యామ్‌కు ఫుల్‌గా చేరిన వర్షపు నీరు

'ఎత్తిపోతల' కోసం ఎదురుచూపులు

దొనకొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దొనకొండ మండలంలోని రామాపురం గ్రామం వద్ద గుండ్లకమ్మ నది పరిధిలోని చెక్‌డ్యామ్ వద్ద ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు భారీగా నీరు చేరటంతో చెక్‌డ్యామ్‌కు నీటితో కళకళలాడుతోంది. ఈ ప్రాంతంలో 2002లో అప్పటి మంత్రివర్యులు దామచర్ల అంజనేయులు సహకారంతో రూ.10 లక్షలతో నిర్మించిన చెక్‌డ్యాంకు మార్కాపూర్ నుంచి దేవరాజు గట్టు మీదుగా ప్రవహించే గుండ్లకమ్మ నీరు వర్షాలు కురిసే సమయంలో ఈ చెక్‌డ్యాంకు భారీగా చేసుతుంది. దాదాపు ఐదు, ఆరు అడుగుల ఎత్తులో రెండు కిలోమీటర్ల వరకు నీరు నిలుస్తుంది. ఈ నీటితో దాదాపు 200 ఎకరాలకు చెందిన రైతులు మోటార్ల ద్వారా పంటలు సాగు చేసుకుంటారు. ఈ ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఏర్పాటు చేసి ఊరకుంట, కొండప్పచెరువు, గంగపాలెం చెరువులకు నీటిని రప్పిస్తే దాదాపు 1067 ఎకరాల్లో సిరులు పండి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. దొనకొండ, త్రిపురాంతకం, పెద్దారవీడు, మార్కాపురం మండలాల్లోని పలు గ్రామాల్లో భూగర్భజలాలు పెంపొందేందుకు ఎంతో దోహదపడుతుందని రైతులు తెలుపుతున్నారు. ఈ విషయాన్ని అప్పటి రామాపురం సర్పంచ్ కామేపల్లి నారాయణమ్మ, చెంచయ్య రైతుల శ్రేయస్సు, సాగునీటి సమస్య పరిష్కారం నిమిత్తం ఈ ప్రాంతంలో ఎత్తిపోతల పథకం ఏర్పాటుపై ఎన్నోసార్లు అప్పటి మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అందజేశారు. ఈ ప్రాంత రైతుల శ్రేయస్సును గుర్తించి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇక్కడ లిఫ్ట ఇరిగేషన్ మంజూరు చేసింది. దీంతో 2018 మే నెలలో విజయవాడ ఈఎన్‌సీ అధికారులు 92 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు అనుమతులు మంజూరు చేయటంతో లిఫ్ట ఇరిగేషన్ ఐడీసీ అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేశారు. ఇక్కడ లిఫ్ట ఇరిగేషన్ ఏర్పాటుకు రూ.13.15 కోట్లకు ప్రతిపాదనలు తయారు చేయటంతో ప్రభుత్వం నుంచి ఫైనాన్షియల్ అప్రూవల్ సైతం మంజూరైంది. ఇక టెండర్లు పిలిచి పనులు ప్రారంభించే ప్రక్రియ మిగిలింది. ఇంతలో 2019 ఎన్నికలు రావటం వైసీపీ ప్రభుత్వం ఏర్పడటం జరిగాయి. టీడీపీ ప్రభుత్వంలో మంజూరైందనే అక్కసుతో ఐదేళ్లు ఎటువంటి చర్యలు చేపట్టక నిర్లక్ష్యంగా వదిలేశారు. ఫలితంగా వెనుకబడిన ఈ ప్రాంతానికి సాగు, తాగునీటికి నేటికి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయకుంటే దాహార్తితో అల్లాడిపోయే పరిస్థితులు నేటికీ ప్రజలు ఎదుర్కొంటున్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని రామాపురం ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి రైతులకు సాగు నీటి కష్టాలు లేకుండా ఆదుకోవాలని రామాపురం మాజీ సర్పంచ్ కెనారాయణమ్మ దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ దృష్టికి తీసుకెళ్లి అందుకు సంబంధించిన ధ్రువపత్రాలు అందజేశారు. స్పందించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఇటీవల రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లను కలిసి రామాపురం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణ ప్రాముఖ్యతను వివరించి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ఇరువురు మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. అన్ని రకాలుగా ఎంతో ప్రయోజనకరమైన రామాపురం వద్ద లిఫ్టు ఇరిగేషన్ పథకాన్ని మంజూరు చేసి వేగంగా పనులను జరిపించాలని ఈ ప్రాంతంలోని రైతులు టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని కోరుకుంటూ కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

కూటమి ప్రభుత్వంపైనే కోటి ఆశలు



రామాపురం సమీపంలోని చెక్‌డ్యామ్ వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. అనంతరం అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదు. రామాపురం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణానికి చర్యలు చేపడితే ఈ ప్రాంత రైతులకు, ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది.

- కామేపల్లి చెంచయ్య, రామాపురం


ముండ్లమూరులో రైతు సాగు చేసిన మిరప తోటకు ఎర్రనల్లి తెగులు

పచ్చి మిర్చి తోటలకు ఎర్ర నల్లి తెగులు

- ధర ఉన్నా దిగుబడి అంతంత మాత్రమే
- నష్టాల బాటలో రైతులు
- తోటను కాపాడుకొనేందుకు కర్షకులకు అదనంగా ఖర్చులు

ముండ్లమూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పచ్చి మిర్చి తోటలకు రకరకాల తెగుళ్ళు సోకాయి. దీంతో దిగుబడులు ఒక్కసారిగా పడిపోయాయి. పచ్చిమిర్చి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎంతో వ్యయప్రయాసల కోర్చి పచ్చి మిర్చి సాగు చేసిన రైతులు గతనెల రోజుల నుంచి మిర్చి దిగుబడి రావటంతో ఎర్ర నల్లి తెగులు, జెమినీ తెగులు, ఆకు ముడత తెగులు రైతులను వెంటాడాయి. పది రోజుల క్రితం కిలో రూ.30 పలికింది. పెట్టుబడులు వస్తాయని ఆశతో మిర్చి సాగు చేసిన రైతులకు తెగుళ్ళు వెంటాడటంతో దిగుబడి కూడా తగ్గి పోయింది. ఇప్పటికే ఎకరానికి పదిహేను నుంచి రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టారు. దిగుబడి వచ్చే సమయానికి వరుస తెగుళ్ళ వల్ల కాయలు కుళ్ళి పోవటంతో చెట్లంతా పండుబారి కుళ్లిపోతున్నాయి. దీంతో తెగుళ్ళ నుంచి పచ్చి మిర్చి తోటలను కాపాడుకొనేందుకు రైతులు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. మండలంలో ఎక్కువగా 56 అనే పచ్చి మిర్చి రకం విత్తనాన్ని ఎంచుకొని సాగు చేశారు. మండల కేంద్రం ముండ్లమూరు, పసుపుగల్లు, ఉమామహేశ్వర అగ్రహారం, తమ్మలూరు, నాయుడుపాలెం, సింగనపాలెం, సుంకరవారిపాలెం, నూజెండ్లపల్లి, శంకరాపురం, పూరిమెట్లలో విస్తారంగా పచ్చి మిర్చి తోటలు సాగు చేశారు. తెగుళ్ళు అధికంగా వ్యాపించటం వల్ల దిగుబడి పూర్తిగా పడి పోయింది. ఎకరానికి పది నుంచి 20 క్వింటాళ్ళు మిర్చి రావాల్సి ఉండగా తెగుళ్ళ వల్ల రెండు నుంచి ఐదు క్వింటాళ్ళు కూడా వచ్చే పరిస్థితి కానరాలేదని రైతులు వాపోతున్నారు. పచ్చి మిర్చి రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరుతున్నారు.

సోలార్ విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

- కలెక్టర్ రాజాబాబు ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సోలార్ విద్యుత్ వినియోగం వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం జిల్లాలో అమలు తీరుపై బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్ లో బుధవారం విద్యుత్ శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ముందుగా ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు నెలవారీ విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటున్న గృహాల యజమానులు సోలార్ విధానంలోకి మారేందుకు ఆసక్తి చూపుతున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ 75 నుంచి 225 యూనిట్లు నెలవారీ వినియోగం ఉన్న గృహాల యజమానులు కూడా ఈ విధానంలోకి మారేలా చొరవ తీసుకోవాలన్నారు. ఇంటిపైన సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకోనేందుకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీ, మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించడం ద్వారా కలిగే ఆర్థిక ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. సొంత గృహాలు కలిగిన స్వయం సహాయక సంఘాల మహిళలపై ప్రత్యేక దృష్టి సారించి సోలార్ విధానంలోకి వారు మారేలా చూడాలన్నారు. సోలార్ పరికరాలను సరఫరాచేసే ఏజెన్సీలను వెంటనే గుర్తించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అదేశించారు. ఏదైనా సాంకేతిక సమస్యలు వస్తే తక్షణమే సరిచేసేలా వీరికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు.

ఎస్సీ యువత ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవాలి

- మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్

ఒంగోలు నగరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ యువత ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి వారు ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవాలని రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక పీజీఆర్ఎస్ సమావేశం హాలులో జరిగిన ఎస్సీ పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని పథకాలు అందించినా, సబ్సిడీ రుణాలు మంజూరు చేసినా తగిన ఆర్థిక అక్షరాస్యత లేకపోవటం వల్ల వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని ఆయన అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇకపై ప్రతినెలా ఒకటో బుధవారం, మూడో బుధవారం ఎస్సీ నిరుద్యోగ యువతకు ఆయా జిల్లాల్లో ప్రత్యేకంగా అవగాహన తరగతులను నిర్వహించబోతున్నామన్నారు. పరిశ్రమల స్థాపన, ఆర్థిక లావాదేవీల నిర్వహణ, డీఆర్‌పీ తయారీ వంటి వాటిపై ఈ సదస్సుల్లో అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు నిరుద్యోగులకు అవసరమైన సహకారం అందజేస్తామన్నారు. ఈ పరిశ్రమ పెట్టాలన్నా పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. డీఆర్‌డీఏ, వెలుగు పీడీ నారాయణ మాట్లాడుతూ ఏ పథకం కింద రుణం తీసుకుంటే ఎంత ఎక్కువ సబ్సిడీ వస్తుందనేది చూడకుండా ఏ పరిశ్రమ స్థాపిస్తే తమ కాళ్ళ మీద తాము నిలబడగలుగుతామనే దిశగా పరిశ్రమల ఏర్పాటు జరగాలన్నారు. ఎల్‌డీఎం రమేష్ మాట్లాడుతూ పరిశ్రమలపై పూర్తి అవగాహన కలిగి ఉంటే బ్యాంకులు సులువుగా రుణం మంజూరు చేస్తాయని ఆయన అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ సత్యజిత్ మాట్లాడారు.

'దర్శి'ని మార్కాపురం జిల్లాలో ఉంచాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గాన్ని నూతనంగా ఏర్పడుతున్న మార్కాపురం జిల్లాలోనే ఉంచాలని సీపీఐ జిల్లాకార్యదర్శి ఎంఎల్ నారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దర్శి నియోజకవర్గం దాదాపుగా మార్కాపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల వేష, భాష, వెనుకబాటుతనం, వాతావరణ పరిస్థితులు, నైసర్గిక స్వరూపం కలిగి ఉన్నాయన్నారు. మార్కాపురం జిల్లాకు పారిశ్రామిక కారిడార్, దొనకొండ ఎయిర్‌పోర్టులు ఆయువుపట్టు లాంటివి అని అన్నారు. అందువల్ల దర్శి నియోజకవర్గాన్ని మార్కాపురం జిల్లాలో కలిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సీపీఐ జిల్లా సమితి కలిసి వివరించనున్నట్లు ఆయన తెలిపారు.

లేబర్ కోడ్స్, నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై మండిపడిన నేతలు
- ఒంగోలులో మోటార్ సైకిల్ ర్యాలీ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, కార్మిక, కర్షకుల శ్రమను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్న ఫాసిస్ట్ పాలకుల విధానాలకు వ్యతిరేకంగా మరో ఐక్యపోరాటానికి సిద్ధం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ నల్లచట్టాలు, నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్‌మోర్చా, ట్రేడ్ యూనియన్ల దేశవ్యాప్త పిలుపు మేరకు బుధవారం ఒంగోలులో మోటార్ సైకిల్‌ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నాను నిర్వహించారు. ధర్నాకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు పమిడి వెంకటరావు, వి.హనుమారెడ్డి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ధర్నాలో కిసాన్‌మోర్చా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే విధంగా మార్కెట్ సంస్కరణలను ప్రకటించడం దుర్మార్గంగా ఉందని మండిపడ్డారు. ఈ విధానాలను కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతు కూలీసంఘం రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో ఐదు లక్షల మంది ఆత్మహత్యలకు పాల్పడిన తరుణంలో రైతుల సమస్యలు, గిట్టుబాటు ధర కోసం కిసాన్‌మోర్చా నేటికి ఉద్యమం కొనసాగిస్తున్నా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లలితకుమారి మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రాయితీ ఇస్తున్న ప్రభుత్వాలు దేశానికి అన్నం పెట్టే రైతుకు పంట రాయితీ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. సీఐటీయు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలు స్థానంలో నాలుగు లేబర్ కోడ్లు అమలు పేరుతో 40 కోట్ల మంది కార్మికుల నుదిటిపై మరణశాసనం లిఖించిందని విమర్శించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జే జయంతిబాబు మాట్లాడుతూ రైతాంగాన్ని దిగజార్చే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కంకణాల ఆంజనేయులు, ఎంఎస్ సాయి, ఎస్‌కే మాబు, జీవీ కొండారెడ్డి, శ్రీనివాసులు, చీకటి శ్రీనివాసరావు, మహేష్, బాలకోటయ్య, సీహెచ్‌చిరంజీవి, సీహెచ్‌రాంబాబు, రాజశేఖర్,పద్మ, కోటేశ్వరరావు, శ్రీరాం శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. అతకు ముందు స్థానిక కర్నూలు రోడ్డులోని ఫ్లై ఓవర్ వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు, అద్దంకి బస్టాండు, పాత మార్కెట్ సెంటర్, కొత్తపట్నం బస్టాండు, ఏబీఎం కాలేజీ, చర్చిసెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	117, 124, 136
చికెన్ విత్ స్కిన్ (కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్ (కిలో)	232.00

కార్తీకం తర్వాత కాంతి తగ్గిన బంతి

- రోజురోజుకూ పడిపోతున్న పూల ధర
- కిలో రూ.60 నుంచి రూ.20కి తగ్గుదల

త్రిపురాంతకం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం కాంతులు తగ్గగానే బంతిపూల మార్కెట్‌లో రోజుకోరకంగా ధర మారిపోతూ వస్తోంది. కార్తీక మాసంలో కిలో బంతి పూలు 50 నుంచి 60 రూపాయల దాకా పలకగా ప్రస్తుతం రూ.20కి కిలో కూడా ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు. కార్తీకం తర్వాత కాంతిని ఇవ్వని బంతి కారణంగా రైతు మోమున కళ తప్పింది. ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, పెద్దారవీడు మండలాల్లో పలువురు రైతులు బంతిపూల సాగు చేశారు. వాణిజ్య పంటల సాగుకు వెళ్లి స్థోమతకు మించి అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి ఇబ్బంది పడేకన్నా పూల సాగుకు తక్కువ పెట్టుబడితో ఎంతైనా లాభం దక్కుతుందనే ఆశ పలువురు రైతులను బంతిసాగు వైపుకు మళ్లించింది. త్రిపురాంతకం మండలంలో గణపవరం, చెర్లోపల్లి, అన్న సముద్రం తదితర గ్రామాల్లో రైతులు పూలసాగు చేపట్టారు. అయితే పెట్టుబడి తక్కువే అయినా తీరా అమ్మకం మొదలయ్యాక ధరల విషయంలో జరుగుతున్న హెచ్చుతగ్గుల కారణంగా ఆశించిన ఫలితం రాదని పలువురు రైతులు చెప్తున్నారు. కార్తీక మాసం సమయంలో క్వింటా కొన్నిసార్లు రూ.6వేల దాకా వెళ్లినా రూ.5వేలకు తగ్గకుండా బంతి అమ్మకాలు జరిగాయి. అన్న సముద్రం గ్రామానికి చెందిన ఒకరైతు కేవలం 50 సెంట్ల పొలంలో బంతిసాగు చేసి 3 టన్నుల పూలు అమ్మినట్టు చెప్తున్నారు. కార్తీకం తరువాత కాసిన పూలకు మాత్రం ఇప్పుడు క్వింటా రూ.2వేలకు (కిలో20) దిగజారిపోయింది. బంతి సాగులో ధరల దోబూచులాట కారణంగా ఆశించిన లాభాలు రావటం లేదని రైతులు చర్చించుకుంటున్నారు.


అన్న సముద్రంలో బంతిపూల తోట

కల నెరవేరిన వేళ.. భక్తుల ఆనందహేల

పృథులగిరి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

మర్రిపూడి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమేన పృథులగిరిలక్ష్మి నరసింహస్వామి దేవాలయానికి వెళ్లే ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులను బుధవారం గ్రామస్థులు, భక్తుల ఆనందోత్సాహాల మధ్య అర్భాటంగా ప్రారంభించారు. ఎన్నో ఏళ్ళకల నెరవేరబోతున్న సమయంలో గ్రామస్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. రోడ్డు నిర్మాణంతో పృథులగిరి అటు ఆధ్యాత్మిక క్షేత్రంగానూ, ఇటుపర్యాటక కేంద్రంగానూ విరాజిల్లుతుంది. ఘాట్‌రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు మంజూరు చేయడమే కాకుండా పనులు ప్రారంభించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పృథులగిరి అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి స్వామి, దామచర్ల సత్యల కృషిని గ్రామస్థులు కొనియాడుతున్నారు. ఇప్పటికే రూ.25లక్షలతో దేవాలయాన్ని ఆధునీకరించడంతో పాటు మరో రూ.50లక్షలతో కొండపైన సువిశాలమైన సీసీరోడ్డును ఏర్పాటు చేయడంతో పృథులగిరి అభివృద్ధికి తొలి అడుగులు పడ్డాయి. దేవాలయాన్ని పునర్నిర్మించేందుకు రూ3.50 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేయించి ప్రభుత్వం ఆమోదం కోసం పంపారు. త్వరలో దేవాలయ నిర్మాణానికి నిధులు విడుదల అవుతాయని ఇటీవల ప్రకటించారు. వచ్చే బ్రహ్మోత్సవాల నాటికి ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని మంత్రి స్వామి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముందుగా కొండ దిగువన ఉన్న సిద్దిగణపతి ఆంజనేయస్వామి విగ్రహాలకు పూజలు చేసి అనంతరం మేళతాళాల మధ్య వేదమంత్రోచ్ఛరణలతో 101 కొబ్బరికాయలు కొట్టి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ రమణయ్య, మర్రిపూడి సొసైటీ అధ్యక్షులు ఎర్రమోతు శ్రీనివాసులు, మద్దిపాడు ఏఎంసీ చైర్మన్ మన్నం ప్రసాద్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు స్వాములు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త రేగుల వీరనారాయణ, ఎంపీడీవో జగదీష్, టీడీపీ నాయకులు దాసరి వెంకటేశ్వర్లు, నరసింహారావు, పుల్లారెడ్డి, యోగిరెడ్డి, గొంటు హనుమారెడ్డి, వైసీపీ మండల అధ్యక్షులు ఇంకొల్లు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


పృథులగిరి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

ఘనంగా ‘ది సిటీ’ మహా శంకుస్థాపన

● హాజరైన ఎమ్మెల్యే దామచర్ల



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే జనార్దన్, ఒడా చైర్మన్ రియాజ్, మేయర్ సుజాత, అతిథులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీభ్రమరా రాయల్ టౌన్‌షిప్ ఆధ్వర్యంలో ‘ది సిటీ’ మహాశంకుస్థాపన బుధవారం ఒంగోలులో ఘనంగా జరిగింది. స్థానిక రెండవ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు తూర్పువైపున 150 ఎకరాల్లో నిర్మిస్తున్న టౌన్‌షిప్ నిర్మాణానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒడా చైర్మన్ షేక్ రియాజ్‌తోపాటు మేయర్ గంగాడ సుజాత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో శ్రీభ్రమరా టౌన్‌షిప్‌కు మంచి గుర్తింపు ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించే విల్లాలకు ప్రజల్లో మంచి నమ్మకం ఉందని చెప్పారు. ఈ ప్రాజెక్టు సక్సెస్ కావాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు వివరించారు. ది సిటీ గేటెడ్ ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ మొదటి విడతలో 70 ఎకరాల్లో అన్ని అధునాతన వసతులతో కూడిన నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని కనిగిరి, మార్కాపురం, అన్ని పట్టణాలు, నగరాలలో శ్రీ భ్రమర ఆధ్వర్యంలో ది సిటీ పేరుతో విల్లాలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గల్లా మాధవి, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, బాచిన చెంచుప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా మాగుంట సుబ్బరామరెడ్డి జయంతి



సుబ్బరామరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సుబ్బరామ్‌బాబు తదితరులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ మాజీసభ్యుడు, స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి 78వ జయంతి వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఒంగోలు నగరంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుటుంబసభ్యులు నిర్వహించగా, ఇతర ప్రాంతాల్లో అభిమానులు సుబ్బరామరెడ్డికి నివాళులర్పించడంతోపాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో సుబ్బరామరెడ్డి చిత్రపటానికి ఆయన మనుమడు సుబ్బరామ్‌బాబు, బెజవాడ సురేష్‌రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నెల్లూరు బస్టాండు, రైల్వేస్టేషన్ రోడ్డు, అద్దంకిబస్టాండులోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో మేయర్ గంగాడ సుజాత, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, టీడీపీ నాయకులు తాతా ప్రసాద్, బెల్లం సత్యనారాయణ, ఆత్మకూరి బ్రహ్మయ్య, కండే శ్రీనివాసరావు, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అనిలాకుమారి, రాయపాటి సీత, లక్ష్మి, మాగుంట అభిమానులు పాల్గొన్నారు. అలాగే పలు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ జగదీష్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాకెట్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఒంగోలులోని హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ జగదీష్ తెలిపారు. బుధవారం చీమకుర్తి బాష్యం పబ్లిక్ స్కూలులో జరిగిన 1వ రాష్ట్ర స్థాయి సీనియర్స్ రాకెట్‌బాల్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు బాలగంగాధర్, జ్ఞానేశ్వర్, గాయత్రి, సాహితీ, ప్రణవి సత్తా చాటారని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు 13,14 తేదీలలో అనంతపురంలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా స్థానిక స్కూలులో విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

పంచాయతీ సిబ్బందికి సత్కారం



సిబ్బందిని సత్కరించిన ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ సమయంలో ఎటువంటి ప్రాణ, పంట నష్టం జరగకుండా విశిష్ట సేవలు అందించిన పంచాయతీ కార్యదర్శులు, మండలపరిషత్ సిబ్బందికి బుధవారం సాయంత్రం సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.సురేష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మెప్మా పీడీ శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరై సిబ్బంది పనితీరు అభినందించారు. అదేవిధంగా పాలకులు సైతం అధికారులతో సమన్వయం చేసుకుని ప్రజలకు అండగా నిలిచారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, ఏవో శారద, ఈవోఆర్డీ అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్విస్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

ఒంగోలు(విద్య), నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఐఎంఈఎస్‌టీ(ఇంటర్నేషనల్ మల్టీకాన్ఫరెన్స్ ఆన్ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ) అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పలు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు ప్రసంగించారు. కార్యక్రమంలో క్విజ్ విద్యాసంస్థల అధినేత నిడమానూరి కళ్యాణ చక్రవర్తి, ఈడీ గాయిత్రీదేవి, ఐజీటీ తిరుపతి ప్రొఫెసర్ అనిల్, టాగుయిగ్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ రాయముండో అర్సి, యూపీహెచ్ఎస్‌డీ మొలినో డైరెక్టర్ రోసో ఆర్ రాయల్, టాగుయిగ్ యూనివర్సటీ డీన్ రెనాల్డో అవ్వెన్, క్విజ్ కళాశాల ప్రిన్సిపాల్ వై.హనుమంతరావు, డీపీఎస్ఆర్ డైరెక్టర్ బీవీ.సుబ్బారావు పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు మౌళిచంద్ర కన్వీనర్‌గా వ్యవహరించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

జరుగుమల్లి (కొండపి), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కామేపల్లి జడ్పీ స్కూల్‌ను డీఈవో కిరణ్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన మాక్ అసెంబ్లీని ఆయన తిలకించారు.

తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలి

● కలెక్టర్ రాజాబాబు ఆదేశం



విదార్థులను అభినందిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తాగునీరు కలుషితం కాకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా వాటర్‌శానిటేషన్ మిషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీరు కలుషితం కాకుండా చూడటంతో పాటు నీటి వనరులను సంరక్షించుకోవడం, భూగర్భ నీటిమట్టాన్ని కాపాడుకునేందుకు ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాలశంకరరావు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ తాగు, సాగు, ఇతర అవసరాల కోసం వినియోగించుకునే నీటి నిర్వహణ విషయంలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీటి నాణ్యత పరీక్షల విషయంలో క్షేత్ర స్థాయి సిబ్బంది పనితీరును నిరంతరం నిశితంగా పరిశీలించాలని కోరారు. నీటి వనరులు కలుషితం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు చిరంజీవి, వరలక్ష్మి, నారాయణ, వెంకటేశ్వరరావు, డాక్టర్ వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ఒంగోలు కలెక్టరేట్: నమూనా అసెంబ్లీలో పాల్గొని నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను కలెక్టర్ రాజాబాబు అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం రాత్రి అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలను కలెక్టర్ అందజేశారు. నమూనా అసెంబ్లీలో విద్యార్థులు ప్రదర్శించిన తీరును కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఈవో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ఆక్వా చెరువులపై చర్యలు

● మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి సాగుచేస్తున్న ఆక్వా చెరువులపై చర్యలు తీసుకుంటామని మత్స్యశాఖ ఏడీ సంగాని శ్రీనివాసరావు తెలిపారు. అమ్మనబ్రోలు సమీపంలో సాగు చేస్తున్న రొయ్యల చెరువుల వల్ల తాగునీరు కలుషితమవుతున్నాయని పలువురు గ్రామస్థులు కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. దాంతో మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాలుష్యనియంత్రణ, రెవెన్యూ, వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు సంయుక్తంగా అమ్మనబ్రోలు సమీపంలోని రొయ్యల చెరువులను బుధవారం తనిఖీ చేశారు. చెరువుల నుంచి వచ్చే వ్యర్థాలు నేరుగా గుండ్లకమ్మ నది, ఉలిచి చెక్‌డ్యాంలో కలిసి తాగునీరు కలుషితమవుతున్నాయని గుర్తించినట్లు ఏడీ తెలిపారు. కోస్టల్ ఆక్వా అథారిటీ నిబంధనల ప్రకారం చెరువుల నుంచి వచ్చే వ్యర్థాలు తాగునీటి వనరులలో కలువకుండా ప్రత్యేకంగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలని, ఇక్కడ అలా జరగడం లేదన్నారు. వ్యవసాయ భూములు సమీపంలోనే ఆక్వా చెరువులు ఉండకూడదని, నిబంధనలు పాటించని వీరగంథం నాగేశ్వరరావుపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పరిశీలన నివేదికను కలెక్టర్ రాజాబాబు, ఆర్డీవో లక్ష్మీప్రసన్నకు అందిస్తామని ఏడీ చెప్పారు. కార్యక్రమలో టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ఇంటూరి శ్రీనివాసరావు, కనపర్తి ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ఈదర వెంకటకృష్ణారావు, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఏవో వెంకట్రావు పాల్గొన్నారు.

బండ్లమూడి బాధితులకు న్యాయం చేయాలి

● ఎమ్మార్పీఎస్ నేతలు



కలెక్టర్ రాజాబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలం బండ్లమూడి గ్రామానికి చెందిన మాదిగ సామాజికవర్గంపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం బాధితులతో కలిసి ఒంగోలులో కలెక్టర్ పి.రాజాబాబును కలిసి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు వైకే.విశ్వనాథ్, జాతీయ నాయకుడు సొట్ట నరేంద్రలు మాట్లాడుతూ దళితులపై దాడి అమానుషంగా ఉందని, నిందుతులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని కోరారు. అలాగే ఎస్సీ ఎస్టీ చట్టం కింద మిగిలిన నిందితులను కూడా అరెస్టు చేయాలని తెలిపారు. అలాగే బాధితులకు ఉద్యోగం, భూమి, ఇళ్ల మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్, జాతీయ ఉపాధ్యక్షుడు నరసింగరావు, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు టి.ఆనంద్, బాపట్ల అధ్యక్షుడు లక్కీనరసయ్య, జిల్లా అధ్యక్షుడు నేలపాటి రాజు, ఒంగోలు నగర అధ్యక్షుడు గుంటూరు ప్రభుదాస్, తిరువీధి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్డురాయి, విగ్రహాల ప్రతిష్ఠ



బొడ్డురాయిని ప్రతిష్ఠిస్తున్న వేదపండితులు

సంతనూతలపాడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్టలో బుధవారం శ్రీశీతాలాంబ(నాభిశిల) గమిడియంత్రాలు, శ్రీపోలేరమ్మ, శ్రీనాంచారమ్మ, శ్రీనాగదేవ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవార్లను దర్శించుకున్నారు. మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్, జనసేన సమన్వయకర్త కందుకూరి బాబు, జనసేన నాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి, బాలినేని శచీదేవి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి మేరుగ నాగార్జున తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ జరిగింది.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

నాగులుప్పలపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరులోని ఊరచెరువులో వేంచేసిన శ్రీవల్లీ దేవసేన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కళ్యాణం బుధవారం ఘనంగా నిర్వహించారు. పూజారి రంగయ్యపంతులు వేద మంత్రాలతో భక్త జనం మధ్య స్వామి వారి కళ్యాణ క్రతువు చేపట్టారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కనగాల శ్రీనివాసరావు, మసిముక్కు భాస్కరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం చేయూత

● డీఏవో శ్రీనివాసరావు

చీమకుర్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకోవాలని డీఏవో శ్రీనివాసరావు కోరారు. తొర్రగుడిపాడులో బుధవారం జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సీఎం చంద్రబాబునాయుడు తెలిపిన పంచసూత్రాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో బి.రమేష్‌బాబు, డీవీ.భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: బొడ్డువారిపాలెం గ్రామంలో బుధవారం జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో డీఏవో ఎస్.శ్రీనివాసరావు మాట్లాడారు. సబ్‌డివిజన్ వ్యవసాయసంచాలకులు బి.రమేష్, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఏవో పావని, రైతులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలి

● డాక్టర్ పరకాల ప్రభాకరరావు

ఒంగోలు(రూరల్)నవంబరు26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలని డాక్టర్ పరకాల ప్రభాకరరావు పిలుపునిచ్చారు. బుధవారం ఒంగోలు నగరం సంతపేటలోని ఎన్జీరంగా భవన్‌లో భారత రాజ్యాంగ అమలు దినోత్సవం ప్రముఖ న్యాయవాది పంగులూరి గోవిందయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభాకరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగ రచనా అధ్యక్షుడిగా డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఉండాలంటూ ఆచార్య ఎన్జీరంగా బలపరిచినట్లు తెలిపారు. జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ న్యాయాధికారి నలదల బసవయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు, చావలి సుధాకర్, ఎల్.రాజశేఖర్, రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ అమలు దినోత్సవం

● అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ అమలు దినోత్సవం ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవి బాబులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కసుకుర్తి అదెన్న, రాష్ట్ర కార్యదర్శులు కేవీ.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, కుప్పం ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు, రొండా అంజిరెడ్డి, డీఎస్.క్రాంతికుమార్, వైవీ.గౌతంఅశోక్ పాల్గొన్నారు.

- జిల్లా మాలల జేఏసీ ఆధ్వర్యంలో ఒంగోలులో బుధవారం రాజ్యాంగ అమలు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జేఏసీ చైర్మన్ కొప్పోలు ఏడుకొండలు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.లక్ష్మి, మేడిది రవి, శాంతారావు, మేడికొండ లక్ష్మీనారాయణ, దాసరి ప్రసాద్, పెరికల రత్నం, బంటుపల్లి రాజు, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో..

ఒంగోలు కార్పొరేషన్: స్థానిక రిమ్స్ మెడికల్ కాలేజీలో రాజ్యాంగ అమలు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం కాలేజీ ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు ముఖ్య అతిథులుగా హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి, అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, డాక్టర్లు శ్రీదేవి, దుర్గాదేవి, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ మమత, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం కె.ఉప్పలపాడు, ముప్పవరం జడ్పీ స్కూళ్లలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్కూళ్ల ఆవరణలో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. కార్యక్రమాల్లో కె.ఉప్పలపాడు జడ్పీస్కూల్ హెచ్‌ఎం సుసన్నకుమార్, ముప్పవరం జడ్పీస్కూల్ హెచ్‌ఎం కోటిరెడ్డి పాల్గొన్నారు.

చిర్రికూరపాడులో..

జరుగుమల్లి మండలం చిర్రికూరపాడు గ్రామంలోని జడ్పీస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవోలు బత్తుల నాగేంద్రవదన్, డోలా శ్రీనివాసులు పాల్గొన్నారు. స్కూల్‌లో సోషల్ స్టడీస్ క్లబ్‌ను ప్రారంభించారు. విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాటక, పాటలు, ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రామ నాయకుడు కంచర్ల ప్రసాద్ బహుమతులను అందజేశారు.

పొన్నలూరులో..

పొన్నలూరు : తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తాసీల్దార్ వి.పుల్లారావు, ఆర్ఐ శివ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొండపి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు గ్రామాలకు గురువారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పువ్వాడి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కొండపి సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తగా వీసీబీలు బిగిస్తున్నందున కొండపితోపాటు కట్టావారిపాలెం, అనకర్లపూడి, నెన్నూరుపాడు, ఇలవర, పెరిదేపి, మిట్టపాలెం, ముప్పరాజువారిపాలెం, గోగినేనివారిపాలెం గ్రామాలకు ఈ అంతరాయం ఏర్పడుతున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

డ్వాక్రా రుణాల అక్రమాలపై విచారణ

ఒంగోలు(రూరల్), నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం దేవరంపాడు దళితవాడ పంచాయతీలో జరిగిన డ్వాక్రా రుణాల అక్రమాలపై బుధవారం వెలుగు సీసీ ఎస్‌కే.మస్తాన్ విచారణ చేపట్టారు. రుణాల అవినీతిపై కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు సీసీ విచారణ ప్రారంభించారు. విచారణ అనంతరం నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వెల్డర్ మృతి

టంగుటూరు (కొండపి), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ ఫ్యాక్టరీలో వెల్డింగ్ పనిచేస్తూ ప్రమాదవశాత్తూ గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న జి.మేఘనాథ్ (27) బుధవారం మృతి చెందాడు. ఈమేరకు వైద్యశాల నుంచి వచ్చిన సమాచారంతో ఎస్సై కేసు నమోదు చేశారు. ఆయన కథనం మేరకు.. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం గ్రామానికి చెందిన జి.మేఘనాథ్ టంగుటూరు టోల్‌గేట్ సమీపంలో ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీలో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ప్రమాదవశాత్తు ఎత్తులో నుంచి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఫ్యాక్టరీ నిర్వాహకులు ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ ఆయన మృతి చెందాడు.

పశువులకు వైద్య సేవలు

పొన్నలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గోకుల్ మిషన్, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని భోగనంపాడులో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ డాక్టర్ బి.మురళీకృష్ణ పాల్గొని పశువుల్లో తలెత్తే గర్భకోశ వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పించారు. పొన్నలూరు పశువైద్యాధికారి జె.శివరామకృష్ణ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాల గురించి వివరించారు. అనంతరం పశువులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చౌటపాలెం పశు వైద్యాధికారి పి.కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, గ్రామ నాయకులు డి.వెంకటేశ్వర్, పి.సుబ్బారావు, శ్రీనివాసులు, బ్రహ్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కార్పెంటర్ యూనిట్ ప్రారంభం



మిషన్‌ను ప్రారంభిస్తున్న పీడీ నారాయణ

కొండపి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని పొదిలి రోడ్డులో పీఎంఈజీపీ పథకం కింద మంజూరైన కార్పెంటర్ మిషన్ యూనిట్‌ను వెలుగు పీడీ నారాయణ బుధవారం ప్రారంభించారు. లబ్ధిదారులు మునునూరి శేషమ్మ, వెంకటేశ్వర్లును అభినందించారు. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, డీఆర్‌డీఏ ఎల్‌హెచ్ డీపీఎం డి.దానం, వెలుగు ఏపీఎం గోపీనాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు కొర్రపాటి వసంతరాయుడు, నాయకులు బత్తుల నారాయణస్వామి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, నరసారెడ్డి, సుబ్బరామయ్య, కూనంనేని రమేష్, సీసీలు పాల్గొన్నారు.

నేటి నుంచి కాంగ్రెస్ పార్టీ పరిశీలకుల పర్యటన

ఒంగోలు క్రైం,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఏఐసీసీ కార్యదర్శి నదీమ్‌జావెద్, సమన్వయకర్తలు జాన్‌బాబ్, బీవై.కిరణ్, రాణిమేకల సతీష్‌లు గురువారం నుంచి పర్యటించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా బుధవారం ఓ ప్రకటనలో తెలపారు. ఈనెల 27 ఒంగోలులో పార్టీ జిల్లా స్థాయి సమావేశం జరుగుతుందని, పరిశీలకులు పాల్గొంటారని పేర్కొన్నారు. 28న ఒంగోలు, కొండపి, 29మార్కాపురం, 30 గిద్దలూరు, ఎర్రగొండపాలెం, వచ్చేనెల 1న కనిగిరి, దర్శిలలో పర్యటించను న్నట్లు తెలిపారు.

ఉప్పుగుండూరులో వైద్యశాల నిర్మాణానికి స్థల పరిశీలన

నాగులుప్పలపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామస్థులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కమ్యూనిటీ ప్రభుత్వ వైద్యశాల నిర్మాణం కోసం తగిన స్థలాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర వైద్య విభాగం మౌళిక సదుపాయాల అభివృద్ధి కమిటీ బుధవారం పరిశీలించారు. గ్రామంలోని పోలేరమ్మ దేవాలయం వద్ద ఉన్న సబ్‌సెంటర్ స్థలాన్ని సందర్శించారు. 100 పడకల ఆసుపత్రికి 6 ఎకరాలు అవసరమని, కానీ ఇక్కడ 1.70 ఎకరాల్లో 30 పడకల ఆసుపత్రి నిర్మించుకొనే వీలుందని తెలిపారు. ఇక్కడ ఆసుపత్రి నిర్మాణానికి స్థలం అనువుగా ఉందని చెప్పారు. అలాగే మరో రెండు చోట్ల భూములను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎంఐడీసీ పోతయ్యాయాదవ్, సూరిబాబు, టీడీపీ నాయకులు కనగాల శ్రీనివాసరావు, మసిముక్కు భాస్కరరావు, తెలగతోటి జాన్సన్, విశ్రాంత హెల్త్ అధికారి కేఎల్.నాగేశ్వరరావు, తేలప్రోలు శ్రీరాములు, కోడూరి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రోశయ్య మృతికి సంతాపం

నాగులుప్పలపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంటూరి రోశయ్య మృతి ఎమ్మార్పీఎస్‌కు తీరని లోటని రాష్ట్ర లీడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు పేర్కొన్నారు. ఈదుమూడి గ్రామానికి చెందిన మాదిగరిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక సభ్యులు ఇంటూరి రోశయ్య మృతి చెందడంతో బుధవారం చైర్మన్ మాణిక్యరావు విచ్చేసి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. రోశయ్య తన వాల్ రైటింగ్‌తో ఉద్యమం వ్యాప్తికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు.

కేంద్రమంత్రిని కలిసిన మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారలశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగాకలిశారు. బుధవారం ఢిల్లీలోని కేంద్రమంత్రి నివాసంలో ఆయనను మాగుంట కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలు అంశాలను కేంద్రమంత్రి దృష్టికి ఎంపీ మాగుంట తీసుకెళ్లారు.

కాంగ్రెస్ పార్టీ మచిలీపట్నం పరిశీలకుడిగా శ్రీపతి

ఒంగోలు క్రైం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం జిల్లా కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడుగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాష్‌ను నియమించారు. ఈ మేరకు ఆయన ఆయన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష ఎంపిక ప్రక్రియకు పరిశీలకులుగా తనతోపాటుగా మాజీ ఎమ్మెల్యే సంజయ్‌దత్‌ను నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఆదేశాలు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయానికి శంకుస్థాపన



పూజలో పాల్గొన్న భక్తులు

సంతనూతలపాడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని మద్దులూరు రోడ్డులో శ్రీమానసదేవి సహిత శ్రీవల్లిదేవసేన సమేత, శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి నూతన దేవాలయానికి బుధవారం వేదపండితుల సమక్షంలో శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన పూజల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు. అర్చకులు ఆదిమూలం సాయిశర్మ తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వాస్తు సిద్ధాంతి అయినాల నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, బొడ్డపాటి చంద్రశేఖర్, తన్నీరు శ్రీను, జడ్పీటీసీ దుంపా రమణమ్మ, ఆలయ కమిటీసభ్యులు బూదాటి శ్రీనివాసరావు, సన్నమూరి సుబ్బనాచారి, ఎం.రాజేష్, జ్వాలా ప్రభాకర్, శరత్‌బాబు పాల్గొన్నారు.

పన్నుల చెల్లింపు సులభతరం : డీపీవో

జరుగుమల్లి (కొండపి), నవంబరు (ఆంధ్రజ్యోతి)26 : ఇంటి పన్ను చెల్లింపును ప్రభుత్వం సులభతరం చేసిందని డీపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. ఇక నుంచి ఇంటి యజమానులు క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించవచ్చన్నారు. బుధవారం ఆయన నందనవనం గ్రామ పంచాయతీలో పర్యటించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. కరపత్రాల పంపిణీతోపాటు వాల్‌పోస్టర్ల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రమణమూర్తి, అధికారులు ఉన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించాలి



ప్రశంసాపత్రం అందజేస్తున్న కమిషనర్

ఒంగోలు(విద్య), నవంబరు26(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధితో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే వినూత్న కార్యక్రమాలను నిర్వహించడం అభినందనయమని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. నారాయణ స్కూల్స్ ప్రకాశం జోన్ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో నిర్వహించిన విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకాశం జోన్‌కు చెందిన పది బ్రాంచ్‌ల నుంచి ఎంపికైన 110మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా కమిషనర్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరిగింది. ఏజీఎం పెద్దిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

ఒంగోలు(విద్య), నవంబరు26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజంలో ఎదుర్కొను సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు వీలుగా వారిలో సృజనాత్మకతను పెంపొందించేలా ప్రోత్సహించాలని డీఈవో కిరణ్‌కుమార్ కోరారు. జిల్లాలోని అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌ను బలోపేతం చేసేందుకు ఒంగోలులోని నెక్షజన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మూడు రోజులుపాటు జరిగిన శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. సమగ్ర శిక్ష ఏపీసీ దాసరి అనిల్‌కుమార్ మాట్లాడుతూ శాస్త్రసాంకేతిక రంగాల్లో విద్యార్థులు రాణించేందుకు అటల్ టింకరింగ్ లాబ్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర ఇన్‌చార్జి ఎం.లత, జిల్లా సైన్స్ అధికారి రమేష్, ఆర్పీలు సుబ్రహ్మణ్యం, రమణయ్య, రవికాంత్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మార్కాపురం జిల్లా ప్రకటనపై హర్షం

- చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం
- ప్రభుత్వానికి కృతజ్ఞతలు
- ఇచ్చిన మాట నెరవేర్చిన సీఎం
- టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం జిల్లాకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపి ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన మాటను తీర్చారని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మార్కాపురం జిల్లాకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో బుధవారం సీఎంకు కృతజ్ఞతగా టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి ఎరిక్షన్‌బాబు, టీడీపీ నాయకులు పాలాభిషేకం చేశారు. అంతకుముందు కార్యకర్తలు బాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి ఎరిక్షన్‌బాబుకు తినిపించారు. ఎన్నికల ముందు చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురం జిల్లాపై ఇచ్చిన హామీని నెరవేర్చుతున్నారని ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండలాధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, పోట్ల గోవింద్, మేకల వళరాజు, షేక్‌మాబు, పట్టణ అధ్యక్షుడు మల్లికార్జునరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కాపురం : ప్రెస్‌క్లబ్ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబ చిత్రపటానికి బీజేపీ నాయకులు బుధవారం ఉదయం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు శిరసనగండ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ మార్కాపురం డివిజన్ ప్రజలకు నేడు పండగ రోజు అన్నారు. మంత్రివర్గ ఉపసంఘ సిఫార్సుల మేరకు మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలపడం సంతోషదాయకమన్నారు. ఎన్నికల్లో ఇచ్చి న మాటను చంద్రబాబు నెరవేర్చారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజ ల పక్షాన ఉందని నిరూపితమైందన్నారు. దశాబ్దాలుగా పశ్చిమ ప్రకాశం వెనుకబాటుతనానికి గురైందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు కూడా త్వరలో పూర్తవుతుందన్నారు. ఈ ప్రాంత ప్రజల తలరాత మా రబోతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, శాసనాల సరోజిని, మద్దెల లక్ష్మి, మొర్రిబోయిన చిన్నయ్య, దేవిశెట్టి చంద్రశేఖర్, సాని కొమ్ము వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



సీఎం బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



కంభంలో మిఠాయిని పంచిపెడుతున్న నాయకులు

సమష్టి పోరాటాల ఫలితమే జిల్లా ఏర్పాటు

సమష్టి పోరాటాల ఫలితంగానే మార్కాపురం జిల్లా ఏర్పాటుకు మార్గం సుగమమైందని మార్కాపురం జిల్లా సాధన సమితి కన్వీనర్ షేక్ సైదా అన్నారు. సీపీఐ కార్యాలయంలో సాధన సమితి ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమం జరిగింది. ముందుగా కార్యాలయం ముందు టపాసులు కాల్చారు. అందరికీ మిఠాయిలు పంచి పెట్టారు. మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సుల మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ఆమోదం తెలపడం సంతోషదాయమని సైదా అన్నారు. ఈ ప్రాంత ప్రజల కలలు సాకారమయ్యాయన్నారు. మార్కాపురం జిల్లాలో దర్శి నియోజకవర్గాన్ని కలిపాలన్నారు. శ్రీశైలం ప్రాంతాన్ని ఈ జిల్లాలో కలిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాధన సమితి కోకన్వీనర్లు అందె నాసరయ్య, డి.సోమయ్య, సుదర్శన్, షేక్ రజాక్, షేక్ ఖాశిం, రఫీ పాల్గొన్నారు.

కంభం : మార్కాపురంను జిల్లా చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మార్కాపురం జిల్లా సాధన సమితి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం ఎన్జీవో హోంలో సమావేశమైన సందర్భంగా జిల్లా సాధన సమితి గౌరవ అధ్యక్షుడు ఎం ప్రసాద్, అధ్యక్షులు దేవిరెడ్డి నాగేంద్రుడు మాట్లాడుతూ మార్కాపురం జిల్లా సాధన సమితి కంభం వారు 2018 అనేక పర్యాయాలు మేధావులు, గ్రామ పెద్దలు, అన్ని రాజకీయ పార్టీ నాయకులు, ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు ఉద్యమాలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే ఈనెల 20వ తేదీ మార్కాపురం జిల్లా సాధన సమితి సమావేశమై ప్రభుత్వం మార్కాపురం జిల్లా చేయాలని ర్యాలీ చేశామన్నారు. అయితే ప్రభుత్వం ఈనెల 24న మార్కాపురం జిల్లా చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలపడంతోపాటు స్వీట్లు పంచుకొని ఒకరినొకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో పలువురు జిల్లా సాధన సమితి నాయకులు పాల్గొన్నారు.



రూపకం ప్రదర్శిస్తున్న బాలబాలికలు

ప్రారంభమైన సెమీక్రిస్మస్ వేడుకలు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏబీఎం కంపౌండ్‌లోని తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశాఖకు చెందిన రెవరెండ్ డాక్టర్ డానియల్ కుమార్ వాక్య సందేశం అందించారు. అనంతరం సండేస్కూల్ విద్యార్థులు వివిధ రూపకాలు, నృత్య ప్రదర్శనలు చేశారు. మహిళలు ప్రార్థన గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ పి.అమృత్‌తేజ్, అధ్యక్షుడు డి.శ్యాముయల్, ఉపాధ్యక్షుడు జి.ఆర్థర్, కార్యదర్శి జయరావు, సభ్యులు దారివేముల బాబి, పోలయ్య, సతీష్ పాల్గొన్నారు.

త్రిపురాంతకం : మండలంలోని రాజుపాలెం గ్రామంలో తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుక భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాస్టర్ నానిజాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ సభ్యులు భక్తి గీతాలు ఆలపించగా పాస్టర్ కిశోర్, శ్రీనివాస్ డేవిడ్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆనందంగా శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

టీడీపీకి కార్యకర్తలే మూలస్తంభాలు



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న టీడీపీ నేత కృష్ణకిశోర్‌రెడ్డి

కొమరోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీకి పార్టీ కార్యకర్తలే మూల స్తంభాలని టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోహరపల్లి గ్రామంలో బుధవారం రాత్రి టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని పార్టీ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు గంజిగుంట్ల బాలకేశవ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో పార్టీ బలంగా ఉందని అది కార్యకర్తల సమిష్టి కృషి అని అన్నారు. కార్యకర్తల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పరిష్కరిస్తున్నారని, వారి చొరవతోనే గిద్దలూరు నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లాను చేశారని, వారికి అందరూ కృతజ్ఞతలు తెలపాలన్నారు. చింతలపల్లి, పుల్లారెడ్డి పల్లి పంచాయతీల్లో సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు గోడి ఓబుల్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ముత్తుముల సంజీవరెడ్డి, రవీంద్రా రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బిజ్జం వెంకటరామిరెడ్డి, చలిచీమల శ్రీనివాస్ చౌదరి, వీరంరెడ్డి శంకర్ రెడ్డి, బిజ్జల నరసింహులు, దప్పిలి శ్రీనివాస్ రెడ్డి, గంజికుంట్ల బాలకేశాలు, మర్రి ఆంజనేయులు, చెన్నయ్య పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

గిద్దలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టం చేసే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆవులయ్య, మండల కన్వీనర్ నరసింహులు, వివిధ కార్మిక సంఘాల వారు రూతమ్మ, సాయిలక్ష్మి, మున్న, మురళి పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : పోరాటాలతో కార్మికులు సాధించిన 44 చట్టాలను అమలు చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. లేబర్ కోడ్‌ను అమలును వ్యతిరేకిస్తూ బుధవారం నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ భాష్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేవీ కృష్ణ గౌడ్, సీపీఐ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు ఆవుల యోగయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు షేక్ పీరా, అన్వర్‌బాషా, శ్రీను, లాలు, సత్యాచారి, కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ఉపాధ్యాయుడు

తర్లుపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు సేవా కార్యక్రమాల్లో సొంత నిధులతో ఉపాధ్యాయుడు కశెట్టి జగన్ చేస్తున్నారు. తర్లుపాడు నుంచి సీతానాగుల వరం వరకు రోడ్డుకు ఇరువైపులా చిల్ల చెట్లు అలుముకున్నాయి. దీంతో వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. చిల్లచెట్లు తొలగించాలని ఆర్ అండ్‌బి శాఖ అధికారులకు విన్నపించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ విషయాన్ని ప్రజలు సేవా కార్యక్రమాలు చేస్తున్న ఉపాధ్యాయుడు కశెట్టి జగన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బుధవారం తర్లుపాడు నుంచి సీతానాగులవరం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించే కార్యక్రమం చేపట్టారు. దీంతో ప్రజలు సేవా కార్యక్రమాలు చేస్తున్న కశెట్టి జగన్‌కు అభినందనలు తెలిపారు.

ఫీల్డ్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

కంభం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ కేంద్ర ప్రభుత్వం పీఎంకేవీవైలో భాగంగా కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫీల్డ్ టెక్నీషియన్ పెరిఫెరల్ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణ కల్పించినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తిరుమలయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం, ఉద్యోగం కల్పిస్తారన్నారు. టెన్త్ పాసై 18 - 45 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలన్నారు. వివరాలకు సెల్ 7997151082, 8019311043 నెంబర్లను సంప్రదించాలన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం

రాచర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని గిద్దలూరు గృహ నిర్మాణ శాఖ డిఈ షేక్ ఖదీర్‌బాషా అన్నారు. ఫారం గ్రామానికి చెందిన పలువురు గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోగా వాటిపై బుధవారం ఆయన సర్వే చేశారు. ఇళ్లు మంజూరైన వారు త్వరగా పూర్తి చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రత్నబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గిద్దలూరు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అంబవరం ఫీడర్ విద్యుత్ లైన్ మెయింటినెన్స్ కారణంగా ముండ్లపాడు, బురుజుపల్లె, కంచుపల్లె, క్రిష్ణంశెట్టిపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో గృహ, వ్యవసాయానికి ఈనెల 27వ తేదీ గురువారం ఉయదం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సరఫరా ఉండదని డీఈఈ శేషగిరిరావు ప్రకటనలో తెలిపారు.

పలు గ్రామాల్లో సరఫరా కట్

కొమరోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిచెర్ల సబ్ స్టేషన్ పరిధిలోని రెడ్డిచెర్ల, మూలపల్లి, మల్లారెడ్డిపల్లి, మిట్టమీది పల్లి, బ్రాహ్మణపల్లి, యర్రపల్లి, పాముూరుపల్లి, గోనేపల్లి, మధవపల్లె గ్రామాలకు అల్లీనగరం సబ్ స్టేషన్ పరిధిలోని అల్లీనగరం, తిమ్మారెడ్డి పల్లి, యర్రగుంట్ల, వట్టివేపమానిపల్లి గ్రామాలకు గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఆర్‌డీఎస్ఎస్ కొత్త లైన్లు వేయు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ శ్రీనివాసరావు తెలిపారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

గిద్దలూరును రెవెన్యూ డివిజన్ చేయాలి

గిద్దలూరు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రకటించిన మార్కాపురం జిల్లాను స్వాగతిస్తున్నప్పటికీ గిద్దలూరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని పలు సంఘాల నాయకులు స్థానిక రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రం అందచేశారు. వెనుకబడిన ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటించి మార్కాపురాన్ని జిల్లా కేంద్రం చేయడం పట్ల హర్షం ప్రకటించారు. అయితే గిద్దలూరును రెవెన్యూ డివిజన్ చేయకుండా మార్కాపురం కంటే దూరంగా ఉన్న కనిగిరి డివిజన్‌లో కలుపడం మరింత వెనుకబాటుతనానికి కారణమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గిద్దలూరును ప్రత్యేక డివిజన్‌గా చేస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు గాలి వెంకటరామిరెడ్డి, వివిధ సంఘాల నాయకులు రామకృష్ణ, చంద్రపాల్, రామరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆవులయ్య పాల్గొన్నారు.

కొత్త జిల్లాలో దర్శిని ఎందుకు చేర్చలేదు ?

మార్కాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంను నూతన జిల్లాగా ఆమోదించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, దర్శిని ఎందుకు నూతన జిల్లాలో చేర్చలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు సయ్యద్ జావీద్ అన్వర్ అన్నారు. మార్కాపురం జిల్లాను ఆమోదించినా పక్కనేవున్న దర్శి నియోజకవర్గాన్ని కలపకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్వార్థ రాజకీయ కోసం మాత్రమే దర్శిని విడదీసారన్నారు. జిల్లా ఏర్పాటులో సమతుల్యత లేదని అన్నారు.

కాలువలు శుభ్రంగా ఉంచండి

రాచర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యో) : వీధుల్లోని కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి టీ గణేష్ అన్నారు. మండలంలోని అనుములవీడు దళిత కాలనీలో బుధవారం ఆయన పూడికతీత పనులను చేయించారు. వ్యర్థాలతో కాలువలు నిండిపోయి మురుగునీరు బయటకు వెళ్లడం లేదని, నీరు బయటకు పోకపోతే వ్యాధులు సోకే ప్రమాదం ఉందని కాలనీ ప్రజలు టీడీపీ నాయకులు అంబవరం శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన తక్షణమే పూడికతీత పనులను చేపట్టాలని అధికారులను కోరారు. ఈ విషయంపై స్పందించిన కార్యదర్శి పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు బాధ్యతగా పరిశుభ్రత పాటించాలన్నారు. వ్యర్థాలు అన్నింటినీ కాలువల్లో వేయకుండా బయట ప్రదేశంలో పడవేయాలని అన్నారు. అధికారులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా నెహ్రూ బజార్‌లోని సాయి మందిరం ఆవరణలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు రవిశంకర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, వల్లీ సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శిగోపాలుని హరిహరరావు, కోశాధికారి నాగరాజు, మేనేజర్ సతీష్ నాయుడు, కమిటీ సభ్యులు ఉభయదాతలు పాల్గొన్నారు.

కాశినాయనకు పూజలు

గిద్దలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భగవాన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో కాశినాయనకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కాశినాయనకు అభిషేకం, సామూహిక భజనలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కొంగళవీడుకు చెందిన దాత నాగిరెడ్డి పవన్‌కుమార్‌రెడ్డి, యోగా గురూజీ నారాయణరెడ్డి, దేవస్థాన కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రమ్యకు అభినందనలు



రమ్యతో హోంమంత్రి అనిత సెల్ఫీ

గిద్దలూరు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో గిద్దలూరు జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని నక్క రమ్య ప్రదర్శించిన ప్రతిభను హోంమంత్రి వంగలపూడి అనిత అభినందించారు. చిన్న వయస్సులో అసాధారణ ప్రతిభ చూపిన రమ్యను హోంమంత్రి తన సెల్‌ఫోన్‌తో సెల్ఫీ దిగారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అభినందించారు. రమ్యకు, అధ్యాపకులకు అభినందించారు.

మాక్ అసెంబ్లీలో పాల్గొన్న గాయం వర్షిత

తర్లుపాడు : అమరావతిలో జరిగిన రాష్ట్ర స్థాయి స్టూడెంట్ మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి కలుజువ్వలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గాయం వర్షిత పాల్గొన్నారు. మార్కాపురం నియోజకవర్గం తరుపున వర్షిత పాల్గొనడంపట్ల హెచ్‌ఎం చిలకపాటి సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

గిద్దలూరు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలోని పౌరులందరికీ రాజ్యాంగం ద్వారానే హక్కులు ఏర్పడ్డాయని, ప్రజలందరూ రాజ్యాంగం ప్రకారమే నడుచుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.భరత్‌చంద్ర అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం గిద్దలూరు కోర్టు భవనాల సముదాయంలో ఓంకార్, భరత్‌చంద్ర మాట్లాడుతూ పౌరులందరికీ రాజ్యాంగం ద్వారానే హక్కులు ఏర్పడ్డాయని అన్నారు. రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరిస్తూ విభిన్న మతాలు, వివిధ కులాలతో భిన్నత్వంలో ఏకగత్వం మన భారతదేశంలో సాధ్యమైందని, ప్రజలందరికీ సమా న న్యాయం, సమాన హక్కులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో బార్ అ సోసియేషన్ అధ్యక్షుడు శేషశైనారెడ్డి, ఉపాధ్యక్షుడు బి.ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఎ.తిరుమలప్రసాద్, సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి, బి.రాజశేఖర్‌రెడ్డి, పోలయ్య, కె.రవిప్రకాశ్‌బాబు పాల్గొన్నారు.

మార్కాపురం : మార్కాపురం పట్టణంతోపాటు మండల పరిధిలోని పలుచోట్ల భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోర్టు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి కూటమి నాయకులతో కలిసి వెళ్లి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పలు విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

మార్కాపురం వన్‌టౌన్ : భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సాయి బాలాజీ ఉన్నత పాఠశాలలో పిన్సిపాల్ సయ్యాద్ మస్తాన్ వలీ, డైరెక్టర్ ప్రకాష్ రావుల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

పెద్దారవీడు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవరాజుగట్టులోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలు రాజ్యాంగంలోని విలువలను అర్థంచేసుకొని సమాజ నిర్మాణంలో నిబద్ధతతో వ్యవహరించాలని అన్నారు. న్నారు. మండలంలోని సానికవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్క లు నాటారు. విద్యార్థులు మాక్ పార్లమెంట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జాన్ సుందరం, ఎంఈవో శ్రీనివాసులు, ఏవో లక్ష్మీనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కంభం : రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో, కందులాపురం సచివాలయంలో ఎంపీడీవో వీరభద్రాచారి, రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కిరణ్, ఆర్ఐ ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించడంతోపాటు ప్రతిజ్ఞ చేశారు.

రాచర్ల : అంబేడ్కర్ ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీవో ఎస్ వెంకట రామిరెడ్డి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు అన్నారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆకవీడు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి.

కొనకనమిట్ల : మండలంలోని వెంలిగండ్ల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు నిర్వహించారు. విద్యార్థులు రాజ్యాంగ ప్రవేశిక ఆకృతిలో కూర్చొని నిబద్ధతను చాటుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమరోలు : ప్రపంచానికి భారత రాజ్యాంగం ఆదర్శంగా నిలుస్తుందని ఎంపీడీవో సత్యం అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు, ఏపీవో మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : తహసీల్దార్ కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ నిర్వహించారు. డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సావిత్రి రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది శ్రీనివాసాచారి, విజయబాబు, కృష్ణారెడ్డి, ఎల్లారావు పాల్గొన్నారు.

రైతులకు ప్రజా ప్రభుత్వం అండ



పెద్దనాగులవరం : రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల



గంజివారిపల్లి : రైతన్నా మీకోసంలో రైతులతో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎమ్మెల్యే కందుల

మార్కాపురం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతన్నలకు ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దనాగులవరం గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందుల మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి దాని ద్వారా ఈ ప్రాంతంలో తాగు, సాగుకు నీరు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రైతన్నలు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాగులు, సజ్జలు, జొన్నలు వంటి చిరుధాన్యాలను సాగు చేసుకోవాలని తెలిపారు. సాగుకు అనుగుణంగా నూతన టెక్నాలజీని ఉపయోగించి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకుని పంటలలో అధిక దిగుబడులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఓ రమేష్, ఏవో బుజ్జిబాయి, మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటరెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతి మాటా నెరవేర్చుతున్న సీఎం

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు - చెప్పిన మాటలన్నింటినీ ముఖ్యమంత్రి చంద్రబాబు నూటికినూరు శాతం అమలు చేస్తున్నారని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని గంజివారిపల్లి గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం కంపెనీల ఏర్పాటు, నిరుద్యోగ యువత కోసం ఉద్యోగాలు, మహిళల కోసం గ్యాస్, ఉచిత బస్సు, ప్రయాణికుల సౌకర్యార్థం రోడ్లు, రైతుల కోసం అన్నదాత సుఖీభవ, పేదల కోసం అనేక పథకాలతో ప్రజా ప్రభుత్వం దూసుకుపోతోందని అన్నారు. రాష్ట్ర ప్రగతిని, ఆర్థిక వ్యవస్థను జగన్‌రెడ్డి చిన్నాభిన్నం చేశారన్నారు. ప్రజా ప్రభుత్వం దానిని గాడిలో పెడుతూనే ప్రజలు, రైతుల కష్టాలను తీర్చుతున్నదన్నారు. తాజాగా మార్కాపురం జిల్లాకు ఆమోద ముద్ర పడడం పశ్చిమ ప్రాంత ప్రజలకు వరమన్నారు. అలాగే వెలిగొండను త్వరితగతిన పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నిమ్మల కృషి చేస్తున్నారన్నారు. అటు జిల్లా, ఇటు వెలిగొండ పూర్తితో పశ్చిమ ప్రాంత ప్రజల కష్టాలు తీరుతాయని ఎరిక్షన్‌బాబు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలపాలన్నారు. రైతులతో మాటామంతి నిర్వహిస్తున్న సమయంలో కొంత మంది స్పందిస్తూ గతంలో టీడీపీ హయాంలో సబ్సిడీపై ఇచ్చిన వ్యవసాయ పరికరాలను ఇప్పుడు కూడా ఇవ్వాలని కోరారు. ప్రభుత్వంతో మాట్లాడి వాటి మంజూరుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాళ వెంగళరెడ్డి, ఏవో నీరజ, మహేష్ నాయుడు, ఎంసీహెచ్ మంత్రునాయక్, సత్యనారాయణ గౌడ్, చెవుల అంజయ్య, మస్తాన్ వలీ, పేరం రమణా రెడ్డి, వ్యవసాయా, ఉద్యాన, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రకాశంలోనే దర్శి

కొనసాగించటంపై ఆనందోత్సాహాలు

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు నేతల పాలాభిషేకం



దర్శిని ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలని నిర్ణయంతో ఇక్కడి టీడీపీ శ్రేణుల పాలాభిషేకం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి లక్ష్మి

దర్శి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం అభినందనీయమని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ దర్శిలోని గడియారస్తంభం సెంటర్‌లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో అనుభవం కల్గిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల పట్ల అన్నివర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. దర్శి నియోజకవర్గం ప్రకాశం జిల్లాలోనే కొనసాగించటంతో పాటు అద్దంకిలో నూతన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి దర్శి నియోజకవర్గంను అందులో కలపటం ఆనందదాయకమన్నారు. పాలనాపరంగా ఎంతో సౌలభ్యం ఏర్పడుతుందన్నారు. ప్రజలు పనుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా సులభం చేయటంతో అన్నివర్గాల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రభుత్వం తీసుకున్న సముచిత నిర్ణయంకు ఆమె సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకుడు కడియాల లలిత్‌సాగర్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు వెలుగొండారెడ్డి, కె.శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ స్టీవెన్, తెలుగుమహిళా నాయకురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా హర్షాతిరేకాలు

దర్శి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలోనే కొనసాగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల పార్టీలకు అతీతంగా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. అదేవిధంగా అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలిపి అక్కడ నూతన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి అందులో దర్శి నియోజకవర్గంను చేర్చటం పట్ల కూడా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అన్ని పనులకు డివిజన్ కార్యాలయం అందుబాటులోకి రావటం పట్ల పలు రాజకీయ పార్టీలు హర్షం వ్యక్తం చేశాయి. టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఈ విషయంపై అనేకసార్లు ప్రభుత్వ పెద్దలతో చర్చించి ప్రజలకు ఆమోదకరంగా ఉండేలా ప్రభుత్వ నిర్ణయం తీసుకునేందుకు కృషి చేయటం పట్ల అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు వివిధ పార్టీల నాయకులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రచార మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. దర్శి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కొనసాగించేందుకు విశేష కృషి చేసిన లక్ష్మికి దర్శి నియోజకవర్గ సీపీఎం కార్యదర్శి టి. రంగారావు ధన్యవాదాలు తెలిపారు.

హైవే రోడ్డు నిర్మాణ టిప్పర్ల అడ్డగింత

రహదారి దెబ్బతిన్నా పట్టించుకోని నిర్వాహకులు

శివరాంపురం,కొర్రపాటివారిపాలెం టీడీపీ శ్రేణుల ఆగ్రహం

పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయతీ

రెండు రోజుల్లో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని అంగీకారం



ఆర్అండ్‌బీ రోడ్డుపైకి టిప్పర్లు రాకుండా అడ్డుకున్న శివరాంపురం టీడీపీ శ్రేణులు

తాళ్లూరు,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బీకేవీ హైవే రోడ్డునిర్మాణం కోసం నిత్యం తిరుగుతున్న టిప్పర్ల రాకపోకలతో శివరాంపురం-తాళ్లూరు రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, రోడ్డునిర్మాణ నిర్వహకులు పట్టించుకొని మరమ్మతులు చేయాలంటూ శివరాంపురం గ్రామ టీడీపీ యువత నారి పెద్ది కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో శివరాంపురం, కొర్రపాటివారిపాలెం టీడీపీ శ్రేణులు టిప్పర్ల రాకపోకలను బుధవారం అడ్డుకున్నారు. నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిందన్నారు. గతంలో వేసిన బీటీ రోడ్డు మెటల్ రోడ్డుగా మారిందన్నారు. రోడ్డుపై ప్రయాణించే ద్విచక్రవాహనదాలు టిప్పర్ల వల్ల వచ్చే దుమ్ముకు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఆ దుమ్ములో వాహనాలు కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పలుగ్రామాలకు చెందిన ప్రజలు రోడ్డుకు మర్మమ్మతులు జరపాలని అనేక మార్లు హైవే నిర్మాణ నిర్వాహకులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. రోడ్డు నిర్మాణ నిర్వాహకులు పట్టించుకోక పోవటంతో శివరాంపురం టీడీపీ శ్రేణులు రంగంలోకి దిగారు. కొర్రపాటివారిపాలెం కొండనుంచి సాగర్ కాలువ కట్టమీదుగా ఆర్అండ్‌బీ రోడ్డుపైకి వస్తున్న టిప్పర్లను నిలుపుదల చేశారు. రోడ్డుకు మరమ్మతులు చేసిన తరువాతనే వాహనాలు తిప్పాలని విన్నవించారు. రోడ్డు దుస్థితికి చేరి దుమ్ము లేయటం, గుంతలుగా ఉండి వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నందున తక్షణమే మరమ్మతులు జరిపించాలని కోరారు. రోడ్డు నిర్మాణ నిర్వాహకులు స్థానిక పోలీసులను ఆశ్రయించి టిప్పర్లను అడ్డుకున్నారని తెలిపారు.

టిప్పర్లు అడ్డుకున్న వారిని పోలీసులు పిలిపించి మాట్లాడగా రోడ్డు పనులను తాము అడ్డుకోలేదని, వాహనాల రద్దీతో రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారి కష్టాలను గుర్తించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని, లేకుంటే తాము టిప్పర్లను తిరగనియబోమని చెప్పారు. దీంతో రోడ్డు నిర్మాణ నిర్వాహకులు రెండురోజుల్లో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని పోలీసుల సమక్షంలో స్పష్టమైన హామీ ఇవ్వటంతో గ్రామస్థులు అంగీకరించారు. దీంతో టిప్పర్లు యథావిధిగా హైవే రోడ్డు నిర్మాణానికి మట్టి తోలాయి.

ఘనంగా భారత రాజ్యాంగ వేడుకలు

పలు చోట్ల అంబేడ్కర్‌కు ఘన నివాళులు



భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ నాయకులు

దర్శి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించిన ఘనత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కే దక్కుతుందని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను తూచా తప్పకుండా కాపాడుతూ సీఎం చంద్రబాబు సమర్ధవంతమైన పాలనను ప్రజలకు అందిస్తున్నారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తి యువతలో నింపాలనే ఉద్దేశంతో మాక్ అసెంబ్లీ నిర్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. విద్యార్థులు మాక్ అసెంబ్లీలో ప్రసంగించిన తీరు, జరిపిన చర్చలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ దర్శి మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, పుల్లలచెరువు చిన్నా, మాజీ అధ్యక్షుడు యాదగిరి వాసు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాజ్యాంగ వేడుకలు నిర్వహించారు.

రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు

దొనకొండ : స్థానిక గౌతమీ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు భారత రాజ్యాంగంపై బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో వై. నతాన్, రెండవస్థానంలో షేక్ సీమ, మూడవస్థానంలో ఏ స్వప్నలు విజేతలుగా ఎంపికయ్యారు. వీరికి కాలేజీ ప్రిన్స్‌పాల్ ఎఫ్రాయిమ్(నాని) మెడల్స్‌ను అందజేశారు.



పీసీపల్లి మండలం వెంగళాయపల్లి పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పీసీపల్లిలో..

పీసీపల్లి :రాజ్యాంగ వేడుకలను మండలంలోని పలు పాఠశాలలు, ప్రభుత్వ కారార్యలయాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

పామూరులో..

పామూరు : ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగమే కీలకమని సింగిల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు అన్నారు. స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో 76వ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కో ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ హర్షిణి, టీడీపీ నాయకులు నాయబ్‌రసూల్, నరసింహారావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సీఎస్‌పురంలో

సీఎస్‌పురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో కొండారెడ్డి మాట్లాడారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భారత రాజ్యాంగం దేశ ప్రజలకు అత్యుత్తమ చట్టం

తాళ్లూరు,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగనిర్మాతగా రూపొందించిన రాజ్యాంగం దేశ ప్రజలకు అత్యుత్తమ చట్టమని ఎంఈవో జి.సుబ్బయ్య, ఎంపీడీవో పి.అజితలు తెలిపారు.76వ భారత రాజ్యాంగ ఆమోదదినోత్సవాన్ని ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

అంబేడ్కర్ నగర్‌లో

స్థానిక అంబేడ్కర్ నగర్‌లో జిల్లామాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

కేజీబీలో క్విజ్‌పోటీలు

కేజీబీవీ విద్యాలయంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికలకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో క్విజ్‌పోటీలు నిర్వహించారు.

రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలి

కనిగిరి : ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు బుల్లా బాలబాబు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఒంగోలు బస్టాండు సెంటరులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, పట్టణాధ్యక్షుడు ఫిరోజ్, రోషన్ సంధాని, తమ్మినేని వెంకటరెడ్డి, తెలుగు మహిళలు కరణం అరుణ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు, : ముండ్లమూరులోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల వద్ద భారత రాజ్యాంగ 76వ ఆమోద దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కనిగిరిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు బాలబాబు



యోగా విద్యార్థులకు అందజేసిన బహుమతులతో కూటమి నాయకులు

యోగా తరగతుల నిర్వహణకు ఆర్థిక సహకారం

పామూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పాఠశాల నుంచి ఇద్దరిని యోగా సాంస్కృతిక శిక్షణ తరగతుల నిర్వహణకు కూటమి నాయకులు రూ. 80 వేలు ఆర్థిక సహకారాన్ని బుధవారం అందజేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ రమాదేవి తరుపున టీడీపీ నాయకుడు యారవశ్రీను రూ. 50 వేలు, బీజేపీ నాయకులు రూ.10 వేలు, టీడీపీ పటణ ఉపాధ్యక్షుడు ఇర్రి కోటిరెడ్డి రూ.10 వేలు, యూనిట్ కో కన్వీనర్ మాలపాటి వెంకటేశ్వరరెడ్డి, రూ.10 వేలు వంతున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య, డిప్యూటీ ఎంపీడీవో సుందరరామయ్య, ఎంఈవో పెద్దిరెడ్డి కోటిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ గుత్తి కొండయ్య, స్వయంకృషిసేవా సంస్థ అధ్యక్షులు షేక్ నాయబ్‌రసూల్, బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మడి శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మురుగుమ్మిలో రైతులకు ప్రభుత్వ సందేశ పత్రాలను అందజేస్తున్న నాయకులు

రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం

పీసీపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడి సాయంతో పాటు రైతుల కోసం ఎన్నో రాయితీలు ఇస్తున్న ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య అన్నారు.మండలంలోని మురుగుమ్మి గ్రామంలో బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ వ్యవసాయ అధికారులతో కలిసి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ లబ్ధిదారులైన రైతులతో సమావేశమయ్యారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు , వాటి యొక్క ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య, కార్యదర్శి వీరయ్య, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సత్తిరెడ్డి, రమేష్‌రెడ్డి, బాబు, వ్యవసాయ సహాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.



పూజలు నిర్వహిస్తున్న దీక్షధారణ స్వాములు

ఘనంగా సుబ్రమణేశ్వరస్వామి షష్ఠి వేడుకలు

దొనకొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని నాలుగురోడ్ల కూడలిలోని ఆనంద ఆశ్రమంలో శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి షష్ఠి సందర్భంగా ధర్మకర్త భైరవానందస్వామి నేతృత్వంలో బుధవారం తెల్లవారుజాము నుంచి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృత అభిషేకాలు, ప్రత్యేకంగా అలంకరించిన విఘ్నేశ్వర, సుబ్రమణ్యేశ్వర, అయ్యప్పస్వామి, విశ్వేశ్వర స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.అధికసంఖ్యలో దీక్షధారణ స్వాములు పాల్గొన్నారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.



ఉభయదాత రాంబాబును సన్మానిస్తున్న దేవస్థాన చైర్మన్‌లు

అయ్యప్ప దీక్షాధారులకు భిక్ష

పామూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అయ్యప్ప దేవస్థానంలో అయ్యప్ప దీక్షాధారులకు జరుగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, సింగిల్ విండో చైర్మన్ వెంకట సుజాత దంపతులు కుమారుడు వెంకట సాయి కార్తిక్ జ్ఞాపకార్థం కుమార్తె డాక్టర్ తేజస్విల ఆర్థిక సహకారంతో బుధవారం భిక్షను ఏర్పాటు చేశారు. అనంతరం దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయదాత రాంబాబును శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్‌లు కావిటి సుబ్బయ్య, గుత్తిరాజ, కంభాల రోశయ్య ఓగూరు ఏడుకొండలు, పోశం నరసింహారావు, రాచూరి సురేష్‌తో పాటు అయ్యప్ప, భవాని, శివ, ఆంజనేయ, వేంకటేశ్వర స్వామి భక్తులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

పామూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం మార్చిన లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు హనీఫ్ అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్ల అమలును వ్యతిరేకిస్తూ స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని లేని పక్షంలో కార్మికులను సమీకరించి ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కన్వీనర్ బి. నాగేశ్వరరావు, యూనియన్ నాయకులు కొండయ్య, సివిల్ సప్లై నాయకులు సురేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాక్ అసెంబ్లీలో శాసనసభ్యులుగా సమస్యలపై మాట్లాడుతున్న విద్యార్థిని (ఇన్‌సెట్లో) స్పీకర్‌గా ఓ విద్యార్థిని

మాక్ అసెంబ్లీలో అబ్బురపరచిన విద్యార్థులు

కనిగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని విద్యార్థులు నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం మండల పరిధిలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులు మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సభలో ప్రధానంగా రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రజా సమస్యల మీద విశాఖలో జరిగినటువంటి పారిశ్రామిక అభివృద్ధి సదస్సు గురించి ప్రధానంగా చర్చించటం విశేషంగా నిలిచింది. అదేవిధంగా ముఖ్యమంత్రిగా వ్యవహరించిన విద్యార్థి మాట్లాడుతూ విశాఖలో జరిగిన సీఐఐ సదస్సు విజయవంతమైన విధానాన్ని గురించి జీరో అవర్‌లో ప్రస్తావించారు. అదేవిధంగా ప్రతిపక్ష సభ్యులు రాష్ట్రంలోని వివిధ అంశాలపై అడిగిన ప్రశ్నలకు మంత్రివర్గ సభ్యులుగా వ్యవహరించిన విద్యార్థినీ విద్యార్థులు ఎంతో హుందాగా వ్యవహరిస్తూ చెప్పిన సమాధానం అసెంబ్లీలో ప్రత్యేకతను సంతరించుకుంది. మాక్ అసెంబ్లీ నిర్వహణ సాక్షాత్తు అవరావతిలో జరిగే శాసనసభ తీరుకు అద్దం పట్టింది. పాఠశాలలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు మాక్ అసెంబ్లీ నిర్వహణపై ప్రత్యేక తర్ఫీదునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సీ విజయభాస్కర్‌రెడ్డి, సోషల్ ఉపాధ్యాయులు టీ గురవయ్య, మర్రి మోషే, ముప్పూరి ధనమ్మ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

దర్శి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ కీర్తి డిమాండ్ చేశారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెట్ పరీక్షకు వ్యతిరేకంగా డిసెంబర్ 13న ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు డి. వెంకటరావు, ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఏపీటీఎఫ్ దర్శి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పి. వెంకటరావు, అధ్యక్షుడిగా పి . రంగారావు, ప్రధాన కార్యదర్శిగా పి. రామాంజనేయులు, అసోసియేట్ అధ్యక్షుడిగా పేరు సాహెబ్, ఉపాధ్యక్షులుగా ఎం. సుబ్బారావు, వై. వెంకటేశ్వర్లు, అదనపు కార్యదర్శిగా ఐ. వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా కె. రవీంద్రారావు, ఎస్. సామ్రాజ్యం, బి. రాజబాబు, మహిళా కార్యదర్శులు ఎఫ్. కుమారీ, ఆర్. ప్రసన్నకుమారి, కోశాధికారిగా పి. శ్రీనివాసులు ఎన్నికయ్యారు.



ఏలూరి నరసింహులు మృతదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

పామూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంభాలదిన్నె గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ నాయకులు ఏలూరి నరసింహులు అకాల మృతి పట్ల పామూరు, పీసీపల్లి మండలాల టీడీపీ శ్రేణులు సంతాపం వ్యక్తం చేశారు. ఏలూరి నరసింహులు అంతక్రియలు బుధవారం జరిగాయి. ముందుగా ఏలూరి మృతదేహానికి పామూరు, పీసీపల్లి టీడీపీ అధ్యక్షులు బొల్లా నరసింహారావు, వేమూరి రామయ్యలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే మోపాడు రిజర్వాయర్ కమిటీ చైర్మన్ చుంచు కొండయ్య, గ్రామ టీడీపీ అధ్యక్షుడు మన్నం రమణయ్య, ఏలూరి నరసింహారావు, సింగిల్ విండో మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ గద్దె గంగయ్యచౌదరి, అనపర్తి శశిమహేశ్వరరావు, గోళ్ల భాస్కరరావు, వీరబాబు, కొంపల్లి నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శ్రావణ సాయికి కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న శ్రావణ సాయి

ముండ్లమూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కే శ్రావణ సాయి అనే విద్యార్థినికి భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టర్ రాజా బాబు చేతుల మీదుగా ఒంగోలులో ప్రశంసాపత్రం అందుకున్నారు. శ్రావణ సాయి భారత రాజ్యాంగం గురించి వ్యాసరచన రాయటంతో అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు శ్రావణ సాయిని ప్రత్యేకంగా అభినందించారు.

1 నుంచి సీపీఎం పాదయాత్రలు

పామూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దూబగుంట ప్రాంతంలోనే ఏపీజే అబ్దుల్ కలాం ట్రిపుల్ ఐటీ కళాశాల నిర్మాణపనులు చేపట్టాలని, వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 4 వేల కోట్లు నిధులు కేటాయించి పనులు పూర్తిచేయాలని తదితర డిమాండ్లతో డిసెంబరు 1 నుంచి పాదయాత్రలు చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో పాదయాత్రలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి షేక్ ఖాదర్‌బాష, కె. శంకర్, వై యాట వీరనారాయణ, పందిటి రామయ్య, కె. శంకర్, అల్లాభక్ష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి వైవీ సోదరుల పరామర్శ

తాళ్లూరు,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తాళ్లూరు మాజీ సర్పంచ్ ఐ.పెద్దిరెడ్డి కుటుంబాన్ని బుధవారం వైవీ సోదరులు పరామర్శించారు.ఇటీవల మృతి చెందిన పెద్దిరెడ్డి భార్య ఆదిలక్ష్మమ్మను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి పరామర్శించారు. రాజ్యసభసభ్యులు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఫోన్‌లో పెద్దిరెడ్డి కుమారుడు లక్ష్మీరెడ్డిని పరామర్శించారు. ఆయన వెంటసర్పంచ్ చార్లెస్ సర్జన్, నాయకులు ఎల్.వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా సుబ్బరామరెడ్డి జయంతి వేడుకలు

కనిగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మాగుంట సుబ్బరామరెడ్డి 78వ జయంతి సందర్భంగా కొత్తూరు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి టీడీపీ నేతలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాగుంట కుటుంబం కనిగిరి ప్రాంతాభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రైబల్ వెల్‌ఫేర్ ఆఫీసర్ సస్పెన్షన్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్‌ఫేర్ ఆఫీసర్ ప్రకాష్‌రావును సస్పెన్షన్ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. కలెక్టరేట్ వేదికగా నెలకు ఒకసారి దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీల సమస్యల కోసం ప్రత్యేకంగా పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి హాజరు విషయంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ట్రైబల్ వెల్‌ఫేర్ ఆఫీసర్ ప్రకాష్‌రావుకు గతంలో కలెక్టర్ వినోద్‌కుమార్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంతో పాటు ఆయన పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ చర్యలకు ట్రైబల్ డైరెక్టరేట్‌కు కలెక్టర్ నివేదించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా ప్రకాష్‌రావుపై వేటు వేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ధాన్యం కొనుగోళ్లపై.. కలెక్టర్ ఆగ్రహం

కొల్లూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్



సాంకేతిక సమస్యలు పరిష్కారం

కొల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ వాసుదేవ్ వినోద్‌కుమార్ సందర్శించారు. ఇప్పటి వరకు కేవలం 250 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసినట్లు అధికారులు చెప్పడంతో.. ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందని వారిని ప్రశ్నించారు. వేమూరులోని రైస్ మిల్లులో ఉన్న సమస్యలను ఏడీఏ లక్ష్మి కలెక్టర్‌కు వివరించారు. ఇక్కడ నెలకొన్న సమస్యలను.. టీడీపీ మండలాధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన కలెక్టర్.. రూ.9.35 కోట్లు ధాన్యం కొనుగోళ్లకు ఓడీ తీసుకున్నామని, మరో రూ.17.24 కోట్లు తీసుకుంటామన్నారు. 3 లక్షల గోతాలను కూడా కొనుగోలు చేశామని చెప్పారు. రైతులు ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని సూచించారు.

అధికారుల బృందంతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

- సివిల్ సప్లయీస్ డీఎంగా శ్రీలక్ష్మి
- సాంకేతిక సమస్యలు పరిష్కారం: కలెక్టర్

(బాపట్ల, కొల్లూరు ఆంధ్రజ్యోతి)

ధాన్యం కొనుగోలులో రైతుల ఇక్కట్లపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా బ్యాంకు గ్యారెంటీల లోటుపాట్లను ఎత్తి చూపింది. వీటన్నింటిపై స్పందించిన కలెక్టర్ వినోద్‌కుమార్ దిద్దుబాటు చర్యలకు దిగారు. ధాన్యం సేకరణలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్న అన్ని విభాగాలతో బుధవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ధాన్యం సేకరణలో రైతుల నుంచి ఒక్క ఫిర్యాదు కూడా రావడానికి వీల్లేదని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో (మిగతా 6వ పేజీలో)



జంపనిలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఇక మేమెందుకు?

ఎమ్మెల్యేలు చెప్పారని నిధులిస్తున్నారు..

జడ్పీటీసీలు అడిగితే ఎందుకివ్వరు..?

'ఎమ్మెల్యే చెప్పారని నాదెండ్ల మండలంలో కోటి రూపాయలు ఇచ్చారు. వాళ్లు అడిగారని జడ్పీ నిధులు ఇస్తున్నపుడు మరి మేము అడిగితే ఎందుకు ఇవ్వ డం లేదు?. ఎమ్మెల్యేలు అడిగితే 80 శాతం నిధులు ఇవ్వండి. జడ్పీటీసీలకు కనీసం 20 శాతం అయినా కేటాయించండి. ఈ విషయాలు సరి చేసే వరకు అజెండా ఆమోదం పొందడానికి వీలు లేదు.'

\- ఒకటో స్థాయీ సంఘంలో జడ్పీటీసీలు

- స్థాయీ సంఘ సమావేశాల్లో సభ్యుల అసంతృప్తి
- కోరం లేక రెండు సమావేశాలు వాయిదా
- డిసెంబరు 15 నాటికి విద్యాజ్యోతి మెటీరియల్ : చైర్‌పర్సన్



ఒకటో స్థాయి సంఘం సమావేశం నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ క్రిస్టీనా, సీఈఓ జ్యోతిబసు



సమావేశం అజెండా తిరస్కరిస్తున్నట్లు చైర్ పర్సన్ క్రిస్టీనాకు నోటీసు అందజేస్తున్న జడ్పీటీసీలు మస్తాన్‌రావు, చిట్టిబాబు, సిద్ధయ్య

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ స్థాయీ సంఘం సమావేశాలు బుధవారం వాడీవేడిగా జరిగాయి. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, సీఈఓ జ్యోతిబసు ఆధ్వర్యంలో.. మూడు జిల్లాల అధికారులు పాల్గొన్నారు. పదవి కాలం ముగుస్తున్నా జడ్పీటీసీలకు సరైన నిధులు కేటాయించడం లేదని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ మండలాలకు కేటాయించే నిధులపై కూడా కనీస సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యేలు చెప్పారని నిధులు కేటాయించేటప్పుడు.. జడ్పీటీసీలు అడిగితే ఎందుకు కేటాయించరని ప్రశ్నించారు. గత మూడు స్థాయీ సంఘం సమావేశాల్లో చెప్పిన పనులకు కూడా నిధులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అందువల్ల ఒకటవ స్థాయీ సంఘం సమావేశం అజెండాను తిరస్కరిస్తున్నట్లు నోటీసు అందజేశారు. మొత్తం ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు జరగ్గా అందులో 2, 3 సమావేశాలు (మిగతా 6వ పేజీలో)

డంపింగ్ యార్డులోని మట్టితో చదును

వ్యాధులు వ్యాపిస్తాయని ప్రజల ఆందోళన

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డంపింగ్‌యార్డులో పెద్దఎత్తున పేరుకుపోయిన వ్యర్థాలను వేరు చేయగా వచ్చే మట్టి, మలినాల కలిసిన బురదమట్టిని నివాస ప్రాంతాలు, ఆరోగ్య కేంద్రం పరిసరాల చదునుకు ఉపయోగి



యార్డు వ్యర్థాలు కలిసిన బురదమట్టితో చదును చేస్తున్న ప్యాడిసన్‌పేటలోని ఆరోగ్యం కేంద్రం పరిసరాలు

స్తుండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే నేలంతా చిత్తడిగా మారడంతో పాటు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అయినా మున్సిపల్ అధికారులు డంపింగ్ యార్డులోని వ్యర్థాలతో చదును చేస్తున్నారని, దీనివల్ల రోగాలు వస్తాయని ప్రజలు వాపోతున్నారు. డంపింగ్ యార్డులోని వ్యర్థాలను గుంటూరులోని జిందాల్ పరిశ్రమకు పంపిస్తుండగా మిగిలిన మట్టి మలినాలతో మురికివాడల్లోని గుంతలు పూడుస్తున్నారు. ప్యాడిసన్‌పేట జగనన్నకాలనీ సమీపంలో రూ.కోటితో నిర్మిస్తున్న ఆరోగ్య కేంద్రం చుట్టూ ఉన్న గుంతలను కూడా ఈ వ్యర్థాల మట్టితోనే పూడుస్తున్నారు. మూడో వార్డులోని రాజీవ్‌గాంధీకాలనీ ఎస్టీల గృహాల పక్కనే చెరువుగా మారిన ప్రభుత్వ భూమి చదునుకు కూడా ఈ మట్టినే ఉపయోగిస్తున్నారు. పేరుకే మెరక చేసినట్లు అవుతుంది కాని మట్టి అంతా బురదతో కలిసి దుర్గంధం వెదజల్లుతున్నది. వర్షాల సమయంలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయని ఆప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

నేడే భూమి పూజ

- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు శంకుస్థాపన
- మాడ వీధులు, అన్నదాన కాంప్లెక్స్ తదితర నిర్మాణాలకు..

గుంటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలో వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ఉదయం 10.55 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. రూ.260 కోట్లతో రెండు దశల్లో చేపట్టనున్న పనులకు సీఎం చేతుల మీదుగా భూమిపూజ జరగనుంది. మొదటి దశలో రూ.140 కోట్లతో వివిధ పనులను చేపట్టనున్నారు. రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం నిర్మించనున్నారు. ఏడంతస్తుల మహా రాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయస్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ నిర్మిస్తారు. వీటి నిర్మాణాలకు రూ.48 కోట్లు ఖర్చు కానుంది. ఇక రెండో దశ పనులను రూ.120 కోట్లతో చేపట్టనున్నారు. శ్రీవారి ఆలయ మాడ వీధులు, అప్రోచ్ రోడ్లు, అన్నదాన కాంప్లెక్స్, యాత్రికులకు విశ్రాంతి భవనం, అర్చకులు - సిబ్బందికి క్వార్టర్స్ రెస్ట్ హౌస్, పరిపాలనా భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ వంటి పనులను చేపట్టనున్నారు. ఇప్పటికే ఆలయ నిర్మాణం మొదటి విడత పూర్తయిన నేపథ్యంలో శంకుస్థాపన అనంతరం రెండు, మూడవ విడత పనులు చేపట్టనున్నారు. 4వ విడత పనులకు కూడా త్వరలోనే టెండర్లు పిలుస్తారు.

గత ప్రభుత్వంలో గ్రహణం

తిరుమల తరహాలో రాజధాని అమరావతిలో శ్రీ వేంకటేశ్వరస్వామి (మిగతా 6వ పేజీలో)



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

స్థలమూ..రుణమూ..

- భూమిలేని పేదలకు ప్రభుత్వ వరం!
- మూడు సెంట్ల స్థలంతో పాటు రుణం పొందేలా చర్యలు
- నాలుగు రోజుల్లో ముగియనున్న గడువు

నిలువ నీడలేని నిరుపేదలకు, చిన్న గూడు కట్టుకుందామంటే జానెడు జాగా లేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం గొప్ప వరాన్ని అందించింది. ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రుణం కూడా ఒకేసారి ఇచ్చేలా చర్యలు చేపట్టింది. అందుకోసం ఇళ్లు లేని నిరు పేదలకు కూడా ఇప్పుడే ఇంటి రుణానికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది.



6

దేశాభివృద్ధిలో రాజ్యాంగం కీలకం

రాజ్యాంగ దినోత్సవంలో కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో రాజ్యాంగం పాత్ర కీలకమైనదని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. రాజ్యాంగ



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

ఆమోద దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం విద్యార్థులు, సభికులతో రాజ్యాంగ పీఠికను కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ స్వేచ్ఛ, సమానత్వంతో ప్రతి పౌరుడు ముందుకు సాగాలన్నారు. విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా నుంచి మాక్‌పార్లమెంట్‌కు ఎంపికైన 10 మంది విద్యార్థులను పతకాలు, అవార్డులతో కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం, సైన్స్ ఉపాధ్యాయుడు సాధిక్ హుస్సేన్ పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను గౌరవించాలి : ఎస్పీ

పౌరులందరూ రాజ్యాంగ విలువలను గౌరవించి దేశాభివృద్ధికి కృషి చేయాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణలో పోలీసుశాఖ పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ వి.శ్రీనివాసరావు, డీఎస్పీలు పి.విజయసారథి, పి.జగదీష్‌నాయక్, ఎ.శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు జి.నారాయణ, ఆర్.అహ్మద్ జానీ, సీఐలు ఎ.సుబ్బారావు, డి.మల్లికార్జునరావు, ఆర్ఐలు షేక్.మౌలుద్దీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

అద్దంకికి.. డబుల్ ఆనందం



- ఎట్టకేలకు ప్రకాశం జిల్లా పరిధిలోకి..
- 10 మండలాలతో ఏర్పాటు కానున్న డివిజన్
- మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషితో మార్గం సుగమం

అద్దంకి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రంతో పాటు ప్రకాశం జిల్లాలోనే తమను ఉంచాలన్న డిమాండ్ నెరవేరనుండటంతో అద్దంకివాసులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల హామీ అమలు కానుండటంతో అద్దంకివాసులకు డబుల్ ధమకా కలిగింది. ఎన్నికలకు ముందు అటు చంద్రబాబు నాయుడు, ఇటు లోకేశ్ ప్రకాశం జిల్లా పర్యటన సమయంలో మార్కాపురం జిల్లా ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అదే సమయంలో అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లా పరిధిలోకి చేరుస్తామని హామీ ఇచ్చారు. దీంతో మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి గొట్టిపాటి రవికుమార్ అద్దంకిని రెవెన్యూ డివిజన్ చేయాలన్న తలంపుతో ముందుకు సాగారు. వైసీపీ ప్రభుత్వంలో బాపట్ల జిల్లాలో కలపడంతో మూడున్నరేళ్లుగా అద్దంకి ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లా పరిధిలోకి అద్దంకిని చేర్చడంతో పాటు అద్దంకి కేంద్రంగా ప్రత్యేకంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. దీంతో అద్దంకి, దర్శి నియోజకవర్గాల పరిధిలోని 10 మండలాలతో అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకానున్నది. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో ఇప్పటి వరకు ఒంగోలు, చీరాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న ప్రజలకు మేలు జరగనున్నది. దర్శి నియోజకవర్గంలోని ఐదు మండలాలు అద్దంకి రెవెన్యూ డివిజన్ పరిధిలోకి చేరనుండటంతో వారికి సౌకర్యవంతంగా మారనున్నది. అద్దంకి నియోజకవర్గంను ప్రకాశం జిల్లా పరిధిలోకి చేర్చటంతో పాటు అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటులో మంత్రి గొట్టిపాటి రవికుమార్ వ్యూహాత్మకంగా పావులు కదపటంతో మార్గం సుగమమైంది.


కల నెరవేరింది..



ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కల నెరవేరింది. వైసీపీ ప్రభుత్వం అసంబద్ధంగా విభజన చేసి దూరంగా ఉన్న బాపట్లలో అద్దంకిని చేర్చడంతో ఇంతకాలం ఇబ్బంది పడిన ప్రజలకు మేలు జరగనున్నది. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అద్దంకి నియోజకవర్గం ప్రకాశం జిల్లా పరిధిలోకి చేరడంతో పాటు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానున్నది.

\- మన్నం త్రిమూర్తులు, అద్దంకి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు


దూరాభారం తప్పింది



జిల్లా కేంద్రం, రెవెన్యూ డివిజన్‌లో పనుల కోసం దూరంగా ఉన్న బాపట్ల, చీరాలలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతు న్నాం. అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుండటంతో దూరం ప్రయాణం చేసే బాధ తప్పింది.

\- ఆదిబాబు, విశ్రాంత ఉపాధ్యాయుడు, వేమవరం,

మంచి నిర్ణయం



అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తూ దర్శి నియోజకవర్గంలోని మండలాలను కలపనుండటం మంచి నిర్ణయం.

-ఐ.వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ, తాళ్లూరు

167 ఏ రోడ్డులో రక్షణపై నీలినీడలు

హడావుడి పనులతో తరచూ ప్రమాదాలు

చీరాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలతో పని లేదు. నెల సమయమే గడువు ఉంది. పనుల్లో వేగం పెంచండి.. ఇదీ వాడరేవు - పిడుగురాళ్ల 167 ఏ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో అధికారుల తీరు. రెండేళ్లుగా సాగుతున్న పనుల్లో రక్షణ చర్యలు విఫలమవడంతో వాహన చోదకుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. వాడరేవు నుంచి పర్చూరు వరకు నిర్మాణం జరిగిన రోడ్డులో ఇప్పటి వరకు చోటుచేసుకున్న ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మరణాలు సంభవించాయి. అనేక మంది గాయాలతో జీవచ్ఛవాల్లా మారారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో, పెండింగ్ పనులున్న ప్రాంతాల్లో హెచ్చరికలు ఏర్పాటు చేయలేదు. దీంతో చీరాల మండలం విజయనగర్ కాలనీ సమీపంలో ఆటో బోల్తా పడి పలువురు కూలీలు గాయాలపాల య్యారు. అప్పటి నుంచి ప్రారంభమైన ఘటన లు ఈ బుధవారం వరకు తరచూ ప్రమాద ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. అక్టోబరు 5న వాడరేవు జీరో పాయింట్ వద్ద సూచికలు లేక చీకట్లో స్థానికుడు లక్ష్మణరెడ్డి మృత్యువాత పడ్డాడు. కారంచేడు వద్ద జరిగిన ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందాడు. పర్చూరు - చిలకలూరిపేట మార్గంలో బస్, టిప్పర్ ఢీకుని ఐదుగురు సజీవదహనమయ్యారు. తాజాగా వాడరేవుకు చెందిన మోషే వంతెనపై ప్రయాణించి మృత్యువాత పడ్డాడు. కీర్తివారిపాలెం వద్ద సుమారు మూడు ప్రమాదాలు జరిగాయి. ఈ విధంగా నిత్యం ఘటనలు జరుగుతున్నా అధికారులు జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. నిర్మాణ పనలు డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. ఈ క్రమంలో వేగంగా జరుగుతున్న పనుల కారణంగా ఇంకెన్ని ప్రమాదాలు చోటుచేసుకుంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



మోషే మృతిచెందిన అనంతరం ఏర్పాటు చేసిన సూచికలు

సీజ్ వాహనాలకు వేలం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొత్తపేట(చీరాల), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీజ్ చేసిన ఒక లారీ, స్కూటీకు సంబంధించి బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేలం జరిగింది. అశోక్ లేలాండ్ లారీను రూ.2.80 లక్షలకు వేలం ప్రారంభించగా రూ.3.40 లక్షలకు విక్రయించారు. అలాగే స్కూటీను రూ.39 వేలకు వేలం పెట్టగా రూ.41 వేలకు విక్రయించినట్లు సీఐ తెలిపారు.

ఇక మేమెందుకు..?

(5వ పేజీ తరువాయి)
కోరం లేక వాయిదా వేశారు.

విద్యార్థులకు విద్యాజ్యోతి

జడ్పీ ఉన్నత పాఠశాలల 10వ తరగతి విద్యార్థులకు డిసెంబర్ 15 నాటికి విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హేనీ క్రిస్టినా తెలిపారు. నాలుగవ స్థాయీ సంఘం సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. స్టడీ మెటీరియల్ సరఫరాకు ఇప్పటికే టెండర్లు పూర్తిచేయడం జరిగిందన్నారు. మెటీరియల్ ఫైనల్ ప్రూఫింగ్ కోసం విద్యాశాఖ అధికారులకు పంపించామన్నారు. ఐదవ స్థాయీ సంఘ (మహిళా సంక్షేమం) సమావేశం తెనాలి జడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి అధ్యక్షతన డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ చాంబర్‌లో జరిగింది.ఆరవ స్థాయీ సంఘ (సాంఘిక సంక్షేమం) సమావేశం జడ్పీ వైస్ చైర్మన్ అనురాధ అధ్యక్షతన సీఈఓ వీర్ల జ్యోతి బసు చాంబర్‌లో జరిగింది.

ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానంటున్న ఎంపీడీవో

ఒకటవ స్థాయీ సంఘం సమావేశంలో నాదెండ్ల జడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు ఆసక్తికరమైన విషయాన్ని ప్రస్తావించారు. అక్కడ ఒక వేలం పాట నిర్వహించే విషయం లో ఎంపీడీఓ జడ్పీ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారని ఆరోపించారు. ఈ విషయం గురించి తాను మాట్లాడుతుంటే తనపై ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని ఎంపీడీవో బెదిరించడం అంటే మండలంలో ఏమి జరుగుతుందో అర్థం చేసుకోవాలన్నారు. అసలు కనీస సమాచారం లేకుండా జరిగిన సదరు వేలం పాటను రద్దు చేసి జడ్పీలో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

నిధులు రాబట్టడంలో విఫలం

గుంటూరు జిల్లా పరిషత్‌కు రావాల్సిన నిధులు రాబట్టడంలో విఫలమయ్యారని రొంపిచర్ల జడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి ఆరోపించారు. సమావేశాల అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. జడ్పీకి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.23 కోట్లు రావాల్సి ఉండగా.. కేవలం రూ.9 కోట్లు మాత్రమే వచ్చాయన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి గడచిన 18 నెలల్లో రూ. 35 కోట్లు రావాల్సి ఉండగా కేవలం రూ.41 లక్షలు మాత్రమే వచ్చాయని చెప్పారు. రెవెన్యూ మంత్రి జిల్లాలో ఉన్నా ఎందుకు ఆయనను కలిసి వినతి పత్రం అందజేసి నిధులు విడుదల చేయించలేదని ప్రశ్నించారు.

నేడే భూమి పూజ

(5వ పేజీ తరువాయి)
ఆలయం నిర్మించాలని 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. కృష్ణా నది తీరాన అత్యద్భుతంగా ఆలయ నిర్మాణానికి 25.417 ఎకరాలు కేటాయించింది. ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక గత పాలకులు ఆలయ విస్తీర్ణాన్ని కుదించారు. కేటాయించిన భూమిలోనూ కోత పెట్టడంతో పాటు విస్తరణ పనులు రద్దు చేశారు. కూటమి ప్రభుత్వం వేంకటేశ్వరస్వామికి దేవాలయం విస్తరణ పనులకు మళ్లీ శ్రీకారం చుట్టింది.

నిబంధనలు అతిక్రమించిన ఆక్వా చెరువులపై చర్యలు

● మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి సాగుచేస్తున్న ఆక్వా చెరువులపై చర్యలు తీసుకుంటామని మత్స్యశాఖ ఏడీ సంగాని శ్రీనివాసరావు తెలిపారు. అమ్మనబ్రోలు సమీపంలో సాగు చేస్తున్న రొయ్యల చెరువుల వల్ల తాగునీరు కలుషితమవుతున్నాయని పలువురు గ్రామస్థులు కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. దాంతో మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాలుష్యనియంత్రణ, రెవెన్యూ, వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు సంయుక్తంగా అమ్మనబ్రోలు సమీపంలోని రొయ్యల చెరువులను బుధవారం తనిఖీ చేశారు. చెరువుల నుంచి వచ్చే వ్యర్థాలు నేరుగా గుండ్లకమ్మ నది, ఉలిచి చెక్‌డ్యాంలో కలిసి తాగునీరు కలుషితమవుతున్నాయని గుర్తించినట్లు ఏడీ తెలిపారు. కోస్టల్ ఆక్వా అథారిటీ నిబంధనల ప్రకారం చెరువుల నుంచి వచ్చే వ్యర్థాలు తాగునీటి వనరులలో కలువకుండా ప్రత్యేకంగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలని, ఇక్కడ అలా జరగడం లేదన్నారు.

స్థలమూ.. రుణమూ...

- భూమిలేని పేదలకు ప్రభుత్వ వరం!
- మూడు సెంట్ల స్థలంతోపాటు రుణం పొందేలా చర్యలు
- ఆధార్, నరేగా జాబ్ కార్డు ఉంటే చాలు
- పీఎంఏవై గ్రామీణ్‌లో దరఖాస్తుకు అవకాశం
- మూడు జిల్లాల్లో 36వేల మంది దరఖాస్తు..
- నాలుగు రోజుల్లో ముగియనున్న గడువు



గుంటూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నివాస స్థలం లేని గ్రామీణ ప్రాంత పేదలకు ప్రతి ఒక్కరికీ 3 సెంట్ల స్థలాన్ని ఇస్తానని ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి, అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు త్వరలో అర్హులైన పేదలకు ప్రభుత్వం మూడు సెంట్ల స్థలం ఇస్తానని చెబుతోంది. వారందరికీ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)-గ్రామీణ పథకం కింద గృహ రుణాలు అందించి చేయూతగా నిలవాలని ప్రభుత్వం భావిస్తోంది. స్థలం వచ్చిన తరువాత దరఖాస్తు చేసుకుని, అది ఓకే అవడానికి సమయం పట్టే అవకాశం ఉండడంతో ముందస్తుగానే స్థలం లేని పేదలను కూడా పీఎంఏవై-జీ కింద గృహరుణానికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. అయితే ఈ విషయంపై సామాన్య ప్రజలకు తగినంత అవగాహన లేకుండా పోయింది. అందువల్ల వారంతా ఈ దరఖాస్తు ప్రక్రియకు దూరంగా ఉన్నారు. అలాంటివారికి కూడా అవగాహన కల్పించి, వారితో కూడా దరఖాస్తులు చేసుకునేలా గృహ నిర్మాణ శాఖను, సచివాలయ సిబ్బందిని సిద్ధం చేసింది.

● మూడు జిల్లాల్లో 36వేల దరఖాస్తులు

ఇప్పటి వరకూ గుంటూరు జిల్లాలో 5,600 మంది, బాపట్ల జిల్లాలో 9,600 మంది, పల్నాడు జిల్లాలో 21,000 మంది ఈ స్కీము కింద దరఖాస్తు చేసుకున్నారు. గుంటూరులో సీఆర్డీఏ, మున్సిపల్ కార్పొరేషన్లు, పట్టణ ప్రాంతాలు అధికంగా ఉండడంతో దరఖాస్తులు ఒకింత తక్కువగా వచ్చాయి. పల్నాడు జిల్లాలో అత్యధికంగా 21వేల మంది దరఖాస్తులు చేసుకోగా, ఇంకా 28వేల మంది దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. బాపట్ల జిల్లాలో కూడా మరో 15వేల మంది వరకూ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉన్నట్లు చెబుతున్నారు. అలాంటి వారందరినీ ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకునేలా చేయలని అధికారులు ప్రయత్నిస్తున్నారు.

● దరఖాస్తు.. చాలా సులభం!

పీఎంఏవై గ్రామీణ దరఖాస్తు ప్రక్రియను ప్రభుత్వం అత్యంత సులభతరం చేసింది. సమీపంలోని సచివాలయానికి వెళ్లిగానీ, సొంతంగా గృహనిర్మాణ శాఖ వెబ్‌సైట్ ద్వారా గానీ దరఖాస్తు చేసుకునే వీలు కల్పించింది. దరఖాస్తుకు కావాల్సిందల్లా సదరు లబ్ధిదారుడి ఆధార్ కార్డు, గ్రామీణ ఉపాధి హామీ పథకం(నరేగా) జాబ్ కార్డు మాత్రమే. ఇంటి స్థలం లేకపోయినా, ఈ రెండింటినీ ఆధారం చేసుకుని దరఖాస్తును ప్రాసెస్ చేసేలా గృహనిర్మాణ శాఖ చర్యలు తీసుకుంది. కాగా జాబ్ కార్డు పొందే ప్రక్రియను కూడా సులభతరం చేసింది. ఎంపీడీఓ లాగిన్ ద్వారా అందించే ఈ జాబ్ కార్డును రెండే గంటల్లో అందించేలా చర్యలు తీసుకున్నారు. నవంబరు 30వ తేదీతో గడువు ముగియనున్న నేపథ్యంలో ఇలాంటి వెసులుబాట్లు కల్పించి సాధ్యమైనన్ని ఎక్కువ దరఖాస్తులు కేంద్రానికి వెళ్లేలా ప్రయత్నిస్తున్నారు. త్వరలో ప్రభుత్వం ఇచ్చే మూడు సెంట్ల పట్టా వివరాలను నమోదు చేసి ఇంటి నిర్మాణ ప్రక్రియను కూడా త్వరితగతిని ప్రారంభించేలా చేస్తున్నారు.

రైతన్న కోసమే ప్రజా ప్రభుత్వం

బుర్లవారిపాలెంలో ప్రతి ఇంటికీ వెళ్లిన ఎమ్మెల్యే కొండయ్య

బుర్లవారిపాలెం(చీరాల), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతన్నల అభ్యున్నతి కోసమే ప్రజాప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. బుధవారం చీరాల మండల పరిధిలోని బుర్లవారిపాలెంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈక్రమంలో ఎమ్మెల్యే ప్రతి అన్నదాత ఇంటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భరోసాకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే గ్రామంలోని ఎరువుల దుకాణాన్ని పరిశీలించి యూరియా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి మాత్రమే విక్రయాలు జరగాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట ఏడీఏ రత్నకుమారి, ఏవో నిర్మలాదేవి, ఏఎంసీ చైర్మన్ జనార్దనరావు పాల్గొన్నారు.


ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ధాన్యం కొనుగోళ్లపై.. కలెక్టర్ సీరియస్

(5వ పేజీ తరువాయి)
ఉదాసీనతను ఉపేక్షించే ప్రసక్తే లేదనే కలెక్టర్ హెచ్చరించారు.

ప్రత్యేక బృందాలు

ధాన్యం కొనుగోళ్ల అంకాన్ని పర్యవేక్షించడానికే పది మంది అధికారులతో ప్రత్యేక బృందాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ నియమించారు. కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సారథ్యంలో ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ ఏఎం, అగ్రికల్చరల్ ఏడీ టీంలో సభ్యులుగా ఉండనున్నారు. అదే విధంగా ఏడుగురు బృందంతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను నియమించారు. బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు సంయుక్తగా ఈ టీమ్‌కు సారథ్యం వహిస్తారు. వీరితో పాటు మరో ఆరుగురు అధికారులు ఇందులో సభ్యులుగా ఉంటూ ధాన్యం కొనుగోళ్లను నిత్యం పర్యవేక్షించనున్నారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆకస్మిక తనిఖీలు చేయడంతో పాటు, నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలుండేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు బుధవారమే బాపట్ల పట్టణంలోని మిల్లుల్లో తనిఖీలకు దిగారు.

సివిల్ సప్లయీస్ డీఎం తొలగింపు

సివిల్ సప్లయీస్ విభాగం విజయవాడ జోనల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న కె. శివపార్వతి బాపట్ల ఇన్‌చార్జి డీఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో ఆమె పనితీరుపై తీవ్ర అసంతృప్తిగా ఉన్న కలెక్టర్ డీఎం బాధ్యతల నుంచి తప్పించారు. గతంలో రెండేళ్ల ఇక్కడ సివిల్ సప్లయీస్ డీఎంగా విధులు నిర్వహించిన వి. శ్రీలక్ష్మిని పూర్తి స్థాయి డీఎంగా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. శ్రీలక్ష్మి గురువారం బాధ్యతలు తీసుకోనున్నారు.

కీచక ఉపాధ్యాయుడికి బుద్ధిచెప్పారు

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు గుర్తింపు

ఇక నుంచి కాలేజీకి రావద్దంటూ హెచ్చరిక

నాగులుప్పలపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడికి విద్యార్థినుల తల్లిదండ్రులు తగిన బుద్ధి చెప్పిన సంఘటన మండలంలోని బి.నిడమానూరు గ్రామంలో జరిగింది. బాధిత తల్లిదండ్రులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న హైస్కూల్ ప్లస్ మహిళా కళాశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇంటర్ మొదటి ఏడాది విద్యార్థినులు ఐదుగురు, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు 13మంది చదువుతున్నారు. సదరు కళాశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఓ టీచర్ గత కొద్దిరోజుల నుంచి తన పట్ల అసభ్యంగా ప్రవరిస్తున్నాడని ఓ విద్యార్థిని తల్లికి ఫిర్యాదు చేసింది. ఈక్రమంలో సదరు ఉపాధ్యాయుడిని నిలదీసేందుకు కళాశాలకు వెళ్లగా అతను విధులకు రాలేదు. దీంతో పెద్దమనుషులు, తల్లిదండ్రులు పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు సమక్షంలో బుధవారం కళాశాల వద్దకు అతనిని పిలిపించారు. అందరి సమక్షంలో అతనిని నిలదీయడంతో ఫిర్యాదు చేసిన బాలికతోపాటు పలువురు విద్యార్థినులు సైతం తమతో కూడా అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తెలిపారు. దీంతో కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు, స్థానికులు ఆ ఉపాధ్యాయుడిని చితకబాదినట్లు సమాచారం. ఆ తర్వాత బాధిత విద్యార్థినులకు క్షమాపణలు చెప్పించి ఇకపై కళాశాలకు రావద్దని హెచ్చరించి పంపించినట్లు తెలిసింది. జరిగిన ఘటనపై విచారణ చేపట్టినట్లు ఎస్ఐ రజియాసుల్తానా తెలిపారు.

జిల్లా సంబరం

పునర్విభజనపై హర్షాతిరేకాలు

సంబరాలు చేసుకుంటున్న పశ్చిమ ప్రాంత ప్రజానీకం

పలుచోట్ల సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

'దర్శి' ప్రజలలో ఆనందం

తిరిగి ప్రకాశంలో చేరికపై అద్దంకి, కందుకూరు ప్రాంత ప్రజలు ఆనందం

రెవెన్యూ డివిజన్ విషయంలో గిద్దలూరువాసుల్లో అసంతృప్తి

జిల్లా పునర్విభజన విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న తాజా నిర్ణయంపై ఉమ్మడి జిల్లా ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చడంతో వారు సంతోషంలో సంబరాలు చేసుకుంటూ ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తున్నారు. తమకు అనుకూలంగా ఉండే ప్రకాశం జిల్లాలోకి తిరిగి చేర్చడంపై కందుకూరు, అద్దంకి నియోజకవర్గాల ప్రజానీకం అలాగే తమ ప్రాంతాన్ని ప్రకాశంలోనే కొనసాగించడం పట్ల దర్శి ప్రాంత ప్రజలు ఆనందంగా ఉన్నారు. అదే సమయంలో ప్రత్యేక జిల్లా ఏర్పాటుపై ఆనందంగా ఉన్నా రెవెన్యూ డివిజన్ విషయంలో తమకు అన్యాయం జరిగిందని గిద్దలూరు ప్రాంత ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

ఒంగోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో నూతనోత్సాహం నెలకొంది. ముఖ్యంగా పశ్చిమ ప్రాంత వాసులు సంబరాలు చేసుకుంటున్నారు. సీఎం చిత్రపటాలకు పాలాభిషేకాలతో కృతజ్ఞతలు తెలుపుతున్నారు. రాష్ట్రంలో జిల్లాలో పునర్విభజనపై మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులపై సుదీర్ఘంగా సమీక్షించి తుది నిర్ణయాన్ని సీఎం చంద్రబాబునాయుడు తీసుకున్న విషయం విదితమే. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 26 జిల్లాలకు అదనంగా మరో మూడు జిల్లాలు, అలాగే కొత్తగా నాలుగు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ 17 జిల్లాల్లో వివిధ ప్రాంతాల సర్దుబాట్లకు అనుమతించారు. అలాంటి సర్దుబాట్లు, కొత్తవాటి ఏర్పాటులో ప్రధాన భాగస్వామ్యం మన జిల్లాకు అధికంగా ఉంది. ప్రస్తుతం ఒంగోలు కేంద్రంగా ఎనిమిది నియోజకవర్గాలతో ఉన్న మన జిల్లాలో పశ్చిమ ప్రాంతంలోని మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాలను మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లాగా ప్రకటించారు. అలాగే మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లో మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గంలోని మండలాలు, కనిగిరి డివిజన్‌లోకి కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గంలోని మండలాలు కేటాయించారు. అలా నాలుగు నియోజకవర్గాలు, రెండు రెవెన్యూ డివిజన్లు, 21 మండలాలతో కొత్తగా మార్కాపురం జిల్లా ఏర్పాటు కానుంది.

ప్రకాశంలో మూడు డివిజన్లు

ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి దర్శితోపాటు గతంలో నెల్లూరు జిల్లాలోకి వెళ్లిన కందుకూరు, బాపట్ల జిల్లాలోకి వెళ్లిన అద్దంకిలను కలిపి ప్రకాశం జిల్లాగా ఉండనుంది. ఈ పరిధిలో ఇప్పటికే ఉన్న ఒంగోలు, కందుకూరులతో పాటు కొత్తగా అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి అద్దంకి, దర్శి నియోజకవర్గాల్లోని పది మండలాలను అందులో ఉంచుతున్నారు. అదేసమయంలో కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు, మర్రిపూడి మండలాలను కందుకూరు డివిజన్‌లోకి తిరిగి చేర్చారు. అలా ఒంగోలు కేంద్రంగా మన జిల్లా విషయంలో అన్ని ప్రాంతాల ప్రజలకు సంతృప్తికరంగానే ఉంది. స్థానిక ప్రజల ఆకాంక్షలకు ప్రభుత్వం, సీఎం ఒకే చెప్పారు. అలాగే జిల్లా ఏర్పాటు విషయంలో పశ్చిమ ప్రాంతంలోనూ పూర్తి సంతృప్తిని ఆ ప్రాంత ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కాలంగా తాము ఎదురు చూస్తున్న మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తున్నారు. గతరాత్రి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీతోపాటు భారీగా సంబరాలు చేశారు. బుధవారం యర్రగొండపాలెంలో టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు నేతృత్వంలో వేడుకలు నిర్వహించగా, మార్కాపురంలో బీజేపీ శ్రేణులు, కంభంలో వివిధ వర్గాల వారు సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

గిద్దలూరుకు డివిజన్ సమస్య

గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు మాత్రం మార్కాపురం జిల్లా ఏర్పాటుపై సంతృప్తితో ఉన్నప్పటికీ తమ ఎమ్మెల్యే కోరిన ప్రకారం గిద్దలూరు రెవెన్యూ డివిజన్ ఇవ్వకపోవడమే కాక దగ్గరగా ఉండే మార్కాపురం కాకుండా దూరంగా ఉండే కనిగిరి డివిజన్‌లో కలపడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. నిజానికి ఈ విషయంలో ఆ ప్రాంత ప్రజల ఆలోచన సరైనదేగానే భావించాల్సిన ఉంది. కాగా కనిగిరిలో ఇప్పటికే రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఉండటంతో గిద్దలూరు ప్రాంతాన్ని అందులో చేర్చినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలు మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. ఆయా మండలకేంద్రాలు మార్కాపురానికి 25 నుంచి 65 కి.మీ. దూరం లోపుగా ఉండటమే కాక రెండు ప్రధాన జాతీయ రహదారులు, నిత్యం బస్సు సర్వీసులు ఇతర రవాణా సౌకర్యాలతో రాకపోకలు సులువుగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఆరు మండలాలను కనిగిరి డివిజన్‌లో కలపడంతో వారు రవాణా విషయంలో తీవ్ర సమస్యగా భావిస్తున్నారు. గిద్దలూరు నియోజకవర్గం నుంచి నేరుగా కనిగిరికి రోడ్డు సౌకర్యం లేదు. గిద్దలూరు నుంచి కనిగిరి వెళ్లాలంటే నంద్యాల-ఒంగోలు రహదారిలో చిన్నారికట్ల జంక్షన్ వరకు వచ్చి తిరిగి మరో 30కి.మీ లోపలికి వెళ్లాలి. దాదాపు 100 కిలోమీటర్లకుపైగా దూరం ఉంటుంది. ఇతర మండలాల నుంచి అదే రహదారిలో ప్రయాణం చేయాలి. నేరుగా వెళ్లేందుకు ఒక బస్సు సౌకర్యం కూడా లేని పరిస్థితి. భూ సమస్యలు అధికంగా ఉండే గిద్దలూరు ప్రాంత వాసులకు రెవెన్యూ డివిజన్ దూరం కావడం, రవాణా సౌకర్యం సరిగా లేకపోవడం తీవ్ర ప్రతికూల పరిస్థితి.

డివిజన్ కావాలి లేదా మార్కాపురంలోనే ఉంచండి

ప్రస్తుతం మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పడుతుండగా గిద్దలూరు వాసులు ఎక్కడి నుంచైనా జిల్లా కేంద్రానికి ఏ సమయంలోనైనా గంట వ్యవధిలో చేరుకునే అవకాశం ఉంది. అదే కనిగిరికి వెళ్లి రావాలంటే ఒక రోజు పట్టే పరిస్థితి. దీనిపై ఆ ప్రాంత ప్రజలు అసంతృప్తితో కనిపిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే మార్కాపురం జిల్లా ఏర్పాటు వల్ల కలిగిన ఉత్సాహం కన్నా కనిగిరి డివిజన్‌లో చేర్చిన అసంతృప్తే అధికంగా కనిపిస్తోంది. ఈ ప్రతికూల పరిస్థితిని గుర్తించిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గిద్దలూరు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ కోసం శాయశక్తులా ప్రయత్నం చేశారు. మంత్రివర్గ ఉపసంఘంతో చర్చించగా తొలుత సానుకూలత వ్యక్తం చేసినప్పటికి చివరకు సాకారం కాలేదు. కాగా తమ ఎమ్మెల్యే కోరిన విధంగా గిద్దలూరు డివిజన్ ఏర్పాటు చేయాలని, అలా సాధ్యంకాని పక్షంలో ఇప్పటివరకు ఉన్న విధంగా మార్కాపురం డివిజన్‌లోనే తమ ప్రాంతాన్ని కొనసాగించాలన్న బలమైన ఆకాంక్ష ఆ ప్రాంత ప్రజల్లో కనిపిస్తోంది.

అవీఇవీ

సీపీఐ కార్యాలయం ఎదుట విద్యుత్ టవర్‌ను తొలగించాలి

అద్దంకిటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : అద్దంకి సీపీఐ కార్యాలయం గేటు ఎదుట ఆనాలోచితంగా ఏర్పాటు చేసిన విద్యుత్ టవర్‌ను వెంటనే తొలగించాలని బాపట్ల జిల్లా సీపీఐ కార్యదర్శి తన్నీరు సింగరకొండ విద్యుత్‌శాఖ అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక శింగరకొండరోడ్డులోని విద్యుత్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సింగరకొండ మాట్లాడుతు సీపీఐ కార్యాలయం ఎదుట విద్యుత్ టవర్‌ను ఏర్పాటు చేయడంపై తాము మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, ఆంజనేయులు, గల్లా కోటేశ్వరరావు, అహరోను, శ్రీరామమూర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దళితవాడను పంచాయతీగా ఏర్పాటుచేయాలి

మార్టూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : ప్రతి దళితవాడను పంచాయతీలుగా ఏర్పాటుచేయాలని, గ్రామస్థాయిలో దళితులు సంఘటితంగా బలపడాలన్నదే తమ లక్ష్యమని అడిషనల్ డీజీపీ పీవీ సునిల్‌కుమార్ చెప్పారు.భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి మార్టూరులో నేతాజీనగర్, రామ్‌నగర్‌లో కూడలిలో యువకులు ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిదిగా విచ్చేసిన సునీల్ కుమార్ మాట్లాడుతూ సామాజికంగా వెనుకబడిన దళితవర్గాలు అందరితో సమానంగా కలిసి పోవాలని, అధికార భాగస్వామ్యం పొందాలన్నదే డాక్టరు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ ప్రధాన ఉద్దేశమన్నారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు మాట్లాడుతూ రాజ్యాంగానికి అనుకూలంగా పాలకులు నడచుకోవాలన్నారు. తొలుత మార్టూరు సెంటరు నుంచి సునిల్ కుమార్‌కు యువకులు ర్యాలీగా ద్విచక్రవాహనాలతో వెళ్లి స్వాగతం పలికారు. తరువాత ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కొండవీటి కొండలరావు, జీ సుందరం, జాన్, పూతలపాటి ప్రభాకర్, మైలా చిన్న నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి కల్యాణ మహోత్సవం


స్వామి కల్యాణ తంతును పూర్తి చేస్తున్న అర్చకులు

పర్చూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు శివారు గ్రామ పొలిమేరలోని స్వామివారి పుట్ట వద్ద వేంచేసియున్న శ్రీవల్లీదేవసేనా సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీ సువర్చలా సమేత శ్రీప్రసన్నాంజనేయస్వామివ్లా కల్యాణ మహోత్సవం బుధవారం అత్యంత ఘనంగా జరిగింది. ఆలయ 50వ వార్షిక జయంతి సందర్భంగా స్వామివార్లకు వేడుకలు నిర్వహించారు. ఆయాగ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి వేడుకలను తిలకించారు. అనంతరం ఆలయ కమిటీ నేతృత్వంలో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆయల కమిటీ అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు, కార్యదర్శి మువ్వల వెంకట రామసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కోలాట భజన కార్యక్రమాలు అలరించాయి.

వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న గోపాలకృష్ణమూర్తి దంపతులు

అద్దంకి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో కాలువ కట్ట మీద నివాసం ఉండే 30 మంది వృద్ధులు, వితంతువులకు బుధవారం రాత్రి 4వ వార్డు కౌన్సిలర్ మాగులూరి తిరుపతమ్మ గోపాలకృష్ణమూర్తి దంపతులు దుప్పట్లు పంపిణీ చేశారు. కాలువకట్ట చర్చి వద్ద నిర్వహించిన కూటముల ముగింపు సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి ధర్మకర్తల మండలి సభ్యురాలు వెంకటరత్నం పాల్గొన్నారు.

చీరాల ప్రజల ఆశాజ్యోతి కోటయ్య

ఘనంగా ప్రగడ 30వ వర్ధంతి


కోటయ్యకు నివాళులు అర్పిస్తున్న ప్రతినిధులు

చీరాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రజల సమస్యల కోసం అహర్నిశలు శ్రమించి, చిరకాల ఆశాజ్యోతిగా ప్రగడ కోటయ్య మిగిలారని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం ప్రజాబంధు ప్రగడ కోటయ్య వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ చీరాలకు మూడు దఫాలు ఎమ్మెల్యేగా, ఒకమారు ఎంఎల్సీగా పనిచేసి అభివృద్ధి పథంలో చీరాలను ఉంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో దామర్ల శ్రీకృష్ణ, బి. పరంజ్యోతి, జంజనం శ్రీనివాసరావు, డాక్టర్ హైమ సుబ్బారావు, గోసాల ఆశీర్వాదం, చుండూరి వాసు, మాచర్ల మోహన్‌రావు, గొర్రెపాటి రవికుమార్ పాల్గొన్నారు.

శింగరకొండ అభివృద్ధికి పూర్తి సహకారం

టీటీడీ పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మి

అద్దంకి,నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : శింగరకొండ అభివృద్ధికి పూర్తి సహకారం అందింస్తానని టీటీడీ పాలక మండలి సభ్యురాలు, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి చెప్పారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పనబాక లక్ష్మీ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం పనబాక లక్ష్మిని పూజారులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఆశీర్వదించి సత్కరించారు. శింగరకొండలో జరిగిన అభివృద్ధి పనులు, చేపట్టబోయే పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి సభ్యులు నూతి ప్రసాద్, పద్మజ, వెంకటరత్నం, నాగమ్మ, బత్తుల చంద్రశేఖర్, ఆకుల కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరే సురేంద్ర, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు అనంతరం పనబాక లక్ష్మితో నేతలు, ధర్మకర్తల మండలి సభ్యులు

రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు

కోలలపూడి, కొణికి గ్రామాలలో ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

సీఎం చంద్రబాబుకు, మంత్రి గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, నవంబరు26(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవ వల్ల పర్చూరు నియోజకవర్గానికి రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. మార్టూరు మండలంలోని కోలలపూడి, ఇంకొల్లు మండలంలోని కొణికి గ్రామాలకు వీటిని మంజూరుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వాస్తవంగా కోలలపూడి, బొల్లాపల్లి గ్రామాల మధ్య, కొణికి గ్రామం పరిధిలో ఏళ్ల తరబడి రైతులు, ఇంటి వినియోగదారులు తరచూ విద్యుత్ సమస్యలతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌ఫారంలు తరచూ కాలిపోవడం, లోవోల్టేజీ సమస్య, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సరఫరాలో లోపం జరుగుతుండడంతో బోర్లు, బావులు, మోటార్లు సక్రమంగా పనిచేయకపోవడంతో రైతులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోజు రోజుకూ విద్యుత్ కనెక్షన్లు పెరుగుతుండడం, పాత విద్యుత్ లైన్లు దెబ్బతినడం తదితర సమస్యలను ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజానీకం, అక్కడ స్థానికంగా టీడీపీ నాయకులు పలుసార్లు ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి విద్యుత్ సమస్యను తీసుకువచ్చారు. అత్యవసరంగా నియోజకవర్గంలో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరుచేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఏలూరి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సబ్‌స్టేషన్లు మంజూరుతో రైతులకు భారీ ప్రయోజనాలు చేకూరనున్నాయని, అంతేగాక కొత్తగా చిన్న పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉంటుందని, పరిశ్రమలకు తోడ్పాటుగా ఉంటుందని, కొంతమందికి ఉపాధి అవకాశాలను కలగచేసినట్లుగా ఉంటుందని ఏలూరి ప్రభుత్వానికి ప్రత్యేకంగా వినతిపత్రం పంపించారు. ఈ మేరకు రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరుకావడంతో ప్రజలు, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే ఏలూరికి అభినందనలు తెలియచేశారు. అదేవిధంగా రెండు సబ్‌స్టేషన్లు మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రిచంద్రబాబుకు, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లకు ఎమ్మెల్యే ఏలూరి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

కారు, మోటార్ సైకిల్ ఢీ

మోటార్ సైక్లిస్టులకు గాయాలు



గాయపడిన మోటార్ సైకిలిస్టు

మేదరమెట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గుడిపాడు సమీపం జాతీయ రహదారిలోని అత్యవసర జరిగిన ప్రమాదంలో మోటార్ సైకిలిస్టులకు గాయాలయ్యాయి. బుధవారం సాయంత్రం విజయవాడ నుంచి కడప జిల్లా బద్వేల్‌కు వెళ్తున్న కారు, మోటార్ సైకిల్‌ను ఢీకొన్నాయి. ఈ సంఘటనలో మోటార్ సైకిల్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. చిలకలూరిపేట మండలం గణపరం నుంచి మోటార్ సైకిల్‌పై ప్రమాద బారినపడ్డారు. హైవే పోలీసులు గాయపడిన వ్యక్తులను హాస్పిటల్‌కు తరలించారు. బద్వేల్‌కు చెందిన కారు డ్రైవర్ మురళికి ఎటువంటి గాయాలు కాలేదు.

మందుబాబుకు జరిమానా

అద్దంకి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి కోళ్ల వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తిని బుధవారం అద్దంకి కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి అఖిల రూ.3 వేలు జరిమానా విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

నేడు చెన్నుపల్లిలో మంత్రి రవికుమార్ పర్యటన

బల్లికురవ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నుపల్లిలో గురువారం జరగనున్న రైతన్నా.. మీకోసం కార్యక్రమానికి విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సాయంత్రం 3-30 గంటలకు చెన్నుపల్లి, 4-30 గంటలకు గుంటుపల్లి, 5 గంటలకు అంబడిపూడి, 5-30 గంటలకు కొత్తమల్లాయపాలెం, 6 గంటలకు కొప్పెరపాలెం, 6-30 గంటలకు మార్టూరులో జరిగే కార్యక్రమాలకు మంత్రి పాల్గొంటారని అధికారులు తెలిపారు.

ఆక్రమణదారులకు నోటీసులు

వాడరేవు-పిడుగురాళ్ల హైవేకి ఇరు వైపులా ఆక్రమణలు తొలగించి కాలువల ఏర్పాటుకు చర్యలు

కలెక్టర్ ఆదేశాలతో కదలిన యంత్రాంగం

ఇటీవల తుఫాన్ మిగిల్చిన నష్టం మళ్లీ కలగకుండా చర్యలు

నేడు విచారణ



పర్చూరు వాగు సమీపంలో కొలతలు వేసి హద్దులు నిర్ణయిస్తున్న అధికారులు(ఫైల్)

పర్చూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి(167ఏ)కి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి కాలువలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సంసిద్ధమయ్యారు. ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో కాలువలు పొంగిపోయి పర్చూరు ప్రాంతాన్ని వరద నీరు ముంచెత్తింది. దీంతో ఆయా గ్రామాలతోపాటు పంట పొలాలు సైతం ముంపునకు గురయ్యాయి. వరద పోటెత్తడంతో భారీ నష్టం కలిగింది.

నూతనంగా ఏర్పాటు చేస్తున్న వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణంలో ఇరువైపులా డ్రైనేజ్ కాలువలు ఏర్పాటు చేయకపోవటం వల్ల భవిష్యత్‌లో వరద వస్తే భారీ నష్టం వాటిల్లుతుందని అధికారులు గుర్తించారు. ఇలాంటి దుస్థితి పునరావృతం కాకుండా ఉండాలంటే కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అందులో భాగంగా పర్చూరు వాగు నుంచి వై జంక్షన్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా కాలువలు తవ్వేందుకు హద్దులు వేయాలని జాతీయ రహదారుల సంస్థ ఈఈ ఈనెల 1న లేఖ రాశారు. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల నేపథ్యంలో పర్చూరు పంచాయతీ, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఇటీవల కొలతలు వేసి హద్దులు నిర్ణయించి సంబంధిత ఆక్రమణదారుల వివరాలు సేకరించారు. ఆక్రమణలు ఎందుకు తొలగించకూడదో ఈనెల 27వ తేదీన వివరణ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీచేశారు. విచారణ అనంతరం ఆక్రమణలు తొలగించి కాలువలను అభివృద్ధి చేస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే ఆక్రమణలు తొలగింపు అనివార్యమని ఉన్నతాధికారులు సైతం స్పష్టం చేశారు.

అంబేడ్కర్‌కు వాడవాడలా నివాళులు

యద్దనపూడి(మార్టూరు), నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం యద్దనపూడి ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్‌కే మహమ్మద్ అకీబ్ జావెద్, పంచాయతీ కార్యదర్శి శ్రీను, ఏపీవో రమేష్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

పంగులూరులో...

పంగులూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదవాడ జడ్‌పీ హైస్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దారు పోఫూరి సింగారావు, డిప్యూటీ ఎంపీడీవో సుమంత్, ప్రధానోపాధ్యాయులు రఘురామయ్య, పంచాయతీ కార్యదర్శి యర్రం సీతారావమ్మ పాల్గొన్నారు.

చినగంజాంలో...

చినగంజాం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహాత్మాగాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు ఎంపీడీవో కె.ధనలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించార. కార్యక్రమాల్లో రీ సర్వే డీటీ సుజాత, ఏవో పూర్ణచంద్రరావు, గ్రామ సచివాలయం-2 కార్యదర్శి ఎం.వెంకటరమణ, జూనియర్ అసిస్టెంట్ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చీరాల ప్రాంతంలో...

చీరాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేవీపీఎస్, రాజకీయ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చీరాల పట్టణంలో రాజ్యాంగం ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముక్కోణం పార్కు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో లింగంపల్లి జయరాజ్, ఎన్ బాబురావు, గుమ్మడి ఏసురత్నం, రత్నప్రకాష్, గోసాల సుధాకర్, మార్పు దీనరాజ్, విజయ్ పాల్గొన్నారు. మండల పరిధిలోని దేవాంగపురి శంకరయ్య మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సుభాషిణీ ఆధ్వర్యంలో రాజ్యాంగం ఆమోదం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు మాక్ అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారం ప్రదర్శించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీలిమ, ప్రసన్నకుమారి, రత్నమాణిక్యం, లక్ష్మీ పాల్గొన్నారు.

పర్చూరులో...

పర్చూరు, కారంచేడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం పర్చూరు, కారంచేడు మండలాల పరిధిలో ఘనంగా నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా పర్చూరు బాలికల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్చూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.జాన్‌బాబు, జాయింట్ సెక్రటరీ కాసా అశోక్‌కుమార్, హెచ్‌ఎం ఎస్.అవని పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి



మార్టూరులో బైక్ ర్యాలీ చేస్తున్న రైతు సంఘంనాయకులు

అద్దంకిటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్‌ను రద్దు చేయ్యాలని బాపట్ల జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో దేశవ్యాప్తంగా నవంబరు 26 రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా కార్మిక, రైతు సంఘాల నిరసన పిలుపులో భాగంగా నిరసన వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలోసభ్యులు కే.నాగేశ్వరరావు, ఆదాం, శామ్యూల్, గణేష్, తోట వెంకటేశ్వర్లు, దాసరి ఆలివేలమ్మ, ఎం. కోటయ్య, మార్కు పాల్గొన్నారు.

రైతు సంఘాల నేతల నిరసన ర్యాలీ

మార్టూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు సెంటర్లో బుధవారం రైతుసంఘాలు, సీఐటీయూ నాయకులు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ద్విచక్రవాహనాలపై నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు నల్ల చట్టాలను రద్దుచేయాలని, విద్యుత్‌ను ప్రైవేటీకరించవద్దని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని నినాదాలిచ్చారు. అనంతరం తహసీల్దారు ప్రశాంతికి వినతిపత్రం అందచేశారు. వీరవల్లి కృష్ణమూర్తి, బత్తుల హనుమంతరావు, సూరిబాబు, మోహనరావు, రాంబాబు పాల్గొన్నారు.

ఇంకొల్లులో...

ఇంకొల్లు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండు చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇంకొల్లులో బైక్ ర్యాలీ నిర్వహించారు. కిసాన్ మోర్చా మండల కన్వీనర్ నాగండ్ల వెంకట్రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండు చేశారు. జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు నేతృత్వంలో తహసీల్దారు శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోవిందురాజులు,బాచిన కోటేశ్వరరావు, హనుమంతరావు, గోవిందరెడ్డి, శంకర్, ఆదియ్య, మాదాల అంజియ్య పాల్గొన్నారు.

ఆ రైతులకూ అన్నదాత సుఖీభవ..!

ఈనామ్, అగ్రహారం భూములు సాగు చేసుకునే వారికి ఊరట

1,434 మంది ఖాతాల్లో రూ.1.43 కోట్ల జమ

రెండు విడతల నగదు ఒకేసారి..

హర్షం వ్యక్తం చేస్తున్న పలు గ్రామాల రైతులు

ప్రత్యేక దృష్టి సారించి నిధులు విడుదల చేయించిన గొట్టిపాటి

అద్దంకి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా అగ్రహారం, ఈనామ్ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు మొదటి విడతలో అన్నదాత సుఖీభవ నిధులు జమకాలేదు. ఈ కారణంగా అద్దంకి నియోజకవర్గంలోని సంతమాగులూరు, బల్లికురవ మండలాలలోని అగ్రహారం, ఈనామ్ భూములు సాగు చేసుకుంటున్న రైతులు నిరుత్సాహానికి గురయ్యారు. ఈ విషయాన్ని వారు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకుపోయారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి.. ఆ సమస్యను సీఎం చంద్రబాబునాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెనాయుడు దృష్టికి తీసుకుపోయారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వాటాగా ఇచ్చే నగదును అగ్రహారం, ఈనామ్ భూములు సాగు చేసుకునే రైతులకు కూడా వర్తింపచేసేలా కృషి చేశారు.



దీంతో మొదటి విడత, రెండవ విడత నిధులు ఒకే సారి జమ చేయించారు. రెండు విడతలకు కలిపి 10 వేల రూపాయలు జమయ్యాయి. ఇలా 1434 మంది రైతులకు 1.43 కోట్ల రూపాయలు రైతుల బ్యాంక్ ఖాతాలలో పడ్డాయి.

సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు, మక్కెనవారిపాలెంలలో మొత్తం 1,373 మంది రైతులు అగ్రహారం, ఇనామ్ భూములు సాగు చేసుకుంటుండగా వారిలో 976 మందికి 97.60 లక్షల రూపాయలు, బల్లికురవ మండలం చెన్నుపల్లిలో 879 మంది రైతులు ఉండగా 462 మందికి 46.20 లక్షల రూపాయలు జమయ్యాయి. సాంకేతిక కారణాలతో మరో 814 మంది రైతులకు ఇంకా నిధులు జమకాలేదు. క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి అర్హులైన రైతులను గుర్తించి జాబితా తయారు చేయాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. నిధులు జమకాని వారిలో ఎక్కువ మంది ఉమ్మడి కుటుంబంలో సభ్యులుగా ఉండి ఒకే రేషన్ కార్డులో సభ్యులుగా ఉండటం, ఈకేవైసీ చేయించుకొని ఉండకపోవటం తదితర కారణాలతో నిధులు జమకాలేదని తెలుస్తుంది. అర్హుల జాబితా సిద్ధమైన తరువాత మంత్రి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి అన్నదాత సుఖీభవ నిధులు జమచేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. రెండు విడతల నిధులు ఒకే సారి బ్యాంక్ ఖాతాలలో జమ కావటంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకాశంలో అద్దంకి ప్రకటనతో అన్ని వర్గాల హర్షం

అద్దంకి,నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ మిషన్ డైరెక్టర్ నాగినేని రామకృష్ణ చెప్పారు. అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో చేర్చటంతోపాటు అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మంత్రి వర్గం చేసిన ప్రతిపాదనలను సీఎం చంద్రబాబునాయుడు అంగీకరించిన నేపథ్యంలో బుధవారం అద్దంకిలో హర్షం వ్యక్తం కేక్ కట్‌చేశారు. స్థానిక పోతురాజు గండిలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం కేక్‌ను కట్ చేశారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అద్దంకి మండల, పట్టణ పార్టీల అధ్యక్షుడు మానం మురళీమోహన్‌దాస్, అరిగల నాగరాజు, కరి పరమేష్, కాకాని అశోక్, కుందారపు రామారావు, స్టాలిన్, గాలం శ్రీనివాసరావు, రాజశేఖర్, కరిముల్లా, శ్రీనివాసరావు, గోపి పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో...

అద్దంకిని ప్రకాశం జిల్లాలో చేర్చటం, రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయటం పట్ల అద్దంకి తాలూకా ఉద్యోగుల సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్‌జీవో సంఘ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మంత్రి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అద్దంకి తాలూకా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కిరణ్‌కుమార్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న రామకృష్ణ, తదితరులు

అవీఇవీ

మత్స్యకార యువకుడు మృతి

సుమారు 15 అడుగుల వంతెనపై నుంచి జారిపడినట్లు ఆనవాళ్లు

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

ఇటీవలే ఓ యువతితో నిశ్చితార్థం



ఓసిపిల్లి మోషే(ఫైల్)

ఈపూరుపాలెం(చీరాల), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఓ మత్స్యకార యువకుడు మంగళవారం అర్ధరాత్రి అనుమానాస్పదరీతిలో దుర్మరణం చెందాడు. అందిన వివరాల ప్రకారం... చీరాల మండల పరిధిలోని దానాయిపేటకు చెందిన ఓసిపిల్లి మోషే(26) మత్స్యకారుడు. ఇటీవలే ఇతనికి ఓ యువతితో నిశ్చితార్థం కూడా జరిగింది. వచ్చే ఏడాది వేసవిలో వివాహానికి పెద్దలు సిద్ధపడ్డారు. ఇదిలా ఉంటే.. మోషే కొద్ది రోజులుగా మిత్రులు ముత్యాలు, మనోజ్‌తో కలిసి గ్రామంలోని చర్చి సమీపంలోని ఓ ఇంట్లో రోజూ రాత్రిపూట నిద్రిస్తున్నారు. ఈక్రమంలోనే మంగళవారం రాత్రి కూడా పడుకున్నారు. రాత్రి 11 గంటల సమయం వరకు మిత్రులతో కలిసి పడుకున్న మోషే అర్ధరాత్రి సమయంలో స్కూటీతో సహా 167 ఏ వాడరేవు - పిడుగురాళ్ల నూతన జాతీయ రహదారి ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ వద్ద ప్రస్తుతం సగం పూర్తయిన ఆర్వోబీ వంతెన వద్ద తీవ్ర రక్తస్రావంతో విగతజీవిగా పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీఐ నాగభూషణం మృతుని వేలిముద్ర ఆధారంగా ఫోన్ లాక్ ఓపెన్ చేసి కొన్ని నెంబర్లకు ప్రయత్నించగా మృతుని వివరాలు చెప్పారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు అవగాహన లోపంతోనే పూర్తికాని వంతెనవైపు ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో మృతుడు ఒంటరిగా సుమారు 5 కిలోమీటర్లు ప్రయాణించడంపై పలు సందేహాలు రేకెత్తుతున్నాయి.

రాష్ట్రస్థాయి బేస్ బాల్ జట్టుకు ముగ్గురు బాలికలు



ఎంపికైన ముగ్గురు బాలికలతో ఉపాధ్యాయులు

మార్టూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ బాలికల జట్టుకు మండలంలోని కోలలపూడి జడ్‌పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు బాలికలు ఎంపికయ్యారు. మైనంపాడులో రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ బాలికల జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో అండర్ 17 జట్టుకు హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థినులు ఎం.భాగ్యశ్రీ, కె రాధికాశ్రీలక్ష్మిలు ఎంపికయ్యారు. అదేవిధంగా అండర్ 14 విభాగంలో 8వ తరగతి విద్యార్థిని వై అర్చనా హేమశ్రీ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం హైస్కూల్‌లో ముగ్గురు బాలికలను ప్రధానోపాధ్యాయులు కృష్ణప్రసాద్, పీఈటీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రవి, కరిముల్లా, ఉషశ్రీ, నాగమ్మలు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాగుండాలి

జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రాధామాధవి



మాట్లాడుతున్న పీడీ రాధామాధవి

ఇంకొల్లు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాధామాధవీ సూచించారు. ఇంకొల్లు రోటరీ గంగా భవనంలో బుధవారం సీడీపీవో సులోచన ఆధ్వర్యంలో ప్రాజెక్టు సమావేశం జరిగింది. ఇంకొల్లు, చినగంజాం, కారంచేడు మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వాణీ, లీలావతి, హిమబిందు, సునీత, సుమలత, ఉషారాణి పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా మరియమ్మ బాధ్యతలు



మరియమ్మకు ఉత్తర్వులు అందజేస్తున్న అధికారులు

వేటపాలెం(చీరాల), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల డిప్యూటీ ఎంపీడీవోగా బుధవారం జే మరియమ్మ బాధ్యతలు చేపట్టారు. బాపట్ల మండల పరిధిలోని ఇప్పటి వరకు ఈవోగా పనిచేసిన ఆమె ఉద్యోగోన్నతిపై వచ్చారు. ఈ క్రమంలో ఎంపీడీవో రాజేష్‌బాబు, ఇతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

పూసపాడు విద్యార్థికి లోకేష్ అభినందనలు

ప్రొటెం స్పీకర్‌గా ఎంపిక



రాజశేఖర్‌ను అభినందిస్తున్న నారా లోకేష్

ఇంకొల్లు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యార్థి మాక్ అసెంబ్లీకి ఇంకొల్లు మండలంలోని పూసపాడు ఎస్‌కేఏవీఎస్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఆలూరి రాజశేఖర్ పర్చూరు నియోజకవర్గం నుండి ఎంపికయ్యాడు. మొత్తం 175 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా రాజశేఖర్‌ను ప్రొటెం స్పీకర్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్, రాజశేఖర్‌ను అభినందించారు. రాజశేఖర్ ఎంపిక పట్ల ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, కరెస్పాండెంట్ ప్రసాద్‌లు అభినందించారు.

భాస్వరం ఎరువులు దుక్కిలోనే వేసుకోవాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న హెచ్‌వో దీప్తి

అద్దంకి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న, శనగ పంట సాగు చేసే రైతులు ముందుగా భాస్వరం ఎరువులను దుక్కిలోనే వేసుకోవాలని మండల ఉద్యానశాఖ అధికారిణి ఎస్. దీప్తి సూచించారు. బుధవారం మండలంలోని నాగులపాడు, వేలమూరిపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో సాగు చేస్తున్న పలు ఉద్యాన పంటను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, వీఏఏ చాందిని పాల్గొన్నారు.

డెల్టాకు 10,150 క్యూసెక్కుల నీరు సరఫరా

అనంతసాగరం నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి బుధవారం 14,826 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో ప్రాజెక్టులో 73.054 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ ఉత్తర కాలువకు 400, డెల్టాకు 10,150, కండలేరుకు 2,200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

4వేల బస్తాల బియ్యం బొక్కేశారు! 8 లో..
- ఎంఎల్ఎస్ గోదాములో అధికారుల బృందం తనిఖీలు

ఆనందం

- మూడున్నరేళ్ల నిరీక్షణకు తెర
- తిరిగి ప్రకాశంలోకి కందుకూరు
- అన్నివర్గాల ప్రజల్లో హర్షం



కందుకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు నియోజకవర్గ ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయం పట్ల అన్ని వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. నాటి వైసీపీ సర్కారు కేవలం 45 కి.మీ దూరంలో ఉన్న ప్రకాశం జిల్లా నుంచి తప్పించి 120 కి.మీ దూరంలో ఉన్న నెల్లూరులో కలిపారు. 2022, ఏప్రిల్ 4న అప్పటి వైసీపీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వగా అన్ని పార్టీలు, ప్రజాసంఘాల నేతృత్వంలో భారీస్థాయిలో ఆందోళనలు జరిగాయి. కానీ ఇవేమీ నాటి పాలకులు పట్టించుకోకుండా నెల్లూరులో విలీనం చేసేశారు. దీంతో రాష్ట్రంలో రెండవ అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా 24 మండలాలతో భాసిల్లిన కందుకూరు డివిజన్ కేవలం 7 మండలాలతో డివిజన్‌గా మారి చావుతప్పి కన్నులొట్టపోయినట్టు అయ్యింది. అనేక డివిజన్‌స్థాయి కార్యాలయాలు కందుకూరు నుంచి ఇతర డివిజన్లకు తరలిపోయాయి.

● మాట నిలబెట్టుకున్న చంద్రబాబు, లోకేష్

యువగళం పాదయాత్రలో భాగంగా కందుకూరుకు వచ్చిన టీడీపీ యువనేత నారా లోకేష్‌కు నియోజకవర్గ ప్రజలు తమ ప్రధాన ఆకాంక్షను తెలపగా టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రకాశం జిల్లాలో విలీనం చేస్తామని తెలిపారు. అదేవిధంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా కందుకూరు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సైతం ఈ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కందుకూరును ప్రకాశంలో కలిపేందుకు తుదినిర్ణయం తీసుకోవటం పట్ల ప్రజలు హర్షిస్తున్నారు.

● పూర్వవైభవం వచ్చేలా చూడాలి

కందుకూరును మళ్లీ ఏడు మండలాలకే పరిమితం చేస్తుండటం పట్ల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. నెల్లూరులో విలీనం అయ్యాక కందుకూరు డివిజన్‌లో కలిపిన కొండాపురం, వరికుంటపాడు మండలాలను తప్పించి వాటిస్థానంలో కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు, మర్రిపూడి మండలాలను కలుపుతూ నిర్ణయం తీసుకోవటంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. కందుకూరులోని 5 మండలాలతోపాటు కొండపి నియోజకవర్గంలోని ఐదు మండలాలను కూడా కందుకూరులో విలీనం చేయటం ద్వారా ఇక్కడ నుంచి తరలిపోయిన డివిజన్ కార్యాలయాలు తిరిగి కందుకూరుకు వచ్చేలా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు కందుకూరు నియోజకవర్గ వాసుల్లో ఆనందం నింపగా, కలువాయి, రాపూరు, సైదాపురం మండలాల వాసుల్లో ఆగ్రహం తెప్పించింది. ఈ మూడు మండలాలను నెల్లూరులోనే ఉంచాలని కోరుతున్నారు.

ప్రజల ఆందోళనలు ఫలించాయి



మూడున్నర సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుదూరంగా ఉన్న నెల్లూరు చుట్టూ తిరగలేక ప్రజలు అల్లాడిపోవటంతో పాటు జిల్లా కేంద్రానికి సుదూరంగా ఉన్న కందుకూరుకు వచ్చేందుకు ఉద్యోగులు కూడా ఇష్టపడని పరిస్థితుల్లో ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్‌లు ఇచ్చిన మాటకు కట్టుబడి కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల ఈ ప్రాంత ప్రజల్లో వారి పట్ల గౌరవం పెరిగింది.

- పాలేటి కోటేశ్వరరావు, మాలసంఘాల జేఏసీ రాష్ట్ర నాయకుడు

ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు!



పాదయాత్రలో యువనేత నారా లోకేష్, ఎన్నికల ప్రచారసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా చంద్రబాబు కందుకూరును ప్రకాశం జిల్లాలోనే విలీనం చేయాలని మంత్రుల కమిటీకి సూచన చేయటంతో మనకు మేలుజరిగే నిర్ణయం జరిగింది. ఈ నిర్ణయంతో కూటమి ప్రభుత్వానికి నియోజకవర్గ ప్రజలు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నారు.

- శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు, కరేడు, ఉలవపాడు మండలం

ఆగ్రహం

రాపూరుపై మిశ్రమ స్పందన

రాపూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల పునర్విభజనలో భాగంగా రాపూరు మండలాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేసేందుకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేయడంపై మండల వాసుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. వెంకటగిరి నియోజకవర్గంలో ఉన్న రాపూరును నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని కొందరు, తిరుపతి జిల్లాలో కలిస్తే మేలని ఇంకొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలకు నష్టం జరిగిందని ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన దీక్షలు చేపట్టారు. దీంతో అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి కూడా మద్దతు తెలపడంతో - మిగతా 8వ పేజీలో...

తిరుపతి ఎక్కడ.. కలువాయి ఎక్కడ?




కలువాయి మండలాన్ని 70 కి.మీ దూరంలో ఉన్న నెల్లూరు నుంచి తొలగించి 140 కి.మీ దురాన ఉన్న తిరుపతిలో కలపడం ప్రజలకు చాలా అసౌకర్యం. అలాగే 41 కిలోమీటర్లలో ఉన్న ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ మార్చి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న గూడూరులో కలపడం ఎంత వరకు న్యాయం. కలువాయి నుంచి తిరుపతికి వెళ్లి రావాలన్నా ఆర్థిక భారంతో పాటు రాత్రికి ఇంటికి చేరే పరిస్థితి ఉండదు.

- నాగిరెడ్డి రాజారెడ్డి, కలువాయి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు

అంత దూరం కష్టమబ్బా!

కలువాయి టు తిరుపతి 140 కి.మీ
డివిజన్ కేంద్రానికీ పెరగనున్న దూరం
వ్యతిరేకిస్తున్న మండలవాసులు

కలువాయి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలు, డివిజన్ల పునర్విభజనలో భాగంగా కలువాయి మండలాన్ని గూడూరు రెవెన్యూ డివిజన్‌లోకి, తిరుపతి జిల్లా పరిధిలోకి తీసుకెళుతూ మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు చేసింది. అయితే, ఈ ప్రతిపాదనపై మండల వాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో కలువాయి ఉండగా డివిజన్ కేంద్రానికి 45 కి.మీ దూరం ఉంది. అయితే, మండల కేంద్రం నుంచి గూడూరుకు 80 కి.మీ ఉంటుంది. అలాగే ప్రస్తుతం జిల్లా కేంద్రం నెల్లూరుకు 70 కి.మీ దూరం ఉంది. తిరుపతి జిల్లాకు మారిస్తే 140 కి.మీ దూరం పెరుగుతుంది. దగ్గర ఉన్న రెవెన్యూ డివిజన్, జిల్లా కేంద్రాన్ని దూరంగా మార్పు చేస్తే వ్యయప్రయాసలు పడాల్సి వస్తుందని మండల వాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో ఉన్న కలువాయి మండలాన్ని గత వైసీపీ హయాంలోనే - మిగతా 8వ పేజీలో...





పొదలకూరు : డేగపూడి వద్ద బేస్‌మెంట్ దశలోనే హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం

ఏడాదిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పూర్తి

- రాష్ట్ర ప్రభుత్వ కార్యాచరణ
- రూ. 12.91 కోట్లు విడుదల

విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు సొంత భవనాల నిర్మాణం ఒక కొలిక్కి వస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగా, అసలు నిర్మాణానికే నోచుకోని వాటిని ఏడాదిలోపు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా రూ. 12.91 కోట్ల నిధులు కూడా విడుదల చేసింది. ఈ నేపథ్యంలో పెండింగ్ భవనాలను పూర్తి చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ టెండర్లు పిలుస్తోంది. ఇప్పటికే కొన్ని టెండర్లు ఖరారయ్యాయి. ఈ క్రమంలో హెల్త్ క్లినిక్‌లకు పట్టిన గ్రహణం వీడనుంచి.

వివరాలు 8లో...

ఎవరా ఇద్దరు.. ఎందుకు చంపేశారు!?

- చింతలపాలెంలో టీడీపీ నేత దారుణ హత్య
- కోళ్లఫారంలో కత్తులతో పొడిచి హతమార్చిన ఆగంతుకులు
- పోలీసుల ముమ్మర దర్యాప్తు
- నిందితుల కోసం ప్రత్యేక బృందాలు
- రాజకీయాలకు సంబంధం లేదు : డీఎస్పీ
- వ్యక్తిగత కారణాలపై ఆరా తీస్తున్నాం

పూర్తి వివరాలు 8లో...



గొట్టిపాటి ప్రసాద్ నాయుడు (ఫైల్)

ఇరవై ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ అందరి మన్ననలు అందుకుంటున్న జలదంకి మండలం చింతలపాలెంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు గొట్టిపాటి ప్రసాద్ నాయుడు (58) బుధవారం హత్యకు గురవడం తీవ్ర కలకలం రేపింది. ఉదయం తన కోళ్లఫారంలో ఉన్న ప్రసాద్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఆరుచోట్ల విచక్షణారహితంగా కత్తులతో పొడిచి హతమార్చారు. కోళ్ల కొనుగోళ్లకు వచ్చిన ఇద్దరు వ్యక్తులే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుండగుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. ప్రసాద్‌నాయుడు హత్య బయటి వ్యక్తుల పనేనని కావలి డీఎస్పీ శ్రీధర్ స్పష్టం చేశారు. ఇది రాజకీయ హత్య కాదని, వ్యక్తిగత హత్యగా భావిస్తున్నట్లు తెలిపారు. అన్ని కోణాల్లో విచారించి నిందితులను పట్టుకుంటామని ఆయన స్పష్టం చేశారు.



సంగంలో వందడుగుల జాతీయ జెండా ప్రదర్శన

రాజ్యాంగమే మనకు రక్ష

ఘనంగా భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవం



నెల్లూరులో ర్యాలీ

భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని జిల్లాఅంతటా బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రాజకీయ పార్టీల ఆఫీసుల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు నివాళులర్పించారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులు, రాజ్యాంగం కల్పించే రక్షణపై ప్రముఖులు, న్యాయ నిపుణులు అవగాహన కల్పించారు. కాగా, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులు నిర్వహించిన మాక్ పార్లమెంటు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఏం చేద్దాం!

- మేయర్ కుర్చీ వీడాల్సిందేనా!?
- అంతర్మథనంలో స్రవంతి అనుచరగణం
- అందరి చూపు అవిశ్వాసంపైనే!
- ఆసక్తి రేపుతున్న నెల్లూరు రాజకీయం

ప్చ్... పరిస్థితులు తారుమారు అయ్యాయి. నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయిన నాటినుంచి మేయర్‌ని గద్దె దింపేందుకు అధికార పార్టీలో జరుగుతున్న దూకుడుతో పొట్లూరి స్రవంతి అనుచరులు తలలుపట్టుకుంటున్నారు. కార్పొరేటర్ల ఫిర్యాదుతో పదవిని కోల్పోతే అధికార దర్పం ఎలా? కార్పొరేషన్ నుంచి రావాల్సిన బిల్లులు సంగతేంటి? ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడులు ఎలా వస్తాయి? అంటూ ఆందోళన చెందుతున్నారు. మరోవైపు సొంత పార్టీ పెద్దలే స్రవంతితో తమకు ఎలాంటి సంబంధం లేదని తేల్చేశారు. ఇటు ఆమెను పదవి నుంచి దించేయాల్సిందేనని టీడీపీ పట్టుపట్టుకు కూర్చుంది. దీంతో నెల్లూరు నగరపాలక సంస్థ రాజకీయం ఆసక్తికరంగా మారింది.

నెల్లూరు (సిటీ), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సరిగ్గా నాలుగేళ్ల క్రితం మేయర్ కుర్చీపై అధిష్ఠించిన స్రవంతి మూడున్నరేళ్లపాటు సిటీ నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడలేదు. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న అనిల్ కుమార్ యాదవ్ ఆమెను సిటీలోకి అనుమతించలేదు. దీంతో రూరల్‌కే పరిమితమయ్యారు. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అభివృద్ధి కార్యక్రమాల్లో మేయర్‌ను భాగస్వామిని చేసి ప్రాధాన్యత ఇచ్చారు. కొన్నాళ్లకి భవన నిర్మాణ అనుమతుల్లో జోక్యం పెరగడంతో ఆమెతోపాటు ఆమె భర్తను దూరంపెట్టారు. అనంతరం సార్వత్రిక ఎన్నికల వేళ ఎమ్మెల్యే టీడీపీలోకి వచ్చాక మేయర్ వైసీపీలోనే ఉన్నారు. సిటీప్లానింగ్ విభాగాన్ని అదుపులోకి తెచ్చుకున్న ఆమె భర్త జయవర్ధన్ మార్టిగేజ్ విడుదల్లో ఐఏఎస్ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు బలమైన ఆరోపణలు ఎదుర్కొని జైలుపాలయ్యారు. ఆ పిదప మరో ఐఏఎస్ అధికారి సీసీని గదిలో బంధించి మరోమారు జైలు జీవితం అనుభవించారు. ఇలా అనేక ఆరోపణలు చవిచూసిన మేయర్ రాజకీయంగా ఒక్కొక్కరి మద్దతుకు దూరమవుతూ వచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక వైసీపీకి రాజీనామా చేశారు. తదుపరి టీడీపీలోకి రావాలని ఆశించినా కుదరలేదు. దీంతో పాటు డిప్యూటీ మేయర్ ఎన్నిక విషయంలోనూ గొర్రాజు రవడం వైసీపీ నాయకులకు కోపం తెప్పించింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం అదే పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్రవంతికి తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని అధికారికంగా తేల్చేశారు. దీంతో ఆమె ప్రస్తుతం రాజకీయంగా ఒంటరి అయ్యారు.



● చుట్టూ అవినీతి ఆరోపణలు

మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి స్రవంతి చుట్టూ అవినీతి ఆరోపణలు తిరుగుతూనే ఉన్నాయి. కార్పొరేషన్ బడ్జెట్‌లో పేషీ ఖర్చుల పేరిట రూ. లక్షలు డ్రా చేస్తున్నట్లు చూపుతున్న ఆమె ఆ మేరకు లెక్కలు చూపకపోవడం కార్పొరేటర్ల మధ్య తుకూ దూరమైంది. కాగ కార్పొరేషన్ ఆమె కారుకు ప్రతీ నెల రూ.60 వేలు చెల్లిస్తోంది. డ్రైవర్, డీజిల్ ఖర్చులకు అందులోనే వాడుకోవాలి. కానీ ఆమె కార్పొరేషన్ డ్రైవర్లతోపాటు, డీజిల్ ఎన్ఎంసీ పెట్రోల్ బంకుల నుంచి వాడుతున్నట్లు కార్పొరేటర్లు చెబుతున్నారు. దీనిపై ఆరోపణలు గుప్పుమన్నా ఒక్కసారి కూడా వివరణ ఇవ్వకపోవడం విశేషం. కౌన్సిల్, బడ్జెట్ సమావేశాల్లో భోజన, టిఫిన్ ఖర్చుల పేరిట రూ. లక్షలు బిల్లులను అత్యధిక రేట్లు చూపి ఆమె అనుచరదళం డ్రా చేశారన్న ఆరోపణలున్నాయి. పదోతరగతి విద్యార్థులకు మున్సిపల్ స్కూళ్లలో టిఫిన్ పెట్టిన క్రమంలో వాస్తవాలకు దూరంగా రూ.లక్షల బిల్లులు పెట్టారు. ఇందులోనూ బలమైన - మిగతా 7వ పేజీలో...



ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మాపై కక్ష గట్టారు!

- ఏమైనా ఉంటే నేరుగా ఎదుర్కోండి
- మేయర్ పదవిపై రూప్ కుమార్ కన్నేశాడు!
- మేయర్ స్రవంతి దంపతులు

నెల్లూరురూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తమపై కక్షగట్టారని మేయర్ స్రవంతి దంపతులు ఆరోపించారు. బుధవారం కార్పొరేషన్‌లోని తన చాంబరులో వారు విలేకరులతో మాట్లాడారు. ఒకటిన్నర ఏడాదిగా తమ పై అనేక రూపాల్లో కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని తెలిపారు. అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టేందుకు కార్పొరేటర్లతో జేసీకి ఫిర్యాదు చేయించారని, ఆ మేరకు తమ గిరిజన నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతి ఇచ్చేందుకు మంగళవారం వీఆర్సీ కూడలి వద్దకు వెళ్లారన్నారు. అక్కడికి కూడా తన మనుషులను పంపి తమ వద్ద ఉండే యువకులను బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. సిరాజ్ అనే యువకుడి ఇంటికి పోలీసులను, అనుచరులను పంపి భయభ్రాంతులకు - మిగతా 7వ పేజీలో...



తన వద్ద ఫైల్స్ నమోదు వివరాలు చూపుతున్న మేయర్ స్రవంతి, పక్కనే ఆమె భర్త జయవర్ధన్

నోరు అదుపులో పెట్టుకో జయవర్ధన్!

- రోడ్డుపై తిరిగే మిమ్మల్ని మేయర్‌ను చేయలేదా!?
- ఇష్టానుసారం మాట్లాడితే నాలుక కోస్తాం
- టీడీపీ నాయకుల ధ్వజం

నెల్లూరురూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : 'జయవర్ధన్... నోరు అదుపులో పెట్టుకో.. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని ఏకవచనంతో మాట్లాడితే నాలుక కోస్తాం.' అంటూ నెల్లూరురూరల్ టీడీపీ నాయకులు మేయర్ దంపతులపై ధ్వజమెత్తారు. బుధవారం నెల్లూరులోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నాయకులు మదన్‌కుమార్‌రెడ్డి, అరవ శ్రీను, సాబీర్‌ఖాన్, నాగమణి తదితరులు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని నమ్ముకుని ఉన్నారన్న ఒకే ఒక్కకారణంతో రోడ్డు మీద తిరిగే మిమ్మల్ని తీసుకువచ్చి మేయర్‌ను చేసింది కోటంరెడ్డి సోదరులు కాదా...? అని ప్రశ్నించారు. మరోసారి అలా మాట్లాడితే నాలుక కోస్తామని హెచ్చరించారు. ఐఏఎస్ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి రూ.కోట్ల ప్రజాధనం దారిమళ్లించిన కేసులో, మరో ఐఏఎస్ అధికారి సీసీని కొట్టిన కేసులో జైలుకు వెళ్లావే తప్ప ఎమ్మెల్యే ప్రమేయం ఇందులో ఏమి లేదన్నారు. రూపాయి ఖర్చులేకుండా కార్పొరేటర్‌ను చేసి ఆపై మేయర్‌గా మీ భార్యకు అవకాశం ఇచ్చిన కోటంరెడ్డి సోదరులను దుయ్యపట్టడం మానుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	218
స్కిన్‌లెస్	242

కోడిగుడ్ల ధర (100): 660



ఆకట్టుకున్న మాక్ అసెంబ్లీ

కలిగిరి, నవంబరు26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ముఖ్యమంత్రి, స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేల పాత్రల్లో విద్యార్థినీ విద్యార్థులు ఆకట్టుకున్నారు. రాజ్యాంగ విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కందుకూరును ప్రకాశం జిల్లాలో విలీనం హర్షణీయం

● మాజీ ఎమ్మెల్యే శివరాం

కందుకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో విలీనం చేసేలా మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేయటం హర్షణీయమని కందుకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా అప్పటి వైసీపీ ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో విలీనం చేసి ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందని, అప్పట్లో రెండునెలలపాటు పెద్దఎత్తున ఆందోళనలు చేసినా ఫలితం లేకుండాపోయిందని గుర్తుచేశారు. అయితే ప్రజల బాగోగుల పట్ల చిత్తశుద్ధి ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్‌లు ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ప్రకాశం జిల్లాలో విలీనం చేయించటం హర్షణీయమన్నారు. నియోజకవర్గ ప్రజల తరపున వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు శివరాం పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ఇంటూరి కృషి ఫలితమే

● బెజవాడ ప్రసాద్, జేఏసీ కన్వీనర్

కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపాలన్న ఈప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులదేనని జేఏసీ కన్వీనర్ బెజవాడ ప్రసాద్ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా కృషిచేసి ఎమ్మెల్యే సఫలీకృతుడయ్యాడని తెలిపారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళం

కందుకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ పునర్నిర్మాణం కోసం పట్టణానికి చెందిన చల్లా మధుసూదనరావు, రమాదేవి దంపతులు రూ. 25116 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు పిడికిటి వెంకటేశ్వర్లు, మంచిరాజు మురళీమోహన్‌కు ఆలయ ప్రాంగణంలో బుధవారం అందజేశారు.

'రైతన్నా మీ కోసం' కరపత్రాల పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కావలి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌదరిపాలెంలో స్థానిక టీడీపీ నాయకుడు గోరంట్ల రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం రైతన్నా మీ కోసం' కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్రిష్టారెడ్డి ఆదేశాల తో సోమశిల నీటిని చెరువులకు మళ్లించి, సాగు, తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పోకూరి రాంబాబు, గొంది వెంకటేశ్వర్లు, బత్తుల రవి, మండువ శ్రీనివాసులు, కంటు రమేష్‌బాబు, చిడిపోతు వెంకటేశ్వర్లు, మండువ శ్రీనివాసులు, కంటు గణేష్, రైతులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



చుండి సచివాలయంలో సిబ్బంది హాజరు రిజిస్టరును పరిశీలిస్తున్న ఎంపీడీవో శంకర్‌రావు

వలేటివారిపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సేవలు అందించాలని ఎంపీడీవో శంకర్‌రావు సూచించారు. మండలంలోని చుండి గ్రామ సచివాలయాన్ని బుధవారం ఎంపీడీవో తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

'క్లీన్ విలేజ్- గ్రీన్ విలేజ్'పై శిక్షణ

కావలి రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో 'క్లీన్ విలేజ్ - గ్రీన్ విలేజ్'పై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

కావలి (టౌన్) నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం బుధవారం పట్టణంలో ఘనంగా జరిగింది. బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బ్రిడ్జి కూడలి ట్రంకు రోడ్డులో గల అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ సీనియర్ నాయకులు కుట్టుబోయిన బ్రహ్మానందం, ఏపీ జీఎస్టీ మండలి సభ్యులు అమరా సుబ్బారావు భారత రాజ్యాంగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్, సుందర్‌శెట్టి సుజి, సుధాకర్, వాయుగండ్ల సుధీర్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జేబీ డిగ్రీ కళాశాలలో...

స్థానిక జేబీ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ సభ నిర్వహించారు. రాజనీతి శాస్త్రం విభాగాధిపతి నాగేశ్వరరావు, విశ్రాంత చరిత్ర అధ్యాపకులు డాక్టర్ కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ రాజ్యాంగం కేవలం ఓ పుస్తకం కాదని, విలువలకు మార్గదర్శకమైన పవిత్ర గ్రంధమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం నాయుడు, స్వయం ఉపాధి కోర్సుల సంచాలకులు డాక్టర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

డీబీఎస్ కళాశాలలో...

స్థానిక డీబీఎస్ కళాశాలలో ప్రిన్సిపాల్ టీవీ రావు అధ్యక్షతన జరిగిన రాజ్యాంగ దినోత్సవ సభలో ప్రొఫెసర్ దేవ కుమార్ పాల్గొని రాజ్యాంగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సుధీర్‌నాయుడు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కావలి : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనతెలుపుతున్న దళితనేతలు



అంబేద్కర్, గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్పీడీవో, సిబ్బంది

● రాజ్యాంగం అమలుకు పోరాడుదాం

కావలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలోని హక్కుల పరిరక్షణకు పోరాడాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిరసన తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగం సక్రమంగా అమలయ్యేలా బడుగు వర్గాలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యానాది సమాఖ్య అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ, దళిత నాయకులు విజయరత్నం, వాసు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

● ఎంపీడీవో కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం

కావలి రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కావలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీదేవి ఆధ్వర్యంలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కొండాపురం, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆదినారాయణరావు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ నడుచుకోవాల్సి ఉందన్నారు. సాయిపేట దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల టీడీపీ కన్వీనర్ పోలినేని చంద్రబాబునాయుడు, ఏవో శేషసాయి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఒక వర్గానికే పరిమితం కాదు

అల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ రూపకర్త, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించిన మహానేత అంబేద్కర్ అని, ఆయనను ఒకే వర్గానికి పరిమితం చేయడం సరికాదని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అల్లూరు పాతబస్టాండు కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. 2015లో రాజ్యాంగ దినోత్సవాన్ని జాతీయ దివస్‌గా నామకరణం చేసిన నేపథ్యంలో ప్రతీ ఒక్కరం పండుగలా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగపట్నం సతీష్, బుట్టి నిరంజన్, కాకాని యశ్వంత్ కుమార్, చెంతాటి బబ్లు, కలిచేటి వెంకటేష్, నేతగాని వికాస్, నేతగాని విక్కి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో అంబేద్కర్‌కు నివాళి

కందుకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగదినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇతర టీడీపీ నేతలతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, బెజవాడ ప్రసాదు, అల్లం వెంకటేశ్వర్లు, షేక్ రూబీ, కొత్తూరి వెంకటసుధాకర్, చుండూరి శ్రీనివాసరావు, శ్రీధర్, కళ్యాణ్, శివ తదితరులు పాల్గొన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలోనూ ఆపార్టీ స్థానిక నాయకులు భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టరు ఏడుకొండలు నరేంద్ర, అధ్యాపకులు పి. రాజగోపాలబాబు, ఎస్వీ శ్రీహరి, కె.సుజాత, డాక్టరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. బీటీపీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీటీపీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కల్లగుంట మోహనరావు, డివిజన్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా, నాయకులు చొప్పర కొండలరావు, మెండా వెంకటరావు, తలారి శేషా రావు, మాజీ కౌన్సిలర్ రేణమాల అయ్యన్న పాల్గొన్నారు.

● ఉలవపాడు : భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు రెవెన్యూ కార్యాలయంలో, ఎంపీడీవో సురేష్ మండల పరిషత్ కార్యాలయంలో, ఎసై అంకమ్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో, పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రాజ్యాంగం విశిష్టతను తెలుసుకోవాలి

లింగసముద్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి తహసీల్దార్ ఎం కోటేశ్వరరావు, ఆర్ఐ ఎం రమణయ్య, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగం విశిష్టత, హక్కుల గురించి తహసీల్దార్ కోటేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సిబ్బంది, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం : మండల పరిషత్ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం బుధవారం ఘనగా నిర్వహించారు. ఈ సందర్భంగా బి.ఆర్ అబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో వెంకటనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దళితులు



వలేటివారిపాలెం ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో, సిబ్బంది



టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు



ఉలవపాడులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన తహసీల్దార్ శ్రీనివాసులు, సిబ్బంది



లింగ సముద్రంలో అంబేడ్కర్‌కు నివాళి...

నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరారవు

లింగసముద్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని తిమ్మారెడ్డి పాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్మించిన అనుబంధ వసతిగృహాన్ని ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్జార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణలోని సరస్వతి దేవి విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద బాలికలు 9వ తరగతి నుంచి సీనియర్ ఇంటర్ వరకు 40 మంది ఇందులో ఉండి చదువుకునేందుకు సౌకర్యం కల్పించబడిందన్నారు. రాబోయే రోజుల్లో మరి కొంతమందికి ఈ హాస్టల్‌లో సౌకర్యం కల్పిస్తామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఎస్ఏ ప్రాజెక్టు సహాయ కోఆర్డినేటర్ డి వెంకటేశ్వర్లు, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి మమత, ఎంఈఓ 1, 2 లు కె మాల్యాద్రి, ఎంవి శివకుమార్, మండల టీడీపీ అధ్యక్షుడు పి గురునాథం, ఎస్ఎంసీ చెర్మన్ యు మధు, తహసీల్దార్ ఎం కోటేశ్వరరావు, ఎంపీడీఓ కె శ్రీనివాసులు, ఎంపీటీసీ డి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు పి చిననాగిరెడ్డి, ఎన్ బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మానవతా విలువలు పెంచాలి

వలేటివారిపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మానవతా విలువలు పెంచాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని చుండి మోడల్‌స్కూల్‌లో హాస్టల్ భవనాన్ని బుధవారం పునఃప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అమలవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు కమిషనర్ డి వెంకటసుబ్బయ్య, డిసిడివో మమత, మోడల్‌స్కూల్ ప్రిన్స్‌పాల్ వెంకటేశ్వర్, మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు చెరువుపల్లి మాల్యాద్రి, కామినేని అశోక్, కామినేని వీరయ్య, చెరువుపల్లి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో బాలికల వసతి గృహం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లేబర్ కోడ్‌లు ఉపసంహరించుకోవాలి

● సీఐటీయూ నిరసన

వలేటివారిపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌ల నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో సీఐటీయూ కార్యకర్తలతో కలిసి బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గౌస్‌బాషా, సరస్వతి, చెంచులక్ష్మీ, సంపూర్ణ, మల్లిక, సుజాత, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

● ఉలవపాడు : కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని మండల సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు జీవీబీ కుమార్ మాట్లాడుతూ కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయకుంటే ఆందోళనకు పూనుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కోకన్వీనర్ సీహెచ్ ఇందిరావతి, మండల కోశాధికారి నాశం శ్రీదేవి, సహాయ కార్యదర్శి వాకా లతారెడ్డి, కమిటీ సభ్యులు వసంత, మహిత పాల్గొన్నారు.

ఆ కోడ్లు రద్దు చేయాలి

కావలి (టౌన్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా చేసిన నాలుగు లేబర్ కోడ్ల నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని బుధవారం స్థానిక ట్రంకు రోడ్డులో కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్‌కె రెహానాబేగం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులు కాలరాసేందుకు 29 కార్మిక చట్టాలను సవరించి 4 లేబర్ కోడ్లు తీసుకొచ్చిందన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న హక్కులను కాలరాయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఏఐటీయుసీ నాయకులు దుర్గాబాబు, శ్యామల, కరవది భాస్కర్, సీపీఎం నాయకులు పెంచలయ్య, ఏఐటీయుసీ నాయకులు బోసు, ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కావలి : నిరసన ర్యాలీలో పాల్గొన్న కార్మికులు

చంద్రమౌళి కుటుంబానికి న్యాయం చేయాలి

కలిగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి చెందిన నల్లపనేని చంద్రమౌళి కుటుంబానికి న్యాయం చేయాలంటూ తొగురువారిపాలెం గ్రామస్తులు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 17న కలిగిరి మండలం చిన్నచెరువు వద్ద ఆటోను ట్రాక్టరు ఢీకొన్న ఘటనలో తొగురువారిపాలెం గ్రామానికి చెందిన నల్లపనేని చంద్రమౌళి (63) అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడి చెన్నైలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. చంద్రమౌళి మృత దేహాన్ని కుటుంబసభ్యులు చెన్నై నుండి అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకెళ్తూ కలిగిరి పోలీస్‌స్టేషన్ వద్ద ఆగారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోకుండా, బాధ్యులపై చర్యలు తీసుకోకుండా పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. చంద్రమౌళి కుటుంబానికి ట్రాక్టరు యజమాని పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ ఉమాశంకర్ మాట్లాడుతూ అంబులెన్స్‌తో పోలీసు స్టేషన్‌వద్దకు రావడం పద్ధతి కాదన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని బాధితులకు తెలిపారు. నష్టపరిహారం అందించేందుకు ట్రాక్టర్ యజమాని అంగీకరించడంతో మృతదేహాన్ని స్టేషన్‌వద్ద నుండి స్వగ్రామానికి తీసుకెళ్లారు.



ఎస్ఐ ఉమాశంకర్‌తో మాట్లాడుతున్న గ్రామస్థులు

ఏం చేద్దాం!

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అంతేగాక మేయర్ చాంబరుతోపాటు పేషీ మరమ్మతు పనుల్లో వాస్తవ విరుద్ధంగా బిల్లులు పెట్టారన్న విమర్శలున్నాయి.

● బిల్లులు వస్తాయా!?

ప్రస్తుత ప్రభుత్వం మేయర్‌పై అవిశ్వాస తీర్మానం రాజకీయంగా దుమారం రేపుతోంది. ప్రధానంగా మేయర్ అనుచర దళం అనేక రూపాలలో పనులు చేసినట్లు బిల్లులు కార్పొరేషన్‌లో దాఖలు చేశారు. ఈ ప్రక్రియ వివిధ సెక్షన్ల వద్ద ఉంది. అన్నీ కలిపి సుమారు రూ.60 లక్షల వరకు బిల్లులు మేయర్ దళం నుంచి వెళ్లాయి. ఇవన్నీ మంజూరు అవుతాయా...? లేదా..? తిరిగి విజిలెన్స్ విచారణ జరుపుతారా...? అన్నది అయోమయంగా మారింది. అవిశ్వాసం చర్చ తెరపైకి వచ్చినప్పటి నుంచి ఆమె అనుచర దళం ఆందోళనకు గురవుతోంది. ఈ మేరకు అధికార పార్టీలో బిల్లులపై పునఃసమీక్షించాలన్న డిమాండ్ అధికారుల వద్దకు చేరడం గమనార్హం.

మాపై కక్షగట్టారు!

(5వ పేజీ తరువాయి)

గురి చేస్తున్నారని వాపోయారు. ఏదైన సమస్య ఉంటే తమతో నేరుగా ఎదుర్కోవాలని హితవు పలికారు. ఎందాకైనా పోరాటానికి, ప్రాణత్యాగానికి సంసిద్ధులమై ఉన్నట్లు చెప్పారు. ఇక్కడ జరుగుతున్న కీచక పర్వంపై టీడీపీ అధిష్ఠానం, ప్రభుత్వ పెద్దలు ఆరా తీయాలని విజ్ఞప్తి చేశారు. తమ పదవిపై డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ కన్నేశాడని, అనేక దఫాలుగా తమ వద్దకు వచ్చి సెలవుపై వెళ్లాలని, అలా వెళ్తే ఇన్‌చార్జి మేయర్‌గా ఉండవచ్చని తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చినట్లు చెప్పారు. తాము అభివృద్ధిని అడ్డుకుంటున్నామని రూప్‌కుమార్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారు చెప్పినట్లు తాము అవినీతికి పాల్పడితే ఇప్పటివరకు చూస్తూ ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు.

ఘనంగా మాగుంట సుబ్బరామిరెడ్డి జయంతి

కావలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి జయంతిని బుధవారం కావలి పట్టణంలో టీడీపీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులో గల సుబ్బరామిరెడ్డి విగ్రహానికి పార్టీలకతీతంగా పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత మాగంట మనవడు మాగుంట చిన సుబ్బరామిరెడ్డి తన అనుచరులతో మాగుంట విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి టీడీపీ నాయకులతో కలిసి మాగుంట విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా మాగుంట సుబ్బరామిరెడ్డి తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేశాడని కొనియాడారు. రాజకీయంగా తనను ఉన్నత స్థానంలో నిలబెట్టిన మాగుంట కుటుంబానికి ఎప్పటికీ రుణ పడి ఉంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ లీగల్‌సెల్ నియోజకవర్గ కన్వీనర్ గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, జ్యోతి బాబూరావు, అమరావేదగిరి, తటవర్తి వాసు, దేవకుమార్, టీడీపీ, ఇతర ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు.



సుబ్బరామిరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు



ఉత్సాహంగా పారా క్రీడాకారుల పోటీలు

నెల్లూరు(విద్య), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి పారా క్రీడాకారుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా హాజరైన 110 మంది క్రీడాకారులకు బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, టేబుల్‌టెన్నిస్, స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారు గుంటూరులో డిసెంబరు 1, 2 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. అనంతరం అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన పారా స్పోర్ట్స్ క్రీడాకారులు వీ భవాని, బీ శ్రీహరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ మహ్మద్‌ఆయూబ్, డీఎస్‌డీవో ఎం.పాండురంగారావు, పారా స్పోర్ట్స్ సంఘం ప్రతినిధులు మాల్యాద్రి నాయుడు, యాదగిరి, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

భళా.. 'బాల' నాయకా!

ఖద్దరు పంచెలు.. కండువాల్లో ముచ్చటగా బాలురు.. చీరలు ధరించి, చేతిలో ఫైల్స్ పట్టుకుని బాలికలు.. అభినవ ప్రజాప్రతినిధులై మాక్ అసెంబ్లీకి హాజరయ్యారు. మనుబోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 'బాల' నాయకులు ముచ్చటైన వేషధారణలో తళుక్కుమన్నారు. మండలంలోని 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బుధవారం





రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. అనంతరం చిన్నారులతో నిర్వహించిన మాక్ అసెంబ్లీ ఆద్యంతం అలరించింది. ఉపన్యాసాలతో చిన్నారులు అదరగొట్టారు. అసెంబ్లీ నిర్వహణ, ప్రజా సమస్యలు, ప్రశ్నోత్తరాలు తదితర అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

- మనుబోలు (ఆంధ్రజ్యోతి)

విలేజ్ హెల్త్ క్లినిక్‌లు

ఏడాదిలో పూర్తి

- ఆ దిశగా ప్రభుత్వ కసరత్తు
- రూ.12.91 కోట్లు విడుదల
- జిల్లాలో 495 క్లినిక్‌ల నిర్మాణానికి అనుమతులు
- పూర్తయినవి 259 మాత్రమే
- మిగిలిన 236 పనులకు టెండర్లు

నెల్లూరు (వైద్యం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు మరింత విస్తరించేందుకు గత వైసీపీ ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రారంభించింది. మండలంలోని పీహెచ్‌సీలకు అనుబంధంగా ఇవి పనిచేసేలా, ఆయా ఆరోగ్య కేంద్రాలలో బీఎస్సీ నర్సింగ్ చేసిన ఉద్యోగి ఉండేలా, వారి వద్ద 54 రకాల మందులు అందుబాటులో ఉంచుకునేలా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ క్లినిక్‌లలోనే భవిష్యత్తులో పలు వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయాలని నాటి ప్రభుత్వం నిర్ణయించింది. క్లినిక్‌ల బాధ్యతల నిర్వహణకు మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)ను విడతల వారిగా నియమించింది. ఈ కేంద్రాల్లో చిన్న చిన్న వ్యాధులకు చికిత్సలు అందిస్తారు. ఏవైనా అత్యవసర కేసులు వస్తే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, ఏరియా ఆసుపత్రులకు సిఫార్సు చేస్తారు.

● గత ప్రభుత్వంలో అసంపూర్తి

గత వైసీపీ ప్రభుత్వం 2020 మార్చిలోనే విలేజ్ హెల్త్ క్లినిక్‌లు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాలో మొత్తం 495 హెల్త్ క్లినిక్‌లు నిర్మించాలని భావించింది. మూడు గదులతో ఈ క్లినిక్‌లకు శాశ్వత భవనాలు నిర్మించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 50 శాతం, వైద్య శాఖకు చెందిన మరో 50 శాతం నిధుల భాగస్వామ్యంతో నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అయితే వాటిపై సమగ్రంగా దృష్టి పెట్టకపోవటంతో ఇప్పటి వరకు 259 క్లినిక్‌లకు మాత్రమే భవనాలు పూర్తయ్యాయి. మిగిలినవి అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇందుకోసం అద్దె రూపంలో ప్రభుత్వం ఏటా రూ.లక్షలు చెల్లిస్తోంది. పెండింగ్ భవనాల్లో కొన్ని పునాదుల దశలో, మరికొన్ని పిల్లర్ల దశలో ఉండా దాదాపు 80 హెల్త్ సెంటర్లు అసలు నిర్మాణాలకే నోచుకోలేదు. కొన్ని గ్రామాలలో అయితే అసలు స్థల సేకరణ కూడా జరగకపోవడం గమనార్హం. ఈ నేపథ్యం లో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఆయా నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించింది. పెండింగ్‌లో ఉన్న 236 విలేజ్ హెల్త్ క్లినిక్ లు పూర్తి చేసేందుకు టెండర్లు పిలవటమే కాకుండా వాటిని పనికి ఆహార పథకం కింద 15 ఆర్థిక సంఘం నిధులతో పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందిం చింది. కొన్ని నిర్మాణాలకు టెండర్లు పిలవడం తో నిర్మాణాలు మొదలయ్యాయి. గత ప్రభుత్వంలో ఒక్కో నిర్మాణానికి రూ. 17 లక్షలు ఖర్చవుతుండగా ప్రస్తుతం భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం రూ. 26 నుంచి రూ. 35 లక్షలు కేటాయించింది. దీంతో కాంట్రాక్టర్లు కూడా ముందుకు వచ్చి నిర్మాణాలు చేపడుతున్నారు.



పొదలకూరు మండలం డేగపూడి గ్రామంలో బేస్‌మెంట్ దశలోనే నిలిచిపోయిన హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం



భవనాలు త్వరలో అందుబాటులోకి..

జిల్లాలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు త్వరలో అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నాము. రాష్ట్ర ప్రభుత్వం తాజా ప్రకటనలతో ఏడాదిలోనే నిర్మాణాలు పూర్తయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం అద్దె భవనాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నడుస్తున్నాయి. వాటికి అద్దె రూపంలో లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నాము. భవనాలు పూర్తయితే ఆ భారం కూడా తొలగిపోతుంది.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో



టెండర్లు పిలిచి పనులు అప్పగిస్తున్నాం

నిర్మాణానికి నోచుకోని విలేజ్ హెల్త్ సెంటర్ల భవన నిర్మాణాలకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగిస్తు న్నాం. వాటిని త్వరలో పూర్తి చేస్తాం. నాలుగేళ్లకుపైగా వాటి నిర్మాణాలు జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వ చొరవ కారణంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయ తీరాజ్ నిధులతో నిర్మాణాలు జరుగుతున్నాయి.

- కోటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ



కలెక్టరేట్ శంకరన్ హాల్లో భారత రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్ తదితరులు

ప్రజాస్వామ్య విలువలకు భారత రాజ్యాంగం మూలస్తంభం

- జాతీయ న్యాయ దినోత్సవంలో జేసీ వెంకటేశ్వర్లు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య విలువలకు భారత రాజ్యాంగం మూలస్తంభమని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జాతీయ న్యాయదినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ శంకరన్ హాల్లో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి శాశ్వత విలువలను ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిందన్నారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దూరదృష్టి వలనే భారదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా నిలిచిందని తెలిపారు. యువత, విద్యార్థులు రాజ్యాంగంపై అవగాహ న పెంపొందించుకుని దేశాభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా పౌరసంబంధాలశాఖ కార్యాలయంలో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి పీ.వేణుగోపాల్‌రెడ్డి కార్యాలయ సిబ్బందితో కలిసి జాతీయ న్యాయ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక సమానత్వం, శాంతి, సామరస్యం, జాతీయ ఐక్యతను కాపాడుతూ రాజ్యాంగ విలువలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులతో జాయింట్ కలెక్టర్, డీఈవో, అధికారులు

నెల్లూరు(విద్య), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా శారీరకంగా, మానసికంగా సంసిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలను బుధవారం ఆయన కలెక్టరేట్‌లో అభినందించి మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రాధాన్యత, గొప్పతనం గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. యువత దేశంలో స్వేచ్ఛగా అన్ని రంగాల్లో రాణించేందుకు రాజ్యాంగం ఎంతో దోహదం చేస్తుందన్నారు. పౌరులు తమ హక్కులను వినియోగించుకోవడంతో పాటు రాజ్యాంగంలో పేర్కొన్న బాధ్యతలను కూడా తప్పక పాటించాలని తెలిపారు. డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోటీలను నిర్వహించి ప్రథమ స్థానం సాధించిన వారిలో నియోజకవర్గానికి ఒకరి చొప్పున అమరావ తిలో జరిగిన మాక్ అసెంబ్లీకి పంపించామన్నారు. తర్వాత స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు జిల్లాస్థాయిలో బహుమతులు అందచేస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగం మేధస్సు సమ్మేళనం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) భారత రాజ్యాంగం గొప్ప మేధావుల, స్వాతంత్ర్య సమర యోధుల, న్యాయ నిపుణుల మేధస్సు సమ్మేళనమని జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవా సదన్ భవన్‌లో భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులపాటు జరిగిన చర్చల్లో, 11 సమావేశాల్లో 165 రోజులపాటు సభ్యులు అత్యంత శ్రద్ధతో ప్రతి ఆర్టికల్‌ను పరిశీలించారని, చివరకు నవంబరు 26, 1949న రాజ్యాంగం ఆమోదం పొంది, జనవరి 26, 1950న అమలులోకి వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరి కే వాణి, న్యాయాధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే బార్ అసోసియేషన్ అధ్వర్యంలో కూడా న్యాయవాదులు భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని జరుపుకున్నారు.

ఏఆర్ కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందన



ఏఆర్ కానిస్టేబుల్ చరణ్‌తేజను అభినందిస్తున్న ఎస్పీ అజిత వేజెండ్ల

నెల్లూరు(క్రైం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ గేమ్స్-2025లో పెన్‌కాక్ సిలాట్ విభాగంలో బంగారు పతకం సాధించిన నెల్లూరు ఏఆర్ కానిస్టేబుల్ కే చరణ్‌తేజను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబరు నెలలో జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఈ పోటీలో బంగారు పతకం సాధించడం అభినందనీయమన్నారు.

క్షయ నివారణ కార్యక్రమాలు 100 శాతం పూర్తి చేయాలి : కోర్ కమిటీ

నెల్లూరు (వైద్యం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయ వ్యాధి నివారణ కార్యక్రమాలు వచ్చే మూడు నెలల్లో 100 శాతం పూర్తి చేసేలా కార్యాచరణతో ముందుకు వెళ్లాలని కోర్‌కమిటీ తీర్మానించింది. బుధవారం ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఆ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, పల్మనాలజీ హెచ్‌వోడీ అరుణ, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి ప్రసంగించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రేవతి, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

4వేల బస్తాల బియ్యం బొక్కేశారు!

- ఎంఎల్ఎస్ గోదాములో అధికారుల బృందం తనిఖీలు
- 8 గంటలు నిర్విరామంగా రికార్డుల పరిశీలన
- వేల బస్తాల బియ్యం పక్కదారి పట్టినట్లు అంచనా



ఎంఎల్ఎస్ గోదాములో సరుకుల నిల్వలను పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారుల బృందం

ఉదయగిరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎంఎల్ఎస్ గోదామును పౌరసరఫరాల శాఖ రాష్ట్ర ప్రధాన కార్యాలయ అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. ఆ శాఖ జిల్లా మేనేజర్ అర్జున్‌రావుతో కలిసి నిత్యావసర వస్తువుల నిల్వలు, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసింది. గోదాములో బియ్యం పక్కదారి పట్టాయని జిల్లా అధికారులు నివేదిక ఇవ్వడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారు గోదాములో తనిఖీలు చేపట్టారు. అనంతరం సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు మాసాలకు సంబంధించిన స్టాకు రికార్డులను పరిశీలించేందుకు చర్యలు చేపట్టింది. సెప్టెంబరు, అక్టోబరు మాసాల రికార్డులు పరిశీలించే సరికి సాయంత్రం 6 గంటలు కావడం, గోదాములో సక్రమంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో కొంతసేపు సెల్‌ఫోన్ వెలుగుల్లోనే రికార్డులు పరిశీలించారు. గోదాములో సుమారు 4 వేల బియ్యం బస్తాలు స్వాహా అయినట్లు తనిఖీ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నుంచి లిఖితపూర్వకంగా వివరణ తీసుకున్నారు. అనంతరం రికార్డులన్నింటిని విజయవాడ తరలించి నవంబరు మాసానికి సంబంధించిన రికార్డులు సైతం అక్కడే పరిశీలించి రెండు, మూడు రోజుల్లో పూర్తి నివేదిక అందజేస్తామని తెలిపారు. కాగా అధికారుల బృందం ప్రశ్నించినప్పుడు గోదాములో పని చేస్తున్న ఉద్యోగులు తమకేమీ తెలియదని సమాధానం ఇచ్చినట్లు సమాచారం. వేల బస్తాల బియ్యాన్ని పెద్దలు తిన్నారో, పందికొక్కులు తిన్నాయో అధికారులే తేల్చాలి.

దివ్యాంగులకు భరోసా

- వంద శాతం రాయితీతో త్రీ వీలర్ మోటారు వాహనాలు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ● ఈ నెల 30 వరకు గడువు

చేజర్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అండగా నిలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దివ్యాంగుల పింఛను మొత్తాన్ని ఆరు వేల రూపాయలకు పెంచింది. దివ్యాంగులకు సంబంధించిన మోటారు సైకిళ్లకు 50 శాతం పెట్రోలు రాయితీ ఇస్తోంది. తాజాగా లక్షా ఇరవై వేల రూపాయలు విలువ చేసే మూడు చక్రాల మోటారు వాహనాలను వంద శాతం రాయితీతో ఉచితంగా అందజేయనుంది. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి గడువును ఈ నెల 30 వరకూ పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా రెట్రోఫిట్ త్రీ వీలర్ మోటారు వాహనాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పదో తరగతి ఉత్తీర్ణులై స్వయం ఉపాధి పొందుతున్న, ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న విభిన్న ప్రతిభావంతులకు ఈ వాహనాలను ఉచితంగా అందజేయనుంది. డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు కూడా వీటిని పొందవచ్చు. ఈ నెల 30 లోగా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఏపీడీఏఎస్‌సీఏసీ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారు. జిల్లాకు మొత్తం 70 వాహనాలు మంజూరు అయినట్లు విభిన్న ప్రతిభా వంతుల శాఖ ఏడీ ఆయుబ్ పేర్కొన్నారు.



అర్హతలు...

- ఒకటి లేదా రెండు కాళ్ళు ప్రభావితమై 70 శాతం వైకల్యం ఉన్నవారు.
- రెండు చేతులు సక్రమంగా ఉండాలి.
- 18 నుంచి 45 సంవత్సరాలలోపు వయసు ఉండాలి.
- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ద్వారా ఇంతకు ముందు వాహనం తీసుకోకుండా ఉండాలి.
- డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి.
- వార్షిక ఆదాయం మూడు లక్షల లోపు ఉండాలి.
- తెల్లరేషను కార్డు తప్పనిసరి.
- ఆధార్, రేషన్ కార్డు, 10వ తరగతి మార్కుల లిస్ట్, వైకల్యానికి సంబంధించిన సదరం సర్టిఫికెట్, క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్, ప్రస్తుతం అందుతున్న పింఛను పుస్తకం ఉండాలి.
- డ్రైవింగ్ లైసెన్స్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్, అంగవైకల్యం చూపే విధంగా ఉన్న ఫొటోను జత చేస్తూ సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

అంతదూరం కష్టమబ్బా!

(5వ పేజీ తరువాయి)

తిరుపతి జిల్లాలో కలపాలని ప్రతిపాదించారు. అయితే దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చి, ఉద్యమించారు. అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కూడా ఈ ఉద్యమానికి మద్దతు ఇస్తూ ప్రభు త్వం దృష్టికి తీసుకుపోవడంతో కలువాయిని నెల్లూరు జిల్లాలోనే ఉంచారు. అయితే, ఇప్పుడు మళ్లీ తిరుపతి జిల్లాలో చేర్చనున్నట్లు మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాపూరుపై మిశ్రమ స్పందన

(5వ పేజీ తరువాయి)

వెంకటగిరి నియోజకవర్గంలోని మూడు మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించేలా అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నెల్లూరు పరిధిలో ఉన్న రాపూరును తిరుపతి జిల్లాలో విలీనం చేయడాన్ని కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నెల్లూరుకు 60 కి.మీ దూరం ఉండగా, తిరుపతికి 90 కి.మీ ఉంటుందని, ప్రయాణ సౌలభ్యం అసౌకర్యంగా ఉంటుందని, ప్రజాభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు సైదాపురం మండలాన్ని కూడా నెల్లూరులోనే ఉంచాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

చింతలపాలెంలో టీడీపీ నేత దారుణ హత్య

- కోళ్లఫారంలో కత్తులతో పొడిచి హతమార్చిన ఆగంతుకులు
- పోలీసుల ముమ్మర దర్యాప్తు
- నిందితుల కోసం ప్రత్యేక బృందాలు
- రాజకీయాలకు సంబంధం లేదు : డీఎస్పీ

జలదంకి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చింతలపాలెం గ్రామంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు టీడీపీ నాయకుడు గొట్టిపాటి ప్రసాద్ నాయుడు (58)ను దారుణంగా హత్య చేశారు. కోళ్లఫారంలో ఉన్న ఆయన్ను కత్తులతో ఆరుచోట్ల పొడిచి హతమార్చారు. అనంతరం దుండగులు ప్రసాద్ నాయుడు ముఖంపై ఓ గోతాము కప్పి పరారయ్యారు. పోలీసుల కథనం మేరకు..

గట్టుపల్లి పంచాయతీ చింతలపాలెంలో ఇటీవల చనిపోయిన ఓ వ్యక్తికి బుధవారం ఉదయం కర్మక్రతువులు జరిగాయి. శ్మశానానికి ఎదురుగానే మృతుడు ప్రసాద్ నాయుడుకు చెందిన కోళ్లఫారం ఉంది. వచ్చిన వారంతా బంధువులు కావడంతో అందరితో ప్రసాద్‌నాయుడు మాట్లాడి వెళ్లిపోయారు. ఆ తర్వాత తన స్నేహితుడు వేణుతో కలిసి ప్రసాద్ నాయుడు కోళ్లఫారంలో ఉండగా 11.20 గంటల ప్రాంతంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి 5 కిలోల కోళ్లు కావాలని అడిగి బేరం కుదుర్చుకుని ఇప్పుడే వస్తామని వెళ్లిపోయారు. కాసేపటికి వేణు కూడా ఇంటికి వెళ్లిపోయాడు. రైసుమిల్లు నుంచి వడ్ల పొట్టు తీసుకురావడం కోసం ట్రాక్టర్ డ్రైవర్ గంగాధర్ 12 గంటల ప్రాంతంలో కోళ్లఫారం వద్దకు వచ్చాడు. ఫోన్ చేసినా ప్రసాద్ నాయుడు తీయకపోవడంతో లోపలకు వెళ్లిచూడగా, ప్రసాద్‌నాయుడు రక్తపుమడుగులో పడి ఉన్నాడు. వెంటనే ఆయన గ్రామస్థులకు ఫోన్ చేసి విషయం తెలపడంతో అందరూ పరుగున కోళ్లఫారం వద్దకు చేరుకున్నారు. ప్రసాద్ నాయుడు మెడ, గుండె, పొట్ట భాగాలలో ఆరు చోట్ల కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసినట్లు గుర్తించారు. కావలిలో ఉంటున్న సోదరుడు వెంకటేశ్వర్లు నాయుడు ఘటనాస్థలికి చేరుకుని బోరున విలపించాడు. కావలి డీఎస్పీ శ్రీధర్, కలిగిరి సీఐ వెంకటనారాయణ, జలదంకి ఎస్ఐ లతీఫున్నీసా తమ సిబ్బందితో కోళ్లఫారం వద్దకు చేరుకుని ఘటనాస్థలిని పరిశీలించారు. అనంతరం కుటుంబసభ్యులను, గ్రామస్థులను విచారించిన పోలీసులు హత్యకు గల కారణాలు, అనుమానితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంల నిందితుల ఆనవాళ్లను సేకరించారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసు అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రాథమిక పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా, హత్యకు గురైన ప్రసాద్‌నాయుడు భార్య లక్ష్మీ ప్రసన్న చెన్నైలో నివాసం ఉంటుండగా ఇద్దరు కుమార్తెలు వాసవి, తేజస్వినిలకు వివాహమై స్వీడన్ దేశంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటున్నారు.



ఘటనాస్థలిలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, డీఎస్పీ శ్రీధర్ ఇతర పోలీస్ అధికారులు

● ఆ ఇద్దరు ఎవరు!?

కోళ్ల కోసం వచ్చిన ఆ ఇద్దరు ఎవరనేది మిస్టరీగా మారింది. ఆ ఇద్దరే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారా!? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. డీఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ ప్రసాద్‌నాయుడు హత్య బయట వ్యక్తుల పనేనని స్పష్టం చేశారు. ఇది రాజకీయ హత్య కాదని, వ్యక్తిగత హత్యగా భావిస్తున్నట్లు తెలిపారు. అన్ని కోణాల్లో విచారించి నిందితులను పట్టుకుంటామని స్పష్టం చేశారు.

● 20 ఏళ్లుగా క్రియాశీలక రాజకీయాల్లో..

గట్టుపల్లి పంచాయతీ రాజకీయాలలో మృతుడు ప్రసాద్ నాయుడు గత 20 ఏళ్లకు పైబడి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన తండ్రి జనార్దన్ నాయుడు సర్పంచ్‌గా, తల్లి ఇందిరమ్మ ఎమ్పీటీసీ సభ్యురాలిగా, సోదరుడు వెంకటేశ్వర్లు నాయుడు సొసైటీ అధ్యక్షుడిగా ఉన్నకాలంలో అన్ని రాజకీయ వ్యవహారాలు ప్రసాద్‌నాయుడు చూస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేవారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించేవాడని గ్రామస్థులు తెలిపారు.

● ఎమ్మెల్యేల సంతాపం

టీడీపీ నేత గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు హత్య జరిగిన విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి చింతలపాలెం చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి సంతాపం వ్యక్తం చేశారు. అలాగే ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు.



నిందితుల కోసం డాగస్క్వాడ్ వేట